తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 30.06.2026 | సంపుటి :12 సంచిక : 341 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698





## త్రిభాషా విధానం నుంచి 'పది'కి మినహాయింపు

### సీబీఎస్ఈ ప్రకటన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** త్రిభాషా విధానం అమలుపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తాజా మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో భాగంగా, ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రం మూడు భాషలు చదవాలనే నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చింది. 2026-27 విద్యా సంవత్సరంలో ఈ నిబంధన నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఒకసారి మాత్రమే వర్తించే వెసులుబాటును కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఈ విద్యార్థులు రెండు విదేశీ భాషలు.. ఒక భారతీయ భాషను చదవొచ్చని తెలిపింది. జులై 1

మిగతా 9లో..



# నేడు రైతుభరోసా నిధులు విడుదల

## తొలిదఫా 41.37 లక్షల మంది అన్నదాతలకు లబ్ధి

## తొలుత రెండెకరాల వరకు పథకం నిధులు జమ

- మిగతావారికి దశలవారీగా విడుదల చేస్తాం: మంత్రి తుమ్మల
- భారీ వర్షాలతో ఖమ్మంలో సీఎం ఆశీర్వాద సభ రద్దు
- నేడు శిల్పకలా వేదికగా కార్యక్రమం నిర్వహణ

**హైదరాబాద్ (జనంసాక్షి):** రైతు భరోసా నిధుల విడుదలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. రేపటి నుంచి రైతుల ఖాతాల్లో నిధుల జమ చేస్తామని తెలిపారు. అర్హులైన అన్నదాతలకు పెట్టుబడి సాయంగా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. మొత్తంగా 10 రోజుల్లో అందరికీ నిధులు జమచేస్తామన్నారు.రైతుభరోసా నిధుల విడుదల కోసం ఖమ్మం జిల్లా మధిరలో 'రైతు ఆశీర్వద సభ'ను నిర్వహించాలని ప్రభుత్వం తొలుత భావించింది. తొలి విడత నిధులు జమచేయాలని ప్లాన్ చేసింది. అయితే ఖమ్మంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి ఇవాళ ఏర్పాటుచేయాలని భావించిన రైతు మేళా మంగళవారం కార్యక్రమం కోసం ఏర్పాటుచేసిన సభా ప్రాంగణం వద్ద ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రైతు మేళా, రైతు ఆశీర్వాద సభను ప్రభుత్వం రద్దు చేసింది.రైతు భరోసా నిధుల విడుదల కోసం రైతు ఆశీర్వాద సభకు బదులుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించాలని సీఎం రేవంత్?రెడ్డి ఆదేశించారు.

మిగతా 2లో..



### మూసీ నది ప్రాజెక్టుతో ఎవరికీ

# అన్యాయం జరగదు

## నిర్వాసితుల పరిహారం, పునరావాసంలో రాజీ లేదు

- నదీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాది
- అభివృద్ధి,మానవీయత రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతాం
- భూ సేకరణ, పునరావాసంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి): మూసీ ప్రాజెక్టుతో ఎవరికీ అన్యాయం జరగనీయబోమని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మానవీయ కోణంలో భూసేకరణ చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. మూసీ ప్రాజెక్టు భూసేకరణ, పునరావాసంపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇళ్లు కోల్పోయేవారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలన్నారు. భూములు కోల్పోయే వారికి పరిహారం, పునరావాసంలో రాజీ ఉండదని పొంగులేటి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధికి, హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే చారిత్రాత్మక ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మూసి నది పునరుజ్జీవంతో నగరానికి కొత్త జీవం పోసేలా, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోందన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ,

మిగతా 2లో..

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కుటుంబపాలన, అవినీతిని ప్రోత్సహిస్తున్నాయి

- 12 ఏళ్లలో తెలంగాణకు రూ.వేల కోట్ల నిధులు
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్
- మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి

2 లో..

### అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

## విచారణపై తొందరెందుకు ?


### పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరణ



## పెట్రోల్, డీజిల్ విక్రయాలపై ఆంక్షలు ఎత్తివేత

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ కమర్షియల్ కొనుగోళ్లపై విధించిన పరిమితులను కేంద్రం ఎత్తివేసింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో జూన్ 12న జారీ చేసిన

మిగతా 9లో..



# చర్చలకు రండి

- ఇరాన్ అభ్యర్థన మేరకే సంప్రదింపులకు ఒప్పుకున్నా
- అలాంటి దేమీ లేదు.. చర్చలు కుదరవు: ఇరాన్
- తాజా పరిణామాలతో నేటి దోహా సమావేశంపై సందిగ్ధత

**టెహ్రాన్(జనంసాక్షి):** ఇరాన్‌తో చర్చల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఖతార్ రాజధాని దోహాలో మంగళవారం అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య చర్చలు ఉంటాయని తెలిపారు. టెహ్రాన్ అభ్యర్థన మేరకు చర్చలకు అంగీకరించానని ట్రంప్ చెప్పారు. ఇరాన్ మాత్రం ట్రంప్ ప్రకటనను తోసిపుచ్చింది.

మిగతా 2లో..





# బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌లు కుటుంబపాలన, అవినీతిని ప్రోత్సహిస్తున్నాయి

వరంగల్‌(జనంసాక్షి): 12 ఏళ్ల పాలనలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేసిన ఘనత మోదీ సర్కార్‌కే దక్కుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్‌ నబీన్‌ అన్నారు. వరంగల్‌ బల్దియా సహా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ తెలంగాణలో కాషాయ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. వరంగల్‌ నగర సమగ్రాభివృద్ధికి రూ.వేల కోట్లు ఇచ్చిన ఘనత మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానిదేనని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ హయాంలో కుటుంబ పాలన, అవినీతి తప్ప తెలంగాణ అభివృద్ధిని విస్మరించారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్‌ నబీన్‌ విమర్శించారు. హనుమకొండ ఆర్ట్స్‌ కళాశాల మైదానంలో బీజేపీ బూత్‌ అధ్యక్షుల సమ్మేళనం కార్యక్రమానికి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో కలిసి హాజరయ్యారు. తెలంగాణ అభివృద్ధికి పుష్కరకాలంగా మోదీ సర్కార్‌ రూ.వేల కోట్ల నిధులు ఇచ్చిందని గుర్తుచేశారు. విభజన రాజకీయాలు చేస్తున్నవారికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. తెలంగాణలోనూ కమలం జెండా ఎగరాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని నేతలు, శ్రేణులకు నితిన్‌నబీన్‌ సూచించారు. మహిళలు, యువత, రైతులతో మమేకమై కేంద్రం అమలుచేస్తున్న పథకాలు, వాటి లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. కాజీపేటలో రైల్వే వ్యాగన్‌ ఫ్యాక్టరీ పెట్టాలన్న పీవీ నరసింహారావు కలను సాకారం చేసిన ప్రధాని మోదీకి వరంగల్‌ ప్రజల తరఫున ధన్యవాదాలు చెబుతున్నానని నితిన్‌ నబీన్‌ తెలిపారు. ఈ ఫ్యాక్టరీతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు అపారంగా లభిస్తాయన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సెమీఫైనల్‌గా భావించే వరంగల్‌ కార్పొరేషన్‌ పోరులో బీజేపికి పట్టం కట్టాలని కోరుతున్నట్లు చెప్పారు. రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ దోచుకున్నాయని, అభివృద్ధి కావాలంటే డబుల్‌ ఇంజిన్‌ సర్కార్‌ రావాల్సిందేనని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌ స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల్లో అవినీతి జరగకుండా మోదీ సర్కార్‌ చర్యలు తీసుకుందని, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. పుష్కర కాలంలో వరంగల్‌ సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.17 వేల కోట్లు మంజూరు చేసిందని గణాంకాలతో సహా వివరించారు..

## ముంబైలో భారీ వర్షం

**ముంబయి,జూన్‌29(జనంసాక్షి):**

ముంబై మహానగరాన్ని భారీ వర్షాలుముంచెత్తాయి. ఆదివారం రాత్రి కేవలం నాలుగు గంటల్లోనే 100మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం ప్రభావంతో సబర్బన్‌ రైలు సర్వీసులకు అంతరాయం కలగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు నిలవడంతో పలు చోట్ల ట్రాఫిక్‌ జామ్‌ ఏర్పడింది. వీణా నగర్‌లో అత్యధికంగా 160.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు బృహన్ముంబయి మున్సిపల్‌ కార్పొరేషన్‌ వెల్లడించింది. వర్షం కారణంగా అంధేరి ప్రాంతంలోని సబ్‌వే పూర్తిగా నీట మునిగింది. దీంతో ముందస్తు చర్యగా ఈ అండర్‌పాస్‌లో వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు బీఎంసీ వెల్లడించింది. మరోవైపు వాతావరణం అనుకూలంగా లేనందున విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి.

# నేడు రైతు భరోసా నిధులు విడుదల

మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద తొలి విడతలో 2 ఎకరాల వరకు నిధులు విడుదల చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రేపు 41.37 లక్షల మంది రైతుల కోసం, రూ.2,482 కోట్లు విడుదల చేస్తామన్నారు. మిగతా వారికి దశలవారీగా నిధులు జమచేస్తామని చెప్పారు. మొత్తంగా 10 రోజుల్లో అర్హులందరికీ పెట్టుబడి సాయం అందజేయనున్నారు. కొత్తగా పాసుబుక్‌లు వచ్చిన వారు జులై 5 లోపు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తుమ్మల చెప్పారు. వర్షాల వల్లనే రైతు ఆశీర్వాద సభ వేదికను మార్చినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈనెల 4 వరకు వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ చెప్పిందన్నారు. ఖమ్మం జిల్లా మధిరలో కచ్చితంగా సభ నిర్వహిస్తామని భట్టి చెప్పారు. రైతుభరోసా ముగింపు వేడుకగా సభ నిర్వహించే ఆలోచన చేస్తున్నామన్నారు. అనుకూల వాతావరణం చూసి మధిర సభ తేదీని మళ్లీ ప్రకటిస్తామని భట్టి వెల్లడించారు.

**ఖమ్మంలో భారీ వర్షాలతో సీఎం ఆశీర్వాద సభ రద్దు**

ఖమ్మం జిల్లా మధిరలో మంగళవారం జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ రద్దయ్యింది. వర్షాల కారణంగా సభ నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో మధిరలో జరగాల్సిన సీఎం రేవంత్‌ రెడ్డి సభలో మార్పులు చేశారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌ శిల్పకళా వేదికకు మార్చారు. సాయంత్రిం ఈ వేదికలో రైతుభరోసా పంపిణీ సదస్సు నిర్వహించనున్నారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి.. రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని మంత్రులు, అధికారులను సీఎం ఆదేశించారు. మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో మంగళవారం రైతు ఆశీర్వాద సభ జరగాల్సి ఉంది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి హాజరై.. రైతుభరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి సభా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. దాదాపు లక్ష మందితో సభ నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుని... అందుకు తగ్గట్టుగా జగన్నాథపురంలో ఏర్పాట్లు చేశారు. అయితే, రెండు రోజులుగా కురుస్తున్న భారీగా వర్షాలకు సభా ప్రాంగణంలో పెద్దఎత్తున వరద నీరు చేరుకుంది. దీంతో సభ నిర్వహించేందుకు అవకాశం లేదని మంత్రులు, సీఎంవో కార్యాలయానికి జిల్లా అధికారులు తెలియజేశారు. దీంతో ప్రభుత్వం మధిరలో సభను రద్దు చేసి.. సభా వేదికను హైదరాబాద్‌కు మార్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమ తమ రైతు వేదికల నుంచి ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

### ఉక్రెయిన్‌ యుద్ధం..

## అమెరికాతో చర్చలకు సిద్ధం

### ప్రకటించిన పుతిన్‌

మాస్కో(జనంసాక్షి): ఉక్రెయిన్‌తో ఘర్షణలను ముగించేలా అమెరికాతో చర్చలు కొనసాగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్‌ వెల్లడించారు. ఇరాన్‌తో ఒప్పందం ఒక కొలిక్కి వచ్చిన తర్వాత.. అమెరికా ప్రతినిధులు స్టీవ్‌ విట్కాఫ్‌, జేర్డ్‌ కుష్నర్‌ తమ దేశంలో పర్యటిస్తారని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. గత సంవత్సరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌-పుతిన్‌ మధ్య అలస్కాలో చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. వాటి గురించి రష్యా అధ్యక్షుడు మాట్లాడారు.



ఒప్పందాలు కుదరకపోయినా.. గతంలో చర్చించిన అంశాలపై చర్చలు కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇదిలాఉంటే.. కొంతకాలంగా రష్యా ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఉక్రెయిన్‌ దాడులు చేస్తోంది. దీంతో రష్యాకు చెందిన స్లావ్యాన్స్క్‌, యారోస్లావ్ల్‌ చమురు శుద్ధి కర్మాగారాలు దెబ్బతిన్నాయి. ఈ దాడులతో రష్యాలో ఇంధన కొరత ఏర్పడింది. ఈ విషయాన్ని తొలిసారి పుతిన్‌ అంగీకరించారు. చమురు కేంద్రాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తామని, ఉత్పత్తి పెంచుతామని వెల్లడించారు. మరోవైపు, ఈ దాడులపై ఉక్రెయిన్‌ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. 'రష్యా సామర్థ్యాన్ని బలహీనపరిచే ఆపరేషన్లను కొనసాగిస్తాం' అని పేర్కొన్నారు.

## గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ వెనకబాటు

### కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌ చౌహాన్‌ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,జూన్‌29(జనంసాక్షి): గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌ చౌహాన్‌ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయా పథకాల అమలును పరిశీలించినప్పుడు ఇది కనిపించిందన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంపై ఆయన వ్యాఖ్యలు చేశారు. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్‌ చౌహాన్‌ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఏసీవై రహదారుల పనులు వేగవంతం కావాలని చెప్పారు. పెండింగ్‌ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్‌ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితోపాటు ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌ స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్‌ భారత్‌కు పునాది కావాలని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్‌ భారత్‌ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌ కోరారు. గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్‌ఎంఏజీఐకి నోటిఫికేషన్‌ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్‌ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ జాతీయ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్‌ పేర్కొన్నారు.

## వీబీ జీ రామ్‌ జీ పథకంపై అభ్యంతరాలున్నాయ్‌

- పాత విధానంలోనే 75 శాతం కాంపోనెంటట్‌ కొనసాగించాలి
- 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు
- గ్రామీణాభివృద్ధిశాఖ సమావేశంలో సీతక్క స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,జూన్‌29(జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి తీసుకువస్తున్న సరికొత్త నిధుల విధానాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వీబీ జీ రామ్‌ జీ పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణాభివృద్ధి పథకాల అమలును జాతీయ సదస్సులో కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్‌ జీపై తెలంగాణ కేబినెట్‌ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వీబీ జీ రామ్‌ జీ పథకం కొనసాగించాలా లేక ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టాలా అనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. వీబీ జీ రామ్‌ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని..100శాతం ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతోందని వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌ సింగ్‌ చౌహాన్‌కు పలు కీలక సమస్యలు, నిధుల విడుదల అంశాలపై వినతిపత్రం సమర్పించారు. 'వికసిత్‌ గ్రామాలు-2047' అనే గొప్ప ఆశయం నెరవేరాలన్నా, గ్రామీణ ప్రాంతాలు స్వయంసమృద్ధి సాధించాలన్నా రాష్ట్రాలపై కేంద్రం అదనపు ఆర్థిక భారం మోపకూడదని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన విబిజి రామ్‌ పథకంలో ప్రవేశపెడుతున్న కొత్త 60:40 నిధుల విధానంపై తెలంగాణ ప్రభుత్వం తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ నూతన ఆర్థిక సమీకరణ వల్ల రాష్ట్రాలపై ఊహించని రీతిలో భారీ ఆర్థిక భారం పడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ నిబంధనలపై జూలై 2న జరగబోయే రాష్ట్ర కేబినెట్‌ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒక తుది నిర్ణయం తీసుకోనుందని వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతంలో ఉన్నట్లుగానే 100 శాతం వేతనాల విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్రానికి డిమాండ్‌ చేశారు. అలాగే మెటీరియల్‌ కాంపోనెంట్‌కు సంబంధించి కూడా గతంలో ఉన్న 75 శాతం కేంద్ర వాటాను అలాగే ఉంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర నిధులు కోల్పోకుండానే, రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిస్థాయిలో కాపాడేలా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తుందని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి గ్రామ్‌ సడక్‌ యోజన కింద రాష్ట్రంలో చేపట్టే గ్రామీణ రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ప్రధాన అడ్డంకిగా మారాయని మంత్రి సీతక్క కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆదిలాబాద్‌, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లమల అటవీ ప్రాంతాల్లో అనేక రోడ్డు పనులు పూర్తిగా నిలిచి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రోడ్లే కాకుండా, అటవీ అనుమతులు సకాలంలో రాకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్లు, బోర్‌వెల్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయని వివరించారు.

# చర్చలకు రండి

తదుపరి చర్చల షెడ్యూల్‌ ఏదీ ఖరారు కాలేదని తెలిపింది. పరిస్థితులు చక్కబడిన తర్వాతే చర్చలు ఉంటాయని స్పష్టతనిచ్చింది. దీనితో దోహా సమావేశంపై సందిగ్ధత ఏర్పడింది. పశ్చిమాసియాలో 4 నెలల పాటు కొనసాగిన ఘర్షణకు ముగింపు పలుకుతూ ఇటీవల అమెరికా-ఇరాన్‌లు మధ్యంతర ఒప్పందం కుదుర్చుకున్నాయి. అయితే గత ఐదు రోజులుగా ఇరుదేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఫలితంగా అవగాహన ఒప్పందంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు ఖతార్‌, పాకిస్థాన్‌లు ప్రయత్నిస్తున్నాయి.

తాత్కాలిక ఒప్పందంలో ఏమున్నాయ్‌?

ఈ నెల ప్రారంభంలో అమెరికా, ఇరాన్‌ దేశాలు ఒక తాత్కాలిక శాంతి ఒప్పందానికి అంగీకరించాయి. దీని ప్రకారం టెహ్రాన్‌ వద్ద ఉన్న శుద్ధిచేసిన యురేనియం నిల్వలను పూర్తిగా తగ్గించుకోవాలి, హర్మూజ్‌ జలసంధిని తెరవాలి. దీనికి ప్రతిగా అమెరికా, ఇరాన్‌పై విధించిన ఆంక్షలను సడలిస్తుంది. మరింత క్లియర్‌గా ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఇరుపక్షాలకు 60 రోజుల సమయం లభిస్తుంది. ఈ తాత్కాలిక ఒప్పందంపై సంతకాలు జరిగిన తర్వాత చమురు ధరలు గణనీయంగా తగ్గాయి. అయితే ఇవి కనుక మళ్లీ పెరిగితే, ట్రంప్‌నకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే నవంబర్‌లో అమెరికాలో ఎన్నికలు జరగనున్నాయి. అందుకే దేశంలో ద్రవ్యోల్బణం తగ్గుతోందంటూ ట్రంప్‌ ఓటర్లకు చెబుతున్నారు. ఒక వేళ పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరిగి, చమురు ధరలు పెరిగితే, అమెరికాలో ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ఇది ఎన్నికల ఫలితాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం నాడు ఖతార్‌లోని దోహాలో యూఎస్‌-ఇరాన్‌ సమావేశం ఉంటుందని ట్రంప్‌ ప్రకటించారు. అయితే ఇరాన్‌ సంప్రదింపుల అధికారి ఘరీబాబాది ఈ సమావేశానికి సంబంధించి ఎలాంటి షెడ్యూల్‌ ఖరారు కాలేదని తేల్చిచెప్పారు. అంతకుముందు సోమవారం ఇరాన్‌ అధ్యక్షుడు మసౌద్‌ పెజెష్కియాన్‌ మాట్లాడుతూ, ఖతార్‌లో నిలిచిపోయిన (ఫ్రీజ్‌ అయిన) 6 బిలియన్ల అమెరికన్‌ డాలర్ల తమ ఆస్తులను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ నిధుల గురించి ఆయన ప్రస్తావించడం, తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని ఇరాన్‌ ప్రజలకు అనుకూలంగా చూపించడానికేనని తెలుస్తోంది. పర్షియన్‌ గల్ఫ్‌ నుంచి లోపలి వచ్చే, బయటకు వెళ్లే రవాణా ఓడల కోసం ఒమన్‌ ప్రాంతీయ జలాలను తెరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు హర్మూజ్‌ జలసంధిపై ఇరాన్‌ పట్టుకు పరీక్ష ఎదురవుతోంది. ఈ నేపథ్యంలోనే దోహాలో ఇరుదేశాల మధ్య మళ్లీ చర్చలు జరగనున్నాయని మధ్యవర్తి పాకిస్థాన్‌ తెలిపింది.

మళ్లీ పెరుగుతున్న ఉద్రిక్తతలు

వాస్తవానికి హర్మూజ్‌ జలసంధి ఇరాన్‌, ఒమన్‌ ప్రాంతీయ జలాల్లో ఉన్నప్పటికీ, ఇది చాలా కాలంగా అంతర్జాతీయ జలమార్గంగా పరిగణించబడింది. కానీ పశ్చిమాసియాలో ఇరాన వర్సెస్‌ అమెరికా, ఇజ్రాయెల్‌ మధ్య యుద్ధం జరిగింది. దీనితో ఈ జలసంధిపై తమకే హక్కు ఉందని ఇరాన్‌ ప్రకటించుకోవడం మొదలుపెట్టింది. దీనికి అమెరికా, ఇజ్రాయెల్‌?లు ససేమిరా అంటున్నాయి. ఇదిలా ఉండగా, ఇటీవల రోజుల్లో ఇరాన్‌ రెండు సార్లు హర్మూజ్‌ జలసంధిలోని నౌకలపై దాడులు చేసింది. దీనికి ప్రతీకారంగా అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఇరాన్‌ఆదివారం బహ్రెయిన్‌, కువైట్‌లను లక్ష్యంగా చేసుకొని డ్రోన్‌, క్షిపణి దాడులు చేసింది.

# మూసీ ప్రాజెక్టుతో ఎవరికీ అన్యాయం జరగదు

పునరావాసం తదితర అంశాలపై డాక్టర్‌ బి.ఆర్‌. అంబేద్కర్‌ సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి సోమవారం ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్‌. లోకేశ్‌ కుమార్‌, స్టాంప్స్‌ / రిజిస్ట్రేషన్‌ ఐజీ రాజీవ్‌ గాంధీ హనుమంతు, మూసి రివర్‌ ఫ్రంట్‌ డెవలప్‌మెంట్‌ ప్రాజెక్ట్‌ ఎండీ ఈ.వి. నర్సింహారెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్‌ సర్ఫరాజ్‌ అహ్మద్‌, హైదరాబాద్‌, రంగారెడ్డి, మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మూసి నదిని పునరుజ్జీవింప జేసి, దాన్ని పర్యాటకం, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కేంద్రంగా మార్చాలన్నది ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి దూరదృష్టి అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌ కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, ఇది భవిష్యత్‌ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, పర్యావరణహితమైన జీవన వాతావరణాన్ని అందించే సంకల్పమని వివరించారు. మూసి నది కాలుష్యంతో ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వరదల సమయంలో పరివాహక ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్ట్‌ రూపుదిద్దుకుందని తెలిపారు. వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు, రోడ్లు, పార్కులు, వాక్‌వేలు, వినోద కేంద్రాలు ఏర్పాటు ద్వారా మూసి పరివాహక ప్రాంతాలను సరికొత్త జీవన కేంద్రాలుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. గతంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి స్పష్టం చేసినట్టుగా మూసి ప్రాజెక్ట్‌ ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గుర్తు చేశారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పేదల జీవితాలు దెబ్బతినకుండా ప్రతి నిర్ణయం మానవీయ కోణంలోనే తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టులో భూ సేకరణ ప్రక్రియలో ప్రజా కోణంలో ఆలోచించి మానవీయ కోణంలో నిర్ణయాలు ఉండాలని అధికారులకు సూచించారు. ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇండ్లు కేటాయించాలని ఇందుకు అవసరమైన క కార్యాచరణ రూపొందించి తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు. భూములు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం, అవసరమైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం ఎటువంటి రాజీ పడబోదని మంత్రిగారు స్పష్టం చేశారు.

**హరీశ్‌కు మెంటల్‌ బ్యాలెన్స్‌ తప్పింది: పొంగులేటి**

బిఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరుచూస్తుంటే ఆయనకు మెంటల్‌ బ్యాలెన్స్‌ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్‌, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్‌ రావు వ్యాఖ్యలపై పై విధంగా స్పందించారు. తెలంగాణ ప్రజానీకం మాకు ఐదేళ్లకు అధికారమిచ్చారు. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్‌రావుకు తెలుసు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా.. అని సవాలు విసిరినట్లే బిఆర్‌ఎస్‌ నాయకుల సవాళ్లు ఉంటున్నాయన్నారు. ఈ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్‌ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారు. నా నియోజకవర్గం పాలేరులో కేటీఆర్‌ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయి. బిఆర్‌ఎస్‌ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించను. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతా. కేటీఆర్‌ను అరెస్ట్‌ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదు. ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టే. ఏ వ్యక్తిమీదా వ్యక్తిగత కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. తప్పుచేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారు. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో తీసుకురాం. అధికారంలోకి వస్తామని బిజేపీ పగటికలలు కంటోంది. ఆశ ఉండడంలో తప్పులేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోంది. జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్‌ రాని పార్టీ అధికారం గురించి ఆశ పడుతోంది. బిజేపీ, బిఆర్‌ఎస్‌ ఒకే తాను ముక్కలు. కాళేశ్వరం అవినీతి, థర్మల్‌ పవర్‌ ప్లాంట్‌ అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని అడిగితే బిజేపీ ఇప్పటివరకు స్పందించలేదని అన్నారు.

### అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

## విచారణపై తొందరెందుకు ?

న్యూఢిల్లీ(జనంసాక్షి): అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్‌ దాఖలైంది. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని పిటిషనర్‌ కోరారు. కోర్టు పర్యవేక్షణలో, నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు జరిగేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్‌ అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరించింది. అయోధ్య రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషనర్‌ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్‌ ఎం.ఎం. సుందరేశ్‌, జస్టిస్‌ షీల్‌ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పిటిషనర్‌ తరపు న్యాయవాది వాదిస్తూ, రామమందిర విరాళాల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర విచారణ జరిపించాలని కోర్టును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోందని, అందుకే స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన వాదించారు. ఇక, కేసు ఆలస్యమైతే ఎలక్ట్రానిక్‌ ఆధారాలు చెరిపివేసే అవకాశం ఉందని పిటిషనర్‌ తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు, మెన్షన్‌ స్లిప్‌ సర్క్యులేట్‌ చేయాలని సూచించింది. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్‌ ఎం.ఎం. సుందరేశ్‌, జస్టిస్‌ షీల్‌ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమైన వెంటనే ఈ కేసును లిస్ట్‌ చేసి విచారణ చేపడతామని జస్టిస్‌ ఎం.ఎం. సుందరేశ్‌ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం ఈ అంశంపై అత్యవసర విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈలోపే మిన్ను విరిగి మీద పడదు.. అంత తొందరెందుక'ని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మరోవైపు, ఈ కేసులో నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దని ÷జాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ నిర్ణయించింది. 'ఈ కేసులో నిందితుల తరపున ఎవరూ వాదించరు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే.. క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తాం' అని అసోసియేషన్‌ అధ్యక్షుడు కలికా ప్రసాద్‌ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 2005లో కూడా అక్కడి న్యాయవాదులు ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. ఆ ఏడాది రామ మందిరంపై దాడికి పాల్పడిన నిందితులను ఫైజాబాద్‌ కోర్టు ముందు హాజరుపర్చగా.. వారి పక్షాన వాదించేందుకు ఎవరూ ముందుకురాలేదు.

**అరెస్టయిన వారి పక్షాన వాదించబోమన్న లాయర్లు**

అయోధ్య బార్‌ అసోసియేషన్‌ కీలక నిర్ణయం తీసుకుంది. రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో అరెస్టయిన ఎనిమిది మంది నిందితుల తరపున తమ సంఘానికి చెందిన ఏ న్యాయవాదీ కోర్టులో వాదించరాదని బార్‌ అసోసియేషన్‌ సోమవారం సంచలన తీర్మానం చేసింది. ఈ నిర్ణయాన్ని ఉల్లంఘించే న్యాయవాదులపై రూ.5 లక్షల జరిమానా విధిస్తామని బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కాళికా శరణ్‌ మిశ్రా స్పష్టం చేశారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపరిచిన రోజే నిర్వహించిన బార్‌ అసోసియేషన్‌ సర్వ సభ్య సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. రామాలయానికి భక్తులు సమర్పించిన కానుకల దుర్వినియోగం ఆరోపణలు.. తమ మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని బార్‌ అసోసియేషన్‌ తెలిపింది. అందువల్లే సభ్యులంతా ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. భవిష్యత్తు కార్యాచరణపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామంది. ఇదే సమావేశంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్‌, ట్రస్ట్‌ సభ్యుడు అనిల్‌ మిశ్రా, ఆలయ నిర్మాణ ఇన్‌ఛార్జి గోపాల్‌రావుపై కేసు నమోదు చేయాలని కూడా బార్‌ అసోసియేషన్‌ తీర్మానించింది. వీరంతా మరో మూడు రోజుల్లో అయోధ్యను వీడాలని, లేనిపక్షంలో నగరమంతా బంద్‌ చేపట్టి, ఆలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించింది. కాగా.. 2005లో రామ జన్మభూమి తాత్కాలిక ఆలయంపై జరిగిన ఉగ్రదాడి కేసులోనూ నిందితుల తరపున వాదించబోమని నాడు ఇదే బార్‌ అసోసియేషన్‌ ప్రకటించింది.

8మంది నిందులకు 14రోజుల రిమాండ్‌

అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయిన ఎనిమిది మంది నిందితులకు ప్రత్యేక అవినీతి నిరోధక న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్‌ కస్టడీ విధించింది. దీంతో వారు జులై 13 వరకు జైలులోనే ఉండనున్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నందున నిందితులను జ్యుడీషియల్‌ కస్టడీలో ఉంచాల్సిన అవసరముందని పోలీసులు కోర్టుకు వివరించడంతో.. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది న్యాయస్థానం. ఈ కేసులో రామశంకర్‌ అలియాస్‌ తిన్నూ యాదవ్‌ సహా అవినాశ్‌ శుక్లా, అనుకల్ప్‌ మిశ్రా, లవ్‌కుశ్‌ మిశ్రా, మనీశ్‌ కుమార్‌ యాదవ్‌, కరుణెశిశ్‌ పాండే, రామ్‌శంకర్‌ మిశ్రా, సుభాశ్‌ శ్రీవాస్తవ్‌లు నిందితులుగా ఉన్నారు. వీరంతా రామాలయానికి వచ్చిన విరాళాల నగదు, విలువైన వస్తువుల లెక్కింపు, నిర్వహణ బాధ్యతల్లో పనిచేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

సూపరింటెండింగ్‌ కార్యాలయము వెస్‌సర్కిల్‌,
హైదరాబాద్‌
తెలంగాణ మెడికల్‌ సర్వీసెస్‌ & ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌
డిస్ట్రిక్ట్‌ హాస్పిటల్‌ పరిసరాలలో, కింగ్‌ కోటీ, హైదరాబాద్‌ - 500001
టెండర్‌ నోటీసు నం.03/ఎస్‌ఈ/టీజీఎంఎస్‌ఐడీసీ/వెస్ట్‌ సీఐఆర్‌- హైదరాబాద్‌/2026-27/129, తేది:29.06.2026
కామారెడ్డి జిల్లాలో మండూర్‌(గ్రా&మం) వద్ద సీహెచ్‌సీకి మరమ్మతులు మరియు ఆధునికీకరణకు ఈ-ప్రొక్యూర్‌మెంట్‌ ప్లాట్‌ఫారం కింద ఆన్‌లైన్‌ టెండర్లు ఆహ్వానించడమైనది. మిగతా వివరాలు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
DIPR No.5096-PP/CL/ADVT/2026-27
సం/- సూపరింటెండింగ్‌ ఇంజినీర్‌

## తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక సహకారం

### ఇరు సంస్కృతుల వైభవాన్ని ప్రతిబింబించే ప్రత్యేక వేదికగా హైదరాబాద్‌

### కళా-సాంస్కృతిక భాగస్వామ్యానికి ప్రాధాన్యం: మంత్రి జూపల్లి

**హైదరాబాద్‌, జూన్‌ 29(జనంసాక్షి):**

ఈ ఏడాది అక్టోబర్‌ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం నిర్వహించాలని తెలంగాణ - కొరియన్‌ కల్చరల్‌ సెంటర్‌ లు సంయుక్తంగా సూత్రప్రాయ అంగీకారానికి వచ్చాయి. తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు పక్షాలు చర్చించాయి. భారత్‌లోని కొరియన్‌ కల్చరల్‌ సెంటర్‌ డైరెక్టర్‌, భారతదేశంలోని కొరియా రాయబార కార్యాలయం కల్చర్‌ అండ్‌ ప్రెస్‌ కౌన్సిలర్‌ హ్వాంగ్‌ ఇల్యాంగ్‌ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్‌ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును డా.బీఆర్‌. అంబేద్కర్‌ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ గొప్ప చారిత్రక వారసత్వం, వైవిధ్యభరితమైన సంస్కృతి, సంప్రదాయ కళారూపాలు, ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రతిపాదిత తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం ద్వారా ఇరు ప్రాంతాల కళలు, సంగీతం, నృత్యం, వంటకాలు, సంప్రదాయాలను ఒకే వేదికపై ఆవిష్కరించే అవకాశం లభిస్తుందని, పర్యాటకాభివృద్ధితో పాటు ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత పెరుగుతాయని తెలిపారు. భారత్‌లో, ముఖ్యంగా యువతలో కొరియన్‌ కే-డ్రామాలు, కొరియన్‌ వినోద కార్యక్రమాలకు ఓటీటీ వేదికల ద్వారా విశేష ఆదరణ లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సాంస్కృతిక అనుబంధం తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించడంతో పాటు కళలు, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, సృజనాత్మక భాగస్వామ్యాలకు కొత్త అవకాశాలను కల్పిస్తుందని అన్నారు.

# మావోయిస్టు అగ్రనేత దుబాసి శంకర్ ఆరోగ్య పరిస్థితి విషమం



**కుషాయిగూడ, జూన్ 29 (జనంసాక్షి) :** చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని భువనేశ్వర్ సెంట్రల్ జైల్లో ఉన్న సిపిఐ మావోయిస్టు పార్టీ కేంద్ర మిలిటరీ కమిషన్ సభ్యుడు దుబాసి శంకర్ అలియాస్ రమేష్ అలియాస్ మహేందర్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం భువనేశ్వర్ జిల్లా ఆసుపత్రికి జైలు అధికారులు తరలించి దుబాసి శంకర్ కు వైద్య చికిత్సలు అందిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన దుబాయ్ శివ శంకర్ 45 సంవత్సరాలుగా అజ్ఞాత జీవితాన్ని గడిపారు. మెదక్ జిల్లా నల్లమల్ల ఒరిస్సా మల్కనగిరి కోరాపుట్ ఆయా ప్రాంతాలలో విప్లవోద్యమానికి చురుకైన పాత్రను దుబాసి శంకర్ నిర్వహించారు. 2021 ఒరిస్సా రాష్ట్రంలో అరెస్టయ్యారు. అప్పటినుండి భువనేశ్వర్ సెంట్రల్ జైల్లో మావోయిస్టు రాజకీయ ఖైదీగా ఉంటున్నాడు. కుడి కాలుకు ఇన్ఫెక్షన్ సోకడంతో నడవనీకి ఇబ్బంది పడుతున్నాడు భువనేశ్వర్ జైల్లో వైద్య చికిత్సలు అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో జైలు అధికారులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. 2017లో ఆందోళనకరంగా ఉందని విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు దుబాసి శంకర్ కుడి కాలుకు ఇన్ఫెక్షన్స్ సోకడంతో జిల్లా ఆసుపత్రికి తరలించిన భువనేశ్వర్ సెంట్రల్ జైలు అధికారులు. రెండేళ్లుగా శంకర్ కుడికాలు ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారని జైలు అధికారులు జైల్లోనే వైద్య చికిత్సలు అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో హుటాహుటిన భువనేశ్వర్ జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. దీంతో జూ దుబాసి శంకర్ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అయితే దుబాసి శంకర్ వయోభారం మీద పడటంతో జైలు నాలుగు గోడల మధ్య నరకయాతన అనుభవిస్తున్నాడు జైలులో ఆహారము పడకపోవడంతో వాంతులు విరోచనాలు జరుగుతున్నాయి. దుబాషి శంకర్ కుటుంబ సభ్యులు దుబాసి శంకర్ అభిమానులు ప్రజా సంఘాల నేతలు ఆందోళన చెందుతున్నారు తక్షణమే దుబాసి శంకరును భువనేశ్వర్ జైలు నుండి తెలంగాణ నిమ్స్ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలను అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు. దుబాసి శంకర్ తో పాటు మావోయిస్టు రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని పౌర హక్కుల సంఘం ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. ఆగస్టు 15 వరకు డేట్ లైన్ విధించింది. ఇప్పటికైనా శంకర్ ను మెరుగైన వైద్యం కోసం నిమ్స్ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కుటుంబ సభ్యులు ప్రజా సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. దుబాసి శంకర్ కు ఏదైనా ప్రాణాన్ని జరిగితే ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆందోళన కారులు హెచ్చరిస్తున్నారు.

# హిందూ ధర్మాన్ని కాపాడడం అందరి బాధ్యత

- సినీ నటుడు సుమన్



**నల్లబెల్లి, జూన్ 29 (జనంసాక్షి):** భారతదేశ సంస్కృతి చాలా గొప్పదని సినీ నటుడు సుమన్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని అతను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయానికి చేరుకున్న నటుడు సుమన్ కు దేవాలయ అర్చకులు, దేవాలయ శాశ్వత ధర్మకర్త తాటి పెల్లి రవీందర్, దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గందె శ్రీనివాస్ గుప్తా, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడడం అందరి బాధ్యత అన్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో పరమేశ్వరుని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. పాడి పంటలు, వ్యాపార వాణిజ్యాలతో భారతదేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, దేశ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని భగవంతుని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐ వి ఎఫ్ రాష్ట్ర ధార్మిక పరిషత్ చైర్మన్ డాక్టర్ వంగపల్లి అంజయ్య, ప్రొడ్యూసర్ శ్యామల గణేష్, దేవాలయ కమిటీ సభ్యులు పురం బద్రీనాథ్, పడాల మురళి, రామీని సంతోష్, మార్కండేయ, కుమార్, సంతోష్, చంద్రమౌళి, నాగభూషణ్, తదితరులు పాల్గొన్నారు.


# కన్నతల్లికి అన్నం పెట్టని కొడుకు

**తాహశీల్దార్‌కు వృద్ధురాలి ఫిర్యాదు**



**కుబీర్, జూన్ 29 (జనంసాక్షి) :** భర్త మరణానంతరం కుమారుడి పేరిట మార్పిడి చేసిన భూమి పట్టాను తిరిగి తన పేరిట మార్చాలని కోరుతూ ఓ వృద్ధురాలు సోమవారం కుబీర్ తాహశీల్దార్ శ్రీదేవికి ఫిర్యాదు చేశారు. బాధితురాలి వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని బెల్గాం తండా గ్రామానికి చెందిన జలబాయి భర్త గణపతి పేరిట సర్వే నంబర్ 89లో ఒక ఎకరం 30 గుంటల భూమి ఉండేది. భర్త మరణించడంతో ఆమె ఆ భూమిని తన పెద్ద కుమారుడైన శంకర్ పేరిట పట్టా మార్పిడి చేయించారు. అయితే, పట్టా మార్పిడి జరిగిన తర్వాత తన కుమారుడు తనను సరిగా చూసుకోవడం లేదని, కనీస అవసరాలైన అన్నం కూడా పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని జలబాయి ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా ఇన్నాళ్లు ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేక ఇబ్బంది పడ్డానని, చివరకు తట్టుకోలేక అధికారులను ఆశ్రయించాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. శంకర్ పేరిట ఉన్న పట్టాను రద్దు చేసి, ఆ భూమిని తిరిగి తన పేరిట మార్చాలని ఆమె తాహశీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ చట్టాల నిబంధనల ప్రకారం.. ఈ విషయమై రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# భువనగిరి సమరభేరికి మంత్రి పొన్నంకు ఆహ్వానం



**హుస్నాబాద్ (జనంసాక్షి) :** బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను చిగురుమామిడి మండలం కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, పార్టీ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి, తీన్మార్ మల్లన్న నాయకత్వంలో జులై 05న భువనగిరిలో నిర్వహించబడే రాజ్యాధికార సమరభేరి మహాసభకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మరియు బహుజన వర్గాలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ అధికారం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉద్యమిస్తోందని తెలిపారు. బీసీల అభివృద్ధి కేవలం సంక్షేమ పథకాలతో కాకుండా, రాజకీయ రాజ్యాధికారం ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అందుకే భువనగిరిలో నిర్వహించనున్న సమరభేరి సభ బహుజన వర్గాల రాజకీయ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే చారిత్రాత్మక సభగా నిలవనుందని అన్నారు. బీసీలు అంటే ఉచితాలకు పరిమితం వారు కాదని, బీసీలకు వాటా, ఆత్మగౌరవం, అధికారం దక్కేదాక పోరాటం చేస్తామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు జింక లావణ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్, జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి ఇశ్రత్ శావాలి, మండల అధ్యక్షులు బుర్ర అశోక్, శివరాత్రి మోహన్, నాయకులు కోరె గంగా, ఉప్పులేటి రాణి తదితరులు పాల్గొన్నారు.

# గుప్పెడు గుండెకు... సింగరేణి గట్టి భరోసా!

- గోదావరిఖనిలో కోల్‌బెల్ట్ ప్రజలకు అత్యాధునిక గుండె వైద్య సేవలు
- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు ఏడాదిలోనే ఏర్పాటైన క్యాథ్ ల్యాబ్
- ఏటా 6 కోట్ల వ్యయం అయ్యే అవకాశం
- గుండె జబ్బు అత్యవసర చికిత్స ఇక స్థానికంగానే... వేలాది ప్రాణాలకు భరోసా
- కార్మిక కుటుంబాల సంక్షేమం దిశగా సింగరేణి మరో ముందడుగు




**హైదరాబాద్, జూన్ 29 (జనంసాక్షి) :** దేశానికి వెలుగులు పంచే కార్మికుల ఆరోగ్య పరిరక్షణ దిశగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ మరో కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థకు గుండెకాయగా ఉన్న కార్మికుల హృదయాలకు గట్టి భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను రామగుండం–1 ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసింది. త్వరలో లాంఛనంగా ప్రారంభానికి సిద్ధంగా ఉంది. సింగరేణి కార్మికులకు అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల నేపథ్యంలో సింగరేణి ఉద్యోగులు ఎక్కువగా నివసించే (దాదాపు 33 వేల మంది) గోదావరిఖని ప్రాంతంలో సింగరేణి సంస్థ తొలి క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం విశేషం. దీంతో పెద్దపల్లి, మంచిర్యాల, కొమురమ్ భీమ్ ఆసిఫాబాద్, ప్రొఫెసర్ జయశంకర్ భూపాల పల్లి జిల్లా ల్లో నివసిస్తున్న వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత సింగరేణి ఉద్యోగులతోపాటు సమీప గ్రామాల ప్రజల హృదయాలకు సింగరేణి గట్టి భరోసాను ఇచ్చినట్లు అయింది.

గుండె సమస్య అన్నది నేడు వయో భేదం లేకుండా ప్రతీ ఒక్కరూ ఎదుర్కొంటున్న అతి ప్రాణాంతక జబ్బు. ఇది ఎప్పుడు వస్తుందో అంచనా వేయడం కష్టమే కానీ, ఈ సమస్య తలెత్తిన తొలి గంట అత్యంత కీలకమని వైద్యులు పేర్కొంటారు. దీన్ని గోల్డెన్ అవర్‌గా పేర్కొంటారు. ఈ సమయంలో సత్వరమే చికిత్స అందించగలిగితే విలువైన ప్రాణాలను కాపాడవచ్చు. అయితే సింగరేణి విస్తరించిన ప్రాంతాల్లో కంపెనీ ఆధ్వర్యంలో అనేక ఆధునిక వైద్య సౌకర్యాలు గల ఏరియా ఆసుపత్రులు ఉన్నప్పటికీ అందులో కార్డియాక్ సంబంధిత సేవలు పరిమిత స్థాయిలో ఉన్నాయి. ఇప్పటి వరకు గుండెపోటు వచ్చిన రోగులను హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి సుదూర నగరాలకు తరలించాల్సి వచ్చేది. ఆ సుదీర్ఘ ప్రయాణంలో అమూల్యమైన "గోల్డెన్ అవర్" (రక్షించదగిన తొలి గంట) వృథా అవుతుండేవి. ఈ నేపథ్యంలోనే గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ ను సింగరేణి ఏర్పాటు చేసింది.

## ప్రాణాలను కాపాడే 'గోల్డెన్ అవర్' వైద్యం

గుండెపోటు వచ్చిన తొలి గంట అత్యంత కీలకం. అదే సమయంలో యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ వంటి చికిత్సలు అందితే రోగి ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. ఈ అత్యవసర సేవల ప్రాధాన్యతను గుర్తించిన సింగరేణి యాజమాన్యం, అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా అత్యాధునిక సాంకేతికతతో ఈ క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. బొగ్గు బెల్ట్ ప్రజలకు సకాలంలో, తక్కువ వ్యవధిలోనే అత్యుత్తమ వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

## కార్మికుడి ఆరోగ్యమే సంస్థ సంపద

కార్మికుల ఆరోగ్యం కోసం సింగరేణి సంస్థ ఏటా 300 కోట్ల రూపాయలకు పైగా వెచ్చిస్తోంది. ముఖ్యంగా కార్పోరేట్ ఆసుపత్రుల రెఫరల్స్ కోసమే అధిక మొత్తం నిధులను కేటాయిస్తోంది. గత ఏడాది మాత్రమే హృద్రోగ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న సుమారు 3,000 మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులను భూపాలపల్లి, బెల్లంపల్లి, రామగుండం, రామకృష్ణాపూర్ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయడం జరిగింది. అయితే గుండె జబ్బుల విషయంలో ప్రతీ నిమిషయం విలువైనదే కావడంతో లక్షల రూపాయలు వెచ్చించడం కంటే సకాలంలో అత్యాధునిక చికిత్స అందించడం ద్వారానే ప్రాణాలను కాపాడవచ్చనే దృఢ సంకల్పంతో సింగరేణి యాజమాన్యం గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మరో మారు కార్మిక సంక్షేమంలో సింగరేణి దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఈ ముందడుగు ద్వారా మరోసారి నిరూపించింది.

## ఉత్తర తెలంగాణకు వరం

గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి ఆవరణలో మొత్తం 7890 చదరపు అడుగుల విస్తీర్ణంలో సింగరేణి కార్డియాలజీ విభాగం ఉంటుంది. ఇందులో 5 బెడ్ల సామర్థ్యం గల ఇంటెన్సివ్ కార్డియాక్ కేర్ యూనిట్, 10 బెడ్ల సామర్థ్యం తో ఇంటెన్సివ్ కేర్ యూనిట్, ప్రత్యేక గదులతో ఔట్ పేషెంట్ బ్లాక్ ఉంటాయి.. గోదావరిఖని, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, పెద్దపల్లి, భూపాలపల్లి, మంథని తదితర పరిసర ప్రాంతాలతో పాటు మొత్తం కోల్ బెల్ట్ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ప్రజలకు ఈ క్యాథ్ ల్యాబ్ ఎంతో ఉపయోగపడనుంది. పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో ఏర్పాటు చేసిన క్యాథ్ ల్యాబ్ కోసం ఏడేళ్లలో సింగరేణి సంస్థ దాదాపు 50 కోట్ల ఖర్చును భరించనుంది. అలాగే సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ టారిఫ్‌ల మేరకు అతి తక్కువ ఖర్చుతో స్థానికులకు కూడా అత్యాధునిక వైద్య సేవలను అందించే సౌకర్యాన్ని కల్పించింది. ప్రతీ నెల దాదాపు 3 వేల మందికి పైగా ఈ సేవలను వినియోగించుకుంటారని అంచనా. అయితే ఇక్కడ క్యాథ్ ల్యాబ్ ఉన్న బెడ్ల సామర్థ్యంలో 50 శాతం సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత సింగరేణీయులకు రిజర్వు చేయడం జరుగుతుంది.



# కోపాకుల చెరువు వ్యవసాయ పంట భూమిలో బంగారం?

- కూలీలు గడ్డి కలుస్తుండగా 50 తులాల వరకు దొరికిందని ప్రచారం



**చెన్నారావుపేట, జూలై 29 (జనంసాక్షి) :** చెన్నారావుపేట మండల కేంద్రంలోని ఈర్య తండా శివారులో కోపాకుల చెరువు సమీపంలోని వ్యవసాయ పంట భూమిలో బంగారం దొరికినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. చెన్నారావుపేట గ్రామానికి చెందిన కేతిడి జైపాల్ రెడ్డి తన కుటుంబ అవసరాల నిమిత్తం గత ఐదు సంవత్సరాల క్రితం ఇదే గ్రామానికి చెందిన రాధారపు ప్రతాప్ రెడ్డి కూతురికి 6 ఎకరాల భూమిని అమ్మకం చేపట్టాడు. ఆ భూమిని ఈర్య తండాకు చెందిన భూక్య బాలు అనే రైతు కౌలుకు తీసుకొని పంట సాగు చేస్తున్నాడు. గత కొద్ది రోజుల క్రితం కౌలుకు తీసుకున్న రైతు ట్రాక్టర్ తో లోతు దుక్కి దున్నించి పత్తి విత్తనాలను విత్తించాడు. పత్తి మొలకల్లో గడ్డి పెరగడంతో గత వారం రోజుల క్రితం అదే తండాకు చెందిన నలుగురు మహిళా కూలీల తో గడ్డిని కలి పిస్తుండగా బం గారు కంఠ హారం, పుస్తెలు, కంట హారంలోని గుండ్లు దొరికినట్లు ప్రచారం జరుగుతుంది. సుమారు దొరికిన బంగారం 50 తులాల వరకు ఉంటుందని గ్రామస్తులు చర్చించు కుంటున్నారు. కూలీల ద్వారా విషయం బయటకు రావడంతో భూమి యజమాని రాధారపు ప్రతాప్ రెడ్డి, ఆమె కూతురు, కౌలుకు తీసుకున్న రైతు భూక్య బాలులు గోప్యంగా దొరికిన బంగారాన్ని పంచుకున్నట్లు ప్రచారం జోరందుకుంది. ఇది ఇలా ఉండగా భూమి అమ్మిన రైతు కేతిడి జైపాల్ రెడ్డి నేను అమ్మకం చేపట్టిన భూమిలో ఉన్న చెట్టు, పుట్ట, నిధి నిక్షేపాలు మా కుటుంబానికి సంబంధించి న వేనని కౌలుకు తీసుకున్న రైతు భూక్య బాలు భూమిని దున్నిస్తుండగా బం గారం బయట పడిందని భూమి కొనుగోలు చేసిన రైతు రాధారపు ప్రతాప్ రెడ్డి , ఆయన కూతురు, కౌలుకు తీసుకున్న రైతు భూక్య బాలులు గోప్యంగా పంచుకున్నారని వెంటనే దొరికిన బంగారం విషయం పై విచారణ జరిపి బంగారం పంచుకున్న వ్యక్తుల పై చట్టరీత్యా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని సోమవారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు భూమి అమ్మకం చేపట్టిన రైతు కేతిడి జైపాల్ రెడ్డి తెలిపాడు. ఈ పంట భూమిలో దొరికిన బంగారం కథ వారం రోజులుగా అనేక మలుపులు తిరుగుతోంది.

# మతసామరస్య పాఠాన్ని నేర్పిన చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్




**టిటాగడ్ (జనంసాక్షి) :** మత సామరస్య పాఠాన్ని నేర్పిన చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్ అని వక్తలు అన్నారు. విస్మృతికి గురైన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను పరిశోధించి, ప్రజల ముందుకు తీసుకురావడానికి పాతికేళ్లుగా అవిశ్రాంతంగా కృషిచేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో 26 గ్రంథాలూ, రెండు ఆల్బంలూ వెలువరించారని, ఈ గ్రంథాలను ఎంపిక చేసి గ్రంథాలయాలు, చరిత్ర ఉపాధ్యాయులకు, విద్యార్థులకు , చరిత్ర పట్ల ఆసక్తిగల పాఠకులకు తమ వదాన్యుల కానుక అందిస్తున్నారని, పిల్లల కోసం స్వాతంత్ర్య సమరవీరుల ఫోటోలతో నేమ్ స్టిక్కర్లూ, ఫోటో ఎగ్జిబిషన్లూ, దేశవ్యాప్తంగా ప్రసంగాలూ ఆయన ఏకవ్యక్తి సైన్యంలా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒక వ్యక్తిగతమైన పని మీద ఆయన కోల్‌కతా రావడంతో టిటాగడ్ తెలుగు వాసులకు ఆయన ప్రసంగాన్ని వినే చక్కని అవకాశం దొరికింది. 'ముందడుగు' (విద్యా సాహిత్య సాంస్కృతిక వేదిక) ఆధ్వర్యంలో బోడ తారకేశు గృహంలోని పెద్ద హాలులో పలువురు శ్రోతలు ఆయన ప్రసంగాన్ని ఆసక్తికరంగా విన్నారు. ఈ వేదికను నశీర్ అహమ్మద్‌తోపాటు స్థానిక పెద్దలు ఎం.శివలింగం మాష్టారు, ఒట్టి భూతేశు అలంకరించారు. పెద్దలకు స్వాగత సన్మానాల అనంతరం, 'ముందడుగు' తరుపున అయిక బాలాజీ గారు సయ్యద్ నశీర్ అహమ్మద్ కృషిని కొనియాడుతూ, ఆయనను సభకు పరిచయం చేశారు. అనంతరం 'భారత స్వాతంత్ర్యోద్యమం–సమైక్య పోరాటాల సమాహారం' అనే అంశం మీద నశీర్ అహమ్మద్ దాదాపు గంటన్నర సేపు ధారాళంగా మాట్లాడారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం యోధులు చేసిన అపురూప త్యాగాల గురించి ఆయన ఒక్కొక్క సంఘటనను కథలు కథలుగా వివరిస్తుంటే హాజరైన విద్యార్థుల వదనాలు విస్మయంతో విప్పారాయి. గాంధీజీ ప్రాణాలను కాపాడిన బతక్ మియా, అమరవీరులు రామ్‌ప్రసాద్ బిస్మిల్ – అస్ఫాఖుల్లా ఖాన్‌ల అపురూపమైన మతాతీత స్నేహం, ఝాన్సీ రాణికి సైనికులకు ఆయుధాలతో తోడువచ్చిన బండా నవాబ్ అలీ బహదూర్, సుభాష్ చంద్రబోస్‌కు 'నేతాజీ' అని పేరుపెట్టిన, 'జైహింద్' నినాదాన్నే సృజించిన తెలుగు బిడ్డడు ఆబిద్ హసన్ సఫ్రానీ, గాంధీజీ ఇచ్చిన ఒక్క పిలుపుతో తన ఆస్తినంతటినీ దేశవిముక్తి కోసం ధారబోసిన యూసుఫ్ సోభానీ, బ్రిటిష్ వైశ్రాయ్ లార్డ్ మాయోని కాల్చిచంపిన అమరయోధులు షేర్ అలీ అఫ్రీదీ, ఇలా ఒక్కొక్క ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల అమరగాథలను విన్న శ్రోతలు అశ్చర్యానికి గురయ్యారు. చరిత్రలో దాగిన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు కూడా తెలీని దశ నుంచి, ఒక నూతన అవగాహన ఏర్పరుచుకున్న సంతృప్తి సభికుల కళ్లలోనూ మెరిసింది. పనిగట్టుకు ప్రచారం చేసే విద్వేషాల చరిత్ర కాదు, జాతిమత ద్వేషాలకతీతంగా సాగిన సమైక్యపోరాటాల గాథలు వినిపించిడం, చరిత్రను విస్తారంగా ప్రచారం చేయడం నేటి అవసరం అని నశీర్ అహమ్మద్ ప్రసంగం రుజువుచేసింది. ఈనాటి ఆయన ప్రసంగం తమకు కొత్త విషయాలను తెలిపిందనీ, చరిత్ర పఠనం పట్ల ఆసక్తిని పెంచిందనీ విద్యార్థినులు రస్మిత, హంస, కుసుమ, శ్రుతి తమ స్పందనగా తెలియజేశారు. ప్రస్తుత స్థితిగతుల్ని అవగాహన చేసుకోవాలంటే చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని చెబుతూ వెంకటరమణ మాష్టరు 'రెఫ్యూజీ' అనే కవితను వినిపించారు. తెలిసిపరా రామారావు సయ్యద్ నశీర్ అహమ్మద్ కు తన పాటను అంకితమిస్తూ ఓ ప్రగతిశీల గీతాన్ని ఆలపించారు. సమకాలీన చరిత్రలోని అసంగతాలను గుర్తుచేశారు. ఇలాంటి కార్యక్రమం ఏదో విద్యాలయంలో పెద్ద ఎత్తున జరగాల్సిందని శివలింగం మాస్టారు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం విచ్చల విడిగా అసత్యాలను ప్రచారం చేస్తున్న వాట్సాప్ గ్రూపుల విషయంలో చాలా అప్రమత్తంగా వుండాలని అయిక చంద్రశేఖర్ రావు హెచ్చరించారు. చరిత్ర అంటే భయపడే దశ నుండి చరిత్ర ఎంతో ఆసక్తికరమైనదన్న విషయాన్ని తను గ్రహించినట్టు నిర్మల తెలిపారు. సయ్యద్ నశీర్ అహమ్మద్ జీవితంలోని 'పాల తల్లి' యశోదమ్మ గారి ఉదాహరణనూ, తన వ్యక్తిగత జీవితంలోని ఉదాహరణలనూ చాలా భావోద్వేగంతో చెబుతూ అసలు 'హిందూ – ముస్లిం' విభేదాలకు అర్థం వుందా అంటూ అయికా బాలాజీ ప్రశ్నించారు. బోడ తారకేశు మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతమైనందుకూ, మరీ ముఖ్యంగా ఈ ప్రసంగం పిల్లలను ఉత్తేజపరినందుకూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమ సందర్భంగా 'దరిశి చెంచయ్య – ఆయన జీవితమే ఒక సందేశం' పుస్తకాన్ని వేదిక మీదున్న పెద్దలు పునరావిష్కరించారు. అయికా బాలాజీ విరచిత సినిమా వ్యాసాల పుస్తకం 'సినీ ప్రపంచంలో ఆమె' గురించి బోడ తారకేశు సభకు పరిచయం చేయగా, ఆ పుస్తకాన్ని ఒట్టి భూతేశు ఆవిష్కరించారు. 'అన్నదమ్ముల వలెను జాతులు, మతములన్నియు మెలగవలెనోయ్' అన్న సందేశంతో ఈ సభ ముగిసింది.

# ఎస్ఐఆర్ విధుల పట్ల బీఎల్‌వోలకు ఊరట

**హైదరాబాద్, జూన్ 29 (జనంసాక్షి) :** ఎన్నికల సంబంధిత విధుల్లో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు బూత్ లెవల్ ఆఫీసర్ల (బీూం)గా విధులు నిర్వహిస్తున్న కారణంగా ప్రభావితమయ్యే అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓజా మెమో జారీ చేశారు. నెల రోజులపాటు ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియను కొనసాగించాలని నేపథ్యంలో.. బిఎల్ఓ విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇతర పనులు అప్పగించవద్దని ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో... అంగన్వాడి కేంద్రాల సమయపాలనలో రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక మార్పులు చేసింది. 2026 జూన్ 29 నుంచి జూలై 28 వరకు ఒక నెలపాటు, బీఎల్ఓ విధుల కారణంగా ప్రభావితమయ్యే అంగన్‌వాడీ కేంద్రాలు ప్రతిరోజూ ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు పనిచేస్తాయి.

# అన్నాడిఎంకెలో కొనసాగుతున్న రాజీనామాలు

- కరూర్ ఎమ్మెల్యే విజయభాస్కర్ రాజీనామా

**చెన్నై, జూన్29 (జనంసాక్షి) :** తమిళనాడు రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అన్నాడిఎంకెకు చెందిన మరో ఎమ్మెల్యే రాజీనామా చేశారు. మాజీ రవాణా శాఖ మంత్రి, కరూర్ ఎమ్మెల్యే ఎంఆర్ విజయభాస్కర్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏఐఏడీఎంకేకు రాజీనామా చేసిన ఎమ్మెల్యేల సంఖ్య ఆరుకు చేరింది. విజయభాస్కర్ సోమవారం చెన్నైలోని రాష్ట్ర సచివాలయంలో అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌ను కలిసి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. నిబంధనలను పరిశీలించిన అనంతరం విజయభాస్కర్ రాజీనామాను స్పీకర్ ఆమోదించినట్లు సమాచారం. దీంతో అసెంబ్లీలో ఏఐఏడీఎంకే బలం 41కు పడిపోయింది. రెండు వారాల క్రితం నలుగురు ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామాలు చేసి అధికార టీవీకేలో చేరారు. తాజాగా విజయ్ భాస్కర్ కూడా అదే బాటలో నడిచారు. ఆయన ఈరోజు అధికార టీవీకేలో చేరతారని వార్తలు వస్తున్నాయి. యలలిత మంత్రివర్గంలో విజయభాస్కర్ రవాణా శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన 2021 ఎన్నికలలో కరూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. విజయభాస్కర్ రాజీనామాతో తమిళనాడులో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలు ఖాళీ అయ్యాయి. వీటిల్లో విజయ్ వదులుకున్న తిరుచ్చి స్థానం కూడా ఒకటి. ఈ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది.

# నమ్మకానికి (ట్రస్ట్) నయవంచన

*దేవుని పేర దేవుని దోచురి*
*మతాల నడుమ మంటలు లేపిరి..*
*ప్రభుత్వాల మార్పుకు రామజపం చేసిరి..*
*'ట్రస్ట్' అనే నమ్మకం పదాన్నే అమ్మేశారు..!*

సంపాదకీయం

శతాబ్దాల విశ్వాసాన్ని రాజకీయ నినాదంగా మలిచి, కోట్లాది భక్తుల భావోద్వేగాలను ఓట్లుగా మార్చుకున్నవారు, ఇప్పుడు అదే విశ్వాసానికి నిలువెత్తు ప్రశ్నలు ఎదుర్కొంటున్నారు. రాముడి పేరు పవిత్రం. ఆ పేరుతో ఏర్పడిన సంస్థలపై అవినీతి, అక్రమాలు, ఆర్థిక పారదర్శకత లేమి వంటి ఆరోపణలు వినిపిస్తే, అది కేవలం ఒక సంస్థకు సంబంధించిన విషయం కాదు, దేశ ప్రజల విశ్వాసానికి సంబంధించిన విషయం. రాముడి పేరు చెప్పి అధికారంలోకి రావడం ఒకటి; రాముడి ఆదర్శాలను ఆచరించడం మరోటి. సత్యం, ధర్మం, న్యాయం, పారదర్శకత, ఇవే శ్రీరాముని సందేశం. ఆ విలువలను విస్మరించి కేవలం రామనామాన్ని రాజకీయ సాధనంగా ఉపయోగిస్తే, అది భక్తిని అవమానించినట్టే.

ట్రస్ట్ అంటే నమ్మకం. ఆ నమ్మకంపై ఒక్క చిన్న అనుమానం వచ్చినా దానిని వెంటనే, పారదర్శకంగా నివృత్తి చేయాల్సిన బాధ్యత ట్రస్ట్ నిర్వాహకులదే. ఎందుకంటే భక్తులు సమర్పించిన ప్రతి రూపాయి పవిత్రమైన విశ్వాసానికి ప్రతీక.

దేవుడి పేరుతో రాజకీయ లాభాలు పొందినవారు, అదే దేవుడి పేరుతో ఏర్పడిన సంస్థలపై వచ్చిన ప్రతి ఆరోపణకు బహిరంగంగా సమాధానం చెప్పాలి. స్వతంత్ర విచారణకు సహకరించాలి. తప్పు చేయకపోతే నిజం వెలుగులోకి రావడానికి ఎందుకు భయపడాలి? రాముడి పేరు ప్రజలను విభజించడానికి కాదు; విలువలను నిలబెట్టడానికి. భక్తిని వ్యాపారంగా, విశ్వాసాన్ని పెట్టుబడిగా, ట్రస్ట్‌ను అనుమానాల కేంద్రంగా మార్చే పరిస్థితి వస్తే, అది ప్రజాస్వామ్యానికీ, ఆధ్యాత్మికతకీ ప్రమాదకరం. దేవుడి పేరు పవిత్రం. ఆ పేరుతో ఏర్పడిన ప్రతి సంస్థ కూడా అంతే పవిత్రమైన జవాబుదారీతనాన్ని ప్రదర్శించాలి. లేకపోతే దెబ్బతినేది ఒక ట్రస్ట్ ప్రతిష్ఠ మాత్రమే కాదు, కోట్లాది భక్తుల విశ్వాసం.

# న్యాయవ్యవస్థకు స్వేచ్ఛతో పాటు జవాబుదారీతనమూ అవసరమే



భారత ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ అంతిమ ఆశ్రయం. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు విఫలమైన సందర్భాల్లో కూడా ప్రజలు న్యాయస్థానాలనే ఆశ్రయిస్తారు. ఆ విశ్వాసానికి మూలం న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యం. అయితే స్వాతంత్ర్యం అంటే జవాబుదారీతనం లేకపోవడం కాదనే సత్యాన్ని న్యాయవ్యవస్థ కూడా గుర్తించాల్సిన సమయం వచ్చింది. ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన న్యాయాధికారి అరవింద్ మల్హోత్రా తన కంటే జూనియర్లను హైకోర్టు న్యాయమూర్తులుగా సిఫారసు చేయగా, తనను ఎందుకు పక్కన పెట్టారో తెలుసుకోవాలనడం ఈ చర్చను మరోసారి ముందుకు తీసుకొచ్చింది. వ్యక్తిగతంగా ఇది ఒక అధికారికి జరిగిన అన్యాయం మాత్రమే కాదు. న్యాయమూర్తుల నియామక వ్యవస్థ ప్రజాస్వామ్య సూత్రాలకు ఎంత మేరకు అనుగుణంగా ఉందనే పెద్ద ప్రశ్నను కూడా లేవనెత్తింది.

భారత రాజ్యాంగ నిర్మాతలు న్యాయవ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించారు. అయితే న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన పూర్తి విధానాన్ని రాజ్యాంగంలో పేర్కొనలేదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 217 హైకోర్టు న్యాయమూర్తి కావడానికి అవసరమైన అర్హతలను మాత్రమే నిర్దేశించింది. కానీ అర్హులైన వారిలో ఎవరిని ఎంపిక చేయాలి? ఎలాంటి ప్రమాణాలకు ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి? అనే అంశాలను పేర్కొనలేదు. ఆ ఖాళీని తరువాత సుప్రీం కోర్టు తీర్పుల ద్వారా ఏర్పడిన కొలీజియం వ్యవస్థ భర్తీ చేసింది.

అయితే, న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి రూపొందించిన ఈ వ్యవస్థ, క్రమంగా పూర్తిగా మూసివేసిన వ్యవస్థగా మారిపోయిందనే విమర్శలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. మాజీ న్యాయమూర్తి జస్టిస్ జె. చలమేశ్వర్ ఒకసారి చేసిన వ్యాఖ్య ఇప్పటికీ ప్రాసంగికంగానే ఉంది. "పారదర్శకత లేని వ్యవస్థ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుంది" అని ఆయన కొలీజియం సమావేశాల మినిట్స్‌ను బహిర్గతం చేయాలని కోరుతూ భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థకు ప్రజల గౌరవం కేవలం అధికారంతో రాదు; విశ్వసనీయతతో వస్తుందనే సందేశాన్ని ఆయన అప్పుడే చెప్పారు.

భారత మాజీ అటార్నీ జనరల్ సోలీ సోరాబ్జీ కూడా న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని బలంగా సమర్థించినప్పటికీ, కొలీజియం వ్యవస్థలో పారదర్శకత పెరగాలని పలుమార్లు సూచించారు. ఆయన అభిప్రాయం ప్రకారం, నియామక ప్రక్రియలో రాజకీయ జోక్యాన్ని నిరోధించడం ఎంత అవసరమో, అదే స్థాయిలో ప్రజల నమ్మకాన్ని పెంచే విధంగా కారణాలను వెల్లడించడం కూడా అంతే అవసరం. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి. లోకూర్ అనేక సందర్భాల్లో సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు శాశ్వత సచివాలయం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కొలీజియం సభ్యులు పదవీ విరమణతో మారిపోతుంటారు. దాంతో నిర్ణయాల్లో కొనసాగింపు, సంస్థాగత జ్ఞాపకశక్తి దెబ్బతింటుంది. ఒక శాశ్వత సచివాలయం ఉంటే అభ్యర్థుల సేవా చరిత్ర, పనితీరు, ఫిర్యాదులు, ప్రశంసలు వంటి అంశాలను క్రమబద్ధంగా నమోదు చేసి, ఒకే ప్రమాణాలతో పరిశీలించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎన్. వెంకటచలయ్య కూడా గతంలో న్యాయవ్యవస్థకు స్వాతంత్ర్యం ఎంత ముఖ్యమో, అదే సమయంలో పారదర్శకత కూడా అంతే అవసరమని అనేక సందర్భాల్లో అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఏ రాజ్యాంగ సంస్థ కూడా ప్రజల ప్రశ్నలకు పూర్తిగా అతీతంగా ఉండకూడదని ఆయన చెప్పిన మాటలు ఇప్పటికీ వర్తిస్తాయి.

ప్రఖ్యాత న్యాయవేత్త ఫాలీ ఎస్. నారిమన్ కొలీజియం వ్యవస్థను సమర్థించినప్పటికీ, అది "పరిపూర్ణ వ్యవస్థ కాదు" అని స్పష్టంగా అంగీకరించారు. కార్యనిర్వాహక జోక్యం కంటే కొలీజియం మెరుగైనదే అయినప్పటికీ, అందులో లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దేందుకు అంతర్గత సంస్కరణలు తప్పనిసరిగా చేపట్టాలని ఆయన సూచించారు.

మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ కూడా న్యాయమూర్తుల నియామకాల్లో ప్రతిభతో పాటు సామాజిక వైవిధ్యం, ప్రాంతీయ సమతుల్యత, మహిళల ప్రాతినిధ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. న్యాయవ్యవస్థ సమాజాన్ని ప్రతిబింబించాల్సిందే తప్ప, కొద్దిమంది సామాజిక వర్గాలకే పరిమితం కాకూడదని ఆయన అభిప్రాయపడ్డారు.

న్యాయపరిశోధన రంగంలో ప్రముఖ పత్రికలైన "ఇండియన్ లా రివ్యూ", "నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా రివ్యూ", "జర్నల్ ఆఫ్ ఇండియన్ లా అండ్ సొసైటీ" వంటి పత్రికల్లో వెలువడిన అనేక పరిశోధనా వ్యాసాలు కూడా ఒకే విషయాన్ని పదేపదే గుర్తుచేస్తున్నాయి. న్యాయమూర్తుల వ్యక్తిగత చర్చలు గోప్యంగానే ఉండవచ్చు. కానీ ఎంపికకు ఉపయోగించే ప్రమాణాలు మాత్రం బహిరంగంగా ఉండాలని అవి సూచిస్తున్నాయి. కారణాలు చెప్ప కుండా తీసుకునే నిర్ణయాలు ఎంత నిష్పాక్షికమైనవైనా ప్రజలలో అనుమానాలను పెంచుతాయని ఆ పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి.

అంతర్జాతీయ అనుభవాలు కూడా ఇదే విషయాన్ని బలపరుస్తున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్‌లో జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్, దక్షిణాఫ్రికాలో జ్యుడీషియల్ సర్వీస్ కమిషన్, కెనడాలోని న్యాయమూర్తుల ఎంపిక విధానాలు పూర్తిగా రాజకీయ ప్రభావానికి లోనుకాకుండా, అదే సమయంలో పారదర్శకతకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాయి. అభ్యర్థుల ఎంపికకు అనుసరించే ప్రమాణాలు బహిరంగంగా ప్రకటించడం, దరఖాస్తులను క్రమబద్ధంగా పరిశీలించడం, ఎంపిక ప్రక్రియను సంస్థాగతంగా నిర్వహించడం వంటి విధానాలు అక్కడ అమలులో ఉన్నాయి. భారతదేశం వాటిని యథాతథంగా అనుసరించాల్సిన అవసరం లేకపోయినా, వాటి నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు మాత్రం ఉన్నాయి.

నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జెఏసి)ను సుప్రీంకోర్టు రద్దు చేసినప్పుడు కూడా ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేసింది. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసే మార్పులను అంగీకరించలేమని చెబుతూనే, కొలీజియం వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు మెమొరాండం ఆఫ్ ప్రొసీజర్‌ను సవరించాలని కేంద్ర ప్రభుత్వానికి, సంబంధిత వర్గాలకు సూచించింది. దురదృష్టవశాత్తు ఆ సంస్కరణలు ఇంకా పూర్తిగా అమలు కాలేదు. ఇక్కడ ప్రధానంగా అవసరమయ్యేవి విప్లవాత్మక మార్పులు కావు. ముందుగా, కొలీజియం ఎంపికకు అనుసరించే ప్రమాణాలను అధికారికంగా ప్రకటించాలి. రెండవది, పక్కన పెట్టబడిన అభ్యర్థికి కనీసం సాధారణ స్థాయిలో అయినా కారణాలు తెలియజేయాలి. మూడవది, నియామక ప్రక్రియకు ఒక శాశ్వత సచివాలయాన్ని ఏర్పాటు చేసి సంస్థాగత జ్ఞాపకశక్తిని కాపాడాలి. నాలుగవది, అభ్యర్థులపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించేందుకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలి. ఐదవది, మహిళలు, వెనుకబడిన వర్గాలు, వివిధ ప్రాంతాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే విధంగా విధానపరమైన మార్గదర్శకాలు రూపొందించాలి.

ప్రజాస్వామ్యంలో ప్రతి రాజ్యాంగ సంస్థ ప్రజల విశ్వాసంపైనే నిలబడుతుంది. న్యాయవ్యవస్థ విషయంలో ఈ సత్యం మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటుంది. ఒక న్యాయమూర్తి తన ప్రతి తీర్పుకు కారణాలు చెప్పాల్సిందేనని న్యాయసూత్రం చెబుతుంది. అదే సూత్రం న్యాయమూర్తులను ఎంపిక చేసే వ్యవస్థకూ వర్తించాలి. ఎందుకంటే న్యాయం జరగడం మాత్రమే కాదు; న్యాయం జరిగినట్లు ప్రజలకు కనిపించడము కూడా అంతే ముఖ్యం. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని కాపాడటం ఎంత అవసరమో, దానిపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే అవసరం. ఆ విశ్వాసం రహస్యాలతో కాదు, పారదర్శకతతో పెరుగుతుంది. అధికారంతో కాదు, జవాబుదారీతనంతో బలపడుతుంది. కొలీజియం వ్యవస్థ ఈ సత్యాన్ని ఎంత త్వరగా అంగీకరిస్తే, భారత న్యాయ వ్యవస్థ అంతగా బలపడుతుంది. స్వతంత్రతకు ప్రత్యామ్నాయం లేదు. కానీ స్వతంత్రతకు విశ్వసనీయతను జోడించేది పారదర్శకత మాత్రమే. అదే ప్రజాస్వామ్యానికి, అదే న్యాయపాలనకు నిజమైన బలం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

### తప్పక వాడొస్తాడొస్తాడొస్తాడు..

ఘటనా ఘటనలుగా
ఉబికి వస్తున్న
సకల సందర్భాల్ని
అన్ని అవకాశాల్ని
అదునుగా అందిపుచ్చుకుని
అంటు ముట్టులూ
నిచ్చెన మెట్లను
స్థితిదాయక
భ్రష్టత్వాలకు
వన్నెలద్దిన
అభిజాత్య
జాడ్యాలకు
హారతులిస్తూ..
బొడ్రాయి పర్వం
మా అందరి జీవం
అలాయి గుండం
అందరి ఐక్యత
గడప ముగ్గులూ
కాముని దహనాల్
చరిత గురుతులని
కితాబులిస్తూ..
ఆధునికతల
అలంకారాలతో
గేరీ.. ఊరూ..
వాకిలీ.. ఇల్లూ..
తిని తాగే
బతుకును నిలిపే
గాలీ.. నీరూ.. బువ్వా..
వొళ్ళు.. బుద్ధి.. బుర్రా..
మట్టగ నింపుకు మురిగిన
దిన చర్యలు దాపురించుకుని
దర్పంగా దర్వాజాలు
తెరిచుంచుకున్నాక..
దర్జాగా రాకేం చేస్తది
ఫాసిజం..
కీలూ.. ఏలూ..
నడ్డీ..నాడీ..
అరమూసిన తనబ్బీలైనా
తాళాలేసిన సందుకులైనా..
నీ శ్వాసా.. ఆశా.. ధ్యాసా..
సోయీ.. సోంచూ.. తలబూ..
అన్నీ తనవై ఆంబోతోలే
తిష్ట వేయక ఏంచేస్తుందది
నరహంతక నాజీయిజము..
దాస్యంతం చేస్తానంటూ
బైలెల్లిన పైలు మానులు
శరాలొదిలి సమరాన్నిడిసి
సాగిల బడిరి సాష్టాంగంగ
జోలెలు బట్టి జేజే లంటూ..
గొలియతు అహమును
నేలకు కూల్చిన బాలుడిలాగ
తన తల్లిని చెరబట్టిన కీచక
మాయల ఫకీరు కుతికెను
పట్టే బాలవర్ధి రాజొస్తడు..
అన్నార్థుల ఆకలి కేకల్లోంచే
పీడితజనాగ్రహ వేదనలోంచే
తప్పక వాడొస్తాడొస్తాడొస్తాడు..
ఉద్యమ నెల బాలుడొస్తాడు..!
సర్వం దోచి భస్మం జేసే
బతుకుల గూల్చే దొంగల్నెల్లా
కాచే హంతక ముఠాలురేపే
ఫాసిజం అంతం చేసి తీర్తడు..!!

డా. ఇక్బాల్ పాషా
9440775732

# నివురు గప్పిన పంజాబ్

## మత రాజకీయాల మంటల్లో నవతరం

చరిత్ర పుటల్లో కొన్ని భూభాగాలు కేవలం భౌగోళిక సరిహద్దులుగా మిగిలిపోవు. అవి మానవ వేదనకు, నిరంతర ఘర్షణలకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి. పంజాబ్ అచ్చం అలాంటిదే. ఐదు నదులు గలగల పారే ఆ పవిత్ర నేలలో కేవలం నీరు మాత్రమే ప్రవహించడం లేదు, శతాబ్దాల కాలంగా చిందిన రక్తం, కన్నీళ్లు, ఆక్రందనలు, వీరుల గర్జనలు కూడా అందులో కలిసి పారుతున్నాయి. దురదృష్టవశాత్తూ, నేడు ఆ భూమి మళ్లీ రగులుతోంది. అయితే, ఈసారి రేగిన మంటలు సరిహద్దుల అవతల నుంచి వచ్చినవి కావు. ఇవి మన అంతర్గత వ్యవస్థలోనే పెంచి పోషించబడిన అగ్ని కీలలు, రాజకీయ ప్రయోగశాలల్లో వ్యూహాత్మకంగా నూరిపోసి, మతపరమైన భావోద్వేగాల చమురును పోసి, సరిగ్గా ఎన్నికల ముంగిట అంటించే కృత్రిమ మంటలివి. ఈ వ్యాసంలోకి అడుగుపెట్టే ముందు, దయచేసి మీ మనస్సులో ఉన్న అన్ని రకాల పక్షపాత వైఖరులను, సౌకర్యవంతమైన అభిప్రాయాలను ఒక్క క్షణం పక్కన పెట్టండి. ఎందుకంటే, వర్తమాన పంజాబ్‌లో జరుగుతున్న యదార్థాన్ని నిష్పక్షపాతంగా అర్థం చేసుకోవాలంటే, మనకు కావలసింది కేవలం సోమరి మేధస్సు కాదు, నిజానిజాలను లోతుగా చీల్చి చూసే శస్త్రచికిత్స లాంటి నిశితమైన అంతర్మథనం కావాలి.

పంజాబ్ మట్టిలో సిక్కు మతం అనేది కేవలం ఒక ఆరాధనా పద్ధతి మాత్రమే కాదు. అది వారి అస్తిత్వం, ఆత్మగౌరవం, సాంస్కృతిక వైభవం మరియు ప్రతి పౌరుడి దైనందిన జీవన విధానం. పవిత్ర 'గురు గ్రంథ్ సాహిబ్' పట్ల సిక్కు సమాజానికి ఉన్న అపారమైన భక్తిశ్రద్ధలను మాటల్లో నిర్వచించడం సాధ్యం కాదు. ఆ సున్నితమైన ఆత్మీయ అనుబంధాన్ని స్పృశించలేని వాడు పంజాబ్ ఆత్మను ఎప్పటికీ అర్థం చేసుకోలేడు. కానీ విచారకరమైన విషయం ఏంటంటే, అదే నిరుపమానమైన ఆత్మీయ భావనను క్రూరమైన రాజకీయ ఆయుధంగా మార్చుకున్నప్పుడు సమాజం ఎంతటి దారుణమైన విచ్ఛిన్నానికి గురవుతుందో మనం గత దశాబ్ద కాలంగా (2015 నుండి 2025 వరకు) ప్రత్యక్షంగా చూశాం. 2015లో బర్గారీ గ్రామంలో జరిగిన పవిత్ర గ్రంథ అపవిత్రీకరణ ఉదంతం సిక్కుల గుండెల్లో అగ్నిపర్వతాన్ని రగిల్చింది. ఆ ఆగ్రహం నూటికి నూరు శాతం సహజమైనది, న్యాయబద్ధమైనది. కానీ, ఆ ఘోరమైన నేరం వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు? దర్యాప్తు సంస్థలు ఎందుకు పదేపదే విఫలమవుతున్నాయి? అన్న ప్రశ్నలకు పదేళ్లు గడిచినా నేటికీ సమాధానం లేదు. ఎందుకంటే, స్వార్థపూరిత రాజకీయ నాయకులకు సత్యం వైపు నడవాలనే చిత్తశుద్ధి లేదు. వారికి కావలసిందల్లా ఆ వేదనను ఎన్నికల ప్రచారంలో ఓట్ల పంటగా మార్చుకోవడమే.

పంజాబ్ వర్తమాన సందర్భాలులో చట్టం ఒక వింత రూపంలో దర్శనమిస్తోంది. అది సామాన్యుల పట్ల సింహంలా గర్జిస్తూ, అధికార అండ ఉన్న బలవంతుల ముందు గొర్రెపిల్లలా లొంగిపోతోంది. మతపరమైన ఉద్రిక్తతలు రేగినప్పుడు పరిస్థితి అదుపు తప్పింది అంటూ పోలీసులు చేతులు ముడుచుకుంటారు, కానీ రాజకీయ ప్రత్యర్థులను అణచివేయాలన్నఆదేశాలు రాగానే అర్ధరాత్రి వేళల్లో సైతం ఎఫ్ఐఆర్లు నమోదు చేసి అరెస్టులకు తెగబడతారు.

జాతీయ భద్రతా చట్టం, ఉపా వంటి కఠిన చట్టాలు దేశ సమగ్రతను రక్షించ దానికి ఉద్దేశించినవి. కానీ పంజాబ్‌లో ఇవి మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కాకుండా, నిలదీసే పత్రికారచయితలపై, సామాజిక అసమ్మతి వాదులపై ప్రయోగించబడటం అత్యంత ఆందోళనకరం. ఇది చట్టవ్యవస్థ వైఫల్యం మాత్రమే కాదు, ప్రజాస్వామ్య నైతిక దివాళాకోరుతనానికి నిదర్శనం. 2022లో అమృత్‌పాల్ సింగ్ అనే యువకుడు ఖలిస్తానీ భావజాలంతో తెరపైకి వచ్చినప్పుడు యువత అతని వెనుక పరుగులు తీసింది. సామాజికంగా దీనిపై ఆందోళన వ్యక్తమైనప్పటికీ, అసలు యువత ఎందుకు ఆ మార్గాన్ని ఎంచుకుందో ఆలోచించాలి. తీవ్రమైన నిరుద్యోగం, వెన్ను విరుస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారి, ప్రభుత్వాల ఉదాసీనతలే వారిని ఆ అగాధంలోకి నెట్టాయి. వ్యవస్థే ఈ సంక్షోభాన్ని సృష్టించి, తిరిగి వారినే తీవ్రవాదులుగా ముద్ర వేయడం ఎంతటి ఘోరమైన వైరుధ్యం!


భారతదేశ రాజకీయ యవనికపై పంజాబ్ ఒక నిరంతర ప్రయోగశాలగా మారింది. కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్, బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ ఇలా ప్రతి ఒక్కరూ ఇక్కడ తమదైన ప్రయోగాలు చేశారు. కానీ అందరూ చివరకు ఒకే అపవిత్ర సూత్రానికి కట్టుబడ్డారు. అభివృద్ధిని సాధించడం కష్టం, కానీ మతపరమైన ఉద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయం చేయడం చాలా సులభం. అకాలీదళ్ మతాన్ని, రాజకీయాన్ని కలగలిపి దశాబ్దాల పాటు పాలన సాగించింది. సిక్కుల అత్యున్నత మత సంస్థ అయిన 'శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ' పై నియంత్రణ సాధించడం ద్వారా వారు తమ ఓటు బ్యాంకును భద్రపరుచుకున్నారు. మరోవైపు, ఎన్నికల వేళల్లో జాతీయ పార్టీల అగ్రనేతలు సైతం మతపరమైన వేదికలపై నాటకీయంగా ప్రసంగాలు చేస్తూ ఓట్లు దండుకోవడానికే ప్రాధాన్యతనిచ్చారు. 2022లో పంజాబ్ ప్రజలు తీవ్ర నిరాశతో ఆమ్ ఆద్మీ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టారు. అయితే, ఆ మార్పు ప్రజల ఆశల నుంచి కాదు, పాత పాలకుల పట్ల వారికున్న తీవ్ర అసంతృప్తి నుంచి పుట్టింది. దురదృష్టవశాత్తూ, అధికారాలు మారినా సామాన్యుల తలరాతలు మారలేదు. వ్యవస్థాగత లోపాలు అలాగే ఉండిపోయాయి, నిరాశ చెందిన ప్రజలు ఒక పాలకుడి నుండి మరొక పాలకుడి వైపు కేవలం భ్రమలతో మాత్రమే ప్రయాణిస్తున్నారు. పంజాబ్ అంతర్గత సంక్షోభాన్ని విశ్లేషించేటప్పుడు అక్కడి మాదకద్రవ్యాల సమస్యను విస్మరించలేము. హెరాయిన్, అఫీమ్ వంటి మత్తు పదార్థాలు పంజాబ్ యువతరాన్ని నిలువునా దహించివేస్తున్నాయి. ఇది కేవలం సరిహద్దు దేశాల కుట్ర మాత్రమే కాదు, స్థానిక ఆర్థిక వ్యవస్థ వైఫల్యం, రాజకీయ నాయకుల అండదండలతో ముడిపడి ఉన్న మాఫియా నెట్‌వర్క్. ఒక ఇంట కొడుకు మత్తుకు బానిసగా మారి శవమై తేలినప్పుడు, ఆ తల్లి ఆక్రందనకు ఏ రాజకీయ సభల్లోనూ సమాధానం దొరకదు. ఎన్నికల సమయంలో పవిత్ర స్థలాల్లో ప్రగల్భాలు పలికే నేతలు, ఆ తల్లుల కన్నీళ్లను కూడా తమ రాజకీయ ప్రయోజనాల కోసమే వాడుకుంటారు. ప్రజల జీవితాలు ఛిద్రమవుతున్నా, పాలకుల రాజకీయ లెక్కలు మాత్రం నిరంతరం లాభాల కోసమే మేల్కొని ఉంటాయి. ఈ హృదయ విదారక వాస్తవాలను పరిశీలించిన తర్వాత ప్రతి ఒక్కరి మనస్సులో మరి దీనికి పరిష్కారం ఏమిటి? అనే ప్రశ్న ఉదయిస్తుంది. వ్యవస్థను ఇంతగా భ్రష్టు పట్టించిన రాజకీయ శక్తుల నుంచి తక్షణ మార్పును ఆశించడం అత్యాశే అవుతుంది. కానీ పంజాబ్ చరిత్ర సామాన్యమైనది కాదు. 1984 నాటి రక్తపాతం, ఘోర హింస తర్వాత కూడా ఆ నేల మళ్లీ ఫీనిక్స్ పక్షిలా పైకి లేచింది. పంజాబ్ ప్రజలు, ముఖ్యంగా సిక్కు సమాజం, తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి ఎల్లప్పుడూ అసాధారణ సాహసాన్ని ప్రదర్శించారు. ఈ రోజు కూడా వారు మతపరమైన భావోద్వేగాల మత్తును విడనాడి, రాజకీయ శక్తుల కుయుక్తులను పటాపంచలు చేస్తూ, స్వతంత్రంగా ఆలోచించినప్పుడే నిజమైన పురోగతి సాధ్యమవుతుంది. పంజాబ్ సంక్షోభం కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన సమస్య కాదు, ఇది భారత ప్రజాస్వామ్య నైతికతకు ఎదురవుతున్న పెను సవాలు. మనుషులను కేవలం మనుషులుగా చూసే మానవతా దృక్పథం లోపించినప్పుడు, పాలకుల ఉపన్యాసాలన్నీ ముగిసి పోయిన సభలో మిగిలిన శబ్ద కాలుష్యం లాంటివే. మనకు కావలసింది విప్లవాత్మకమైన మాటలు కావు, కఠోరమైన వాస్తవాల గుర్తింపు. ఎందుకంటే, నిశితమైన వాస్తవమే ఏ విప్లవం కంటేనైనా అత్యంత శక్తివంతమైనది.

డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# పరిశోధనలతో పరిపుష్టమైన తెలంగాణ నవలా సాహిత్యం

### విశ్వవిద్యాలయాల గ్రంథాల నుంచి సమాజ చరిత్ర వరకు విస్తరించిన అధ్యయన సంపద

*సాహిత్యం కేవలం వినోదానికి పరిమితమైన ప్రక్రియ కాదు. అది సమాజానికి అద్దం, చరిత్రకు ప్రత్యామ్నాయ పత్రం, మానవ అనుభవాలకు శాశ్వత సాక్ష్యం. ముఖ్యంగా నవల అనే ప్రక్రియ ఒక కాలాన్ని, ఒక సమాజాన్ని, ఒక సంస్కృతిని, ఒక ప్రజల మనస్తత్వాన్ని అత్యంత విస్తృతంగా ఆవిష్కరించే సాహిత్య రూపం. తెలంగాణ నవలా సాహిత్యం కూడా ఇదే లక్షణాన్ని తనలో మోసుకొస్తూ శతాబ్ద కాలంగా సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాలను అక్షరబద్ధం చేసింది. ఈ నవలా సంపదపై జరిగిన పరిశోధనలు నేడు ఒక విశాలమైన విజ్ఞాన సంపదగా రూపుదిద్దుకోవడం తెలుగు సాహిత్య ప్రపంచానికి గర్వకారణం.*



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందే ఈ ప్రాంత సాహిత్యం ప్రత్యేక స్వరాన్ని ఏర్పరుచుకుంది. నిజాం పాలనలోని సామాజిక పరిస్థితులు, రైతాంగ సాయుధ పోరాటం, దళిత–బహుజన వాస్తవాలు, మహిళా చైతన్యం, గిరిజన జీవితం, వలసలు, కరువు, భాషా అస్తిత్వం, ప్రాంతీయ స్వాభిమానం వంటి అనేక అంశాలను తెలంగాణ నవలా రచయితలు సృజనాత్మకంగా ప్రతిబింబించారు. ఆ రచనలను విశ్లేషిస్తూ విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనలు తెలంగాణ సమాజ చరిత్రను మరింత స్పష్టంగా అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పించాయి.

ప్రారంభ దశలో జరిగిన పరిశోధనలు ప్రధానంగా తెలంగాణ విమోచనోద్యమం, రైతాంగ పోరాటం, నిజాం నిరంకుశ పాలన, ఉద్యమ స్ఫూర్తి వంటి అంశాలపై కేంద్రీకృతమయ్యాయి. నవలలను కేవలం కల్పిత కథలుగా కాకుండా చారిత్రక ఆధారాలుగా చదివే విమర్శనా దృక్పథం ఈ అధ్యయనాల్లో కనిపించింది. తెలంగాణ విమోచనోద్యమాన్ని ప్రతిబింబించిన నవలలు ప్రజల ఆకాంక్షలను ఎలా మలిచాయో, ఉద్యమ రాజకీయాలకు సాహిత్యం ఎలా బలమిచ్చిందో ఈ పరిశోధనలు విశ్లేషించాయి.

కాలక్రమేణా పరిశోధనల దృష్టి విస్తరించింది. మహిళల పాత్ర, స్త్రీ చైతన్యం, లింగ అసమానత, కుటుంబ వ్యవస్థ, మహిళా స్వీయ అస్తిత్వం వంటి అంశాలు ప్రత్యేక పరిశోధనా విభాగాలుగా ఎదిగాయి. తెలంగాణ మహిళా రచయితల నవలలు సామాజిక మార్పుకు ఎలా దోహదపడ్డాయో విశ్లేషించిన పరిశోధనలు తెలుగు సాహిత్య విమర్శకు కొత్త దిశను చూపించాయి. ఒకప్పుడు కథానాయకుడి చుట్టూ తిరిగిన విమర్శ ఇప్పుడు కథానాయిక అనుభవ ప్రపంచాన్ని కూడా సమానంగా అధ్యయనం చేయడం విశేషం.

దళిత, బహుజన, గిరిజన, ముస్లిం మైనారిటీ అస్తిత్వాలపై జరిగిన పరిశోధనలు తెలంగాణ నవలా సాహిత్యానికి కొత్త విలువను తీసుకొచ్చాయి. అట్టడుగు వర్గాల బాధలు, సామాజిక వివక్ష, ఆత్మగౌరవ పోరాటం, వృత్తి ఆధారిత జీవన విధానాలు, భాషా వైవిధ్యం వంటి అంశాలను నవలలు ఎంత లోతుగా ఆవిష్కరించాయో ఈ అధ్యయనాలు రుజువు చేశాయి. ఇది కేవలం సాహిత్య విశ్లేషణ మాత్రమే కాదు; సమాజ శాస్త్రం, చరిత్ర, మానవశాస్త్రం, సంస్కృతి అధ్యయనాలకు కూడా విలువైన ఆధారంగా నిలిచింది.

ప్రపంచీకరణ, పట్టణీకరణ, వలసలు, కుటుంబ విలువల మార్పు, యువత మానసిక సంఘర్షణలు వంటి ఆధునిక అంశాలు కూడా పరిశోధనల్లో ప్రాధాన్యం పొందడం గమనార్హం. సమాజం మారిన కొద్దీ నవలల స్వరూపం మారింది; నవలలు మారిన కొద్దీ పరిశోధనల దిశ కూడా మారింది. ఇదే సాహిత్య పరిశోధనల జీవంతత్వానికి నిదర్శనం. తెలంగాణ నవలా రచయితలపై జరిగిన వ్యక్తిగత పరిశోధనలు ఈ రంగానికి మరింత బలాన్ని చేకూర్చాయి. వట్టికోట ఆళ్వారుస్వామి నుంచి అంపశయ్య నవీన్ వరకు, దాశరథి రంగాచార్య నుంచి అల్లం రాజయ్య వరకు, ముదిగంటి సుజాతరెడ్డి నుంచి వేముల ఎల్లయ్య వరకు అనేక రచయితల జీవితాలు, రచనా శైలి, సామాజిక దృక్పథం, కథన శిల్పం, భాషా ప్రత్యేకతలపై విశ్లేషణాత్మక పరిశోధనలు జరిగాయి. ఈ అధ్యయనాలు రచయితల వ్యక్తిగత ప్రతిభను మాత్రమే కాదు, వారి కాలపు సామాజిక చరిత్రను కూడా వెలికితీశాయి.

జిల్లాల వారీగా జరిగిన నవలా సాహిత్య పరిశోధనలు మరో విశేషం. కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ వంటి జిల్లాల నవలా సంపదను స్థానిక చరిత్ర, భాష, సంస్కృతి, జీవన విధానాల నేపథ్యంలో పరిశీలించడం ద్వారా తెలంగాణ సాహిత్య వైవిధ్యం మరింత స్పష్టమైంది. ఒకే రాష్ట్రంలోనూ ప్రాంతీయ ప్రత్యేకతలు ఎంత లోతుగా ఉన్నాయో ఈ అధ్యయనాలు తెలియజేశాయి.

అయితే ఇంత విస్తృత పరిశోధన జరిగినప్పటికీ ఇంకా చేయాల్సిన పని చాలానే ఉంది. అనేక ఎం.ఫిల్., పీహెచ్.డి. సిద్ధాంత గ్రంథాలు విశ్వవిద్యాలయ గ్రంథాలయాలకే పరిమితమై ఉన్నాయి. వాటిని డిజిటల్ రూపంలో అందుబాటులోకి తేవడం, గ్రంథరూపంలో ప్రచురించడం, పరిశోధన డేటాబేస్‌లను నిర్మించడం అత్యవసరం. పరిశోధన ప్రజలకు చేరకపోతే దాని సామాజిక ప్రయోజనం అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. నేటితరం పరిశోధకులు అంతరశాఖా అధ్యయనాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. సాహిత్యాన్ని సమాజ శాస్త్రం, మీడియా అధ్యయనం, జానపద విజ్ఞానం, డిజిటల్ హ్యూమానిటీస్, భాషాశాస్త్రం, సాంస్కృతిక అధ్యయనాలతో అనుసంధానించే కొత్త పరిశోధనలు అవసరం. అలాగే తెలంగాణ నవలల అనువాదాలు, అంతర్జాతీయ తులనాత్మక అధ్యయనాలు, ప్రపంచ సాహిత్యంతో పోలికలు కూడా విస్తరించాలి. తెలంగాణ నవలా సాహిత్యం కేవలం ప్రాంతీయ సాహిత్యం కాదు; అది ప్రజల జీవన పోరాటాల చరిత్ర. ఆ చరిత్రను శాస్త్రీయంగా నమోదు చేసినవే ఈ పరిశోధనలు. ఇవి సాహిత్యానికి మాత్రమే కాదు, సమాజానికి కూడా దిశానిర్దేశం చేస్తాయి. ఒక ప్రాంతం తన చరిత్రను తెలుసుకోవాలంటే అక్కడి నవలలను చదవాలి; ఆ నవలలను లోతుగా అర్థం చేసుకోవాలంటే పరిశోధనలను అధ్యయనం చేయాలి. విశ్వవిద్యాలయాల పరిశోధనా సంపద పుస్తకాల అలమారల్లోనే నిలిచిపోకుండా సమాజానికి చేరినప్పుడే సాహిత్య పరిశోధన తన అసలైన ప్రయోజనాన్ని నెరవేర్చుతుంది. తెలంగాణ నవలా సాహిత్యంపై ఇప్పటివరకు జరిగిన అధ్యయనాలు ఆ దిశగా గొప్ప పునాది వేశాయి. ఇక ఆ పునాదిపై ప్రపంచ స్థాయి పరిశోధనలను నిర్మించడం, యువ పరిశోధకులను ప్రోత్సహించడం, డిజిటల్ ఆర్కైవ్‌లను అభివృద్ధి చేయడం, ప్రాంతీయ సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడం మనందరి బాధ్యత.

సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. పరిశోధన ఆ ప్రతిబింబానికి అర్థాన్ని అందిస్తుంది. తెలంగాణ నవలా సాహిత్యంపై జరిగిన ఈ పరిశోధనలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచే విజ్ఞాన వారసత్వం. వాటిని సంరక్షించడం, విస్తరించడం, ప్రజల్లోకి తీసుకెళ్లడం కాలానుగుణ అవసరం మాత్రమే కాదు– తెలంగాణ సాహిత్యానికి మనం చెల్లించాల్సిన ఋణం కూడా.



డా. ఐ. చిదానందం
తెలుగు అధ్యాపకులు
చరవాణి - 8801444335

## చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి

• ఎమ్మెల్యే బుయ్యని మనోహార్ రెడ్డి



**తాండూరు, జూన్ 29 (జనంసాక్షి) :** తాండూరు పట్టణంలోని ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ ప్రదర్శన మరియు అమ్మకములు స్టాల్స్‌ను ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత హస్తకళలు పురాతనమైనవని తెలిపారు. విభిన్న రూపాల్లో సంప్రదాయాలను ప్రతిబింబించే చేనేత హస్తకళలను అందరూ ప్రోత్సహించి ఆదరించాలన్నారు. ప్రదర్శనలో ఉంచిన ఉత్పత్తులు ఎంతో ఆకట్టుకున్నాయని, ప్రతి ఒక్కరూ ప్రదర్శనను సందర్శించి ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు ,సర్ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రావు,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నాగరాజు, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు చేనేత హస్తకళల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణకు యువత ముందుకు రావాలి

• సాధన సంస్థ ఆధ్వర్యంలో యువజన సంఘాల సదస్సు నిర్వహణ

కోట్‌పల్లి, జూన్ 29 (జనంసాక్షి) : కోట్‌పల్లి మండలంలోని బుగ్గపూర్ ఫంక్షన్ హాల్‌లో సాధన సంస్థ ఆధ్వర్యంలో "బాలల హక్కులు – యువజన సంఘాల పాత్ర" అనే అంశంపై యువజన సంఘాల సదస్సు ఘనంగా నిర్వహించారు. బాలల హక్కులపై అవగాహన పెంపొందించడం, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, పిల్లలపై లైంగిక దోపిడీ వంటి సామాజిక సమస్యలను అరికట్టడంలో యువత కీలక పాత్ర పోషించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాధన సంస్థ సీఈవో కామేశ్వరి మాట్లాడుతూ......బాలల హక్కుల పరిరక్షణ కోసం సాధన సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. సున్నా నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన వారిని బాలలుగా పరిగణిస్తారని తెలిపారు. ఐక్యరాజ్యసమితి 1989లో బాలల హక్కుల కన్వెన్షన్‌ను ఆమోదించగా, భారతదేశం 1992లో దానిని ఆమోదించిందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా పిల్లలకు సంబంధించిన 54 హక్కులను గుర్తించినప్పటికీ, వాటిలో ప్రధానంగా నాలుగు మౌలిక హక్కులను అమలు చేయడం జరుగుతోందని తెలిపారు. అవి జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్యం వహించే హక్కు అని పేర్కొన్నారు. ప్రతి చిన్నారి ఈ హక్కులను అనుభవించేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడ్వకేట్ వెంకటేష్ మాట్లాడుతూ..... ప్రస్తుతం జిల్లాలో పిల్లలపై ముఖ్యంగా బాలికలపై లైంగిక వేధింపులు, లైంగిక దోపిడీ ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పోక్సో చట్టం కింద అనేక కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. జిల్లాలో దాదాపు 450 వరకు కేసులు నమోదైనట్లు పేర్కొంటూ, పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్–2 అలీముద్దీన్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో బాలలందరికీ వారి హక్కులపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వంటి దురాచారాలను నిర్మూలించేందుకు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి చిన్నారి విద్యను అభ్యసించేలా, భయభ్రాంతులు లేకుండా ఎదిగేలా సమాజం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సఖి కేంద్రం కేస్ వర్కర్ మాట్లాడుతూ.... మహిళలు, బాలికలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే 181 మహిళా హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. అవసరమైన సమయంలో ప్రభుత్వం అందించే సేవలను వినియోగించుకోవాలని కోరారు. బుగ్గపూర్ గ్రామ సర్పంచ్ మహేందర్ రావు మాట్లాడుతూ..... గ్రామాల్లో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, పిల్లలపై వేధింపులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 181 మహిళా హెల్ప్‌లైన్, లేదా 100 పోలీస్ అత్యవసర సేవలకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి గ్రామాన్ని బాలల హక్కులు పరిరక్షించబడే గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సదస్సులో సాధన సంస్థ కోఆర్డినేటర్ బి. నర్సింలు, శ్వేత, కార్యకర్తలు అస్సిమా, శివలక్ష్మి, రమేష్, పవన్, కన్యాకుమారి, మమత, యోజన సంఘాల సభ్యులు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు, యువజన సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పిల్లలపై జరిగే అన్యాయాలను అరికట్టేందుకు సమాజం అప్రమత్తంగా ఉండాలని వక్తలు పిలుపునిస్తూ కార్యక్రమం ముగిసింది.



## అభివృద్ధి ప్రణాళికలు రూపకల్పనలో గణాంక శాస్త్రం పాత్ర కీలకం



**మహబూబ్‌నగర్ రూరల్, జూన్ 29 (జనం సాక్షి) :** జాతీయ గణాంక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయం జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో సోమవారం జాతీయ గణాంక పితామహుడు ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణాంక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహలనోబిస్ చిత్రపటానికి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీ రవీందర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీ రవీందర్ మాట్లాడుతూ పరిపాలన డేటా సామర్థ్యాన్ని వెలికితీయడం అనే థీమ్ తీసుకుని ఈ సంవత్సరం జాతీయ గణాంక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతదేశంలో గణాంక శాస్త్ర అభివృద్ధికి ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశ ఆర్థిక ప్రణాళికల రూపకల్పన, నమూనా సర్వేలు, గణాంక వ్యవస్థ బలోపేతంలో ఆయన చేసిన కృషిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం జూన్ 29న జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఖచ్చితమైన గణాంకాల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల, విధాన నిర్ణయాల్లో గణాంక సమాచారం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ డా.పి.సి మహలనోబిస్ గణాంక శాస్త్రం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు.గణాంక అధికారుల పాత్ర అభివృద్ధి కార్యక్రమాలు అమలులో ఖచ్చితమైన డేటా తయారీ లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు గణాంక సిబ్బంది తమ విధులను నిబద్ధతతో నిర్వహించి ప్రభుత్వానికి నాణ్యమైన సమాచారాన్ని అందించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో గణాంక అధికారి శ్రీ నర్సింహులు,డిప్యూటీ గణాంక అధికారి రాజేష్ ,సహాయ గణాంక అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొని మహలనోబిస్ సేవలను స్మరించుకున్నారు.

## ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష

• జోనల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విస్తృత చర్చలు

**ఉప్పల్, జూన్ 29 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల వేగవంతమైన అమలు లక్ష్యంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్త గారిని మర్యాదపూర్వకంగా కలిసి విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ కాలనీల్లో నెలకొన్న పెండింగ్ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల సమస్యలు, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన అత్యవసర పారిశుద్ధ్య చర్యలు, డ్రైనేజీ వ్యవస్థల శుభ్రత, రోడ్ల మరమ్మత్తులు, వీధి దీపాల సమస్యలు వంటి అనేక అంశాలను ఎమ్మెల్యే జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే స్థానిక ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులపై కూడా సమగ్రంగా చర్చించారు. ప్రత్యేకంగా వర్షాకాలంలో కాలనీల్లో నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, దోమల నియంత్రణ కోసం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. అలాగే నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత కాలపరిమితిలో పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు సూచించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ రాధిక గుప్త గారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే సూచించిన అన్ని సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని, కాలనీల్లో పారిశుద్ధ్య పనులను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. మొత్తంగా ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల పురోగతి, పౌర సేవల మెరుగుదల లక్ష్యంగా జరిగిన ఈ సమావేశం ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి దిశానిర్దేశం చేసినట్లుగా నిలిచింది.



## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాపై అప్రమత్తత అవసరం



**వెల్దండ, జూన్ 29 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదై ఉండేలా చూసుకోవాలని చెర్కూర్ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు అన్నారు. సోమవారం చెర్కూర్ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సరిచేసుకోవడం, కొత్తగా అర్హత పొందిన వారు తమ పేర్లు నమోదు చేసుకోవడం, మరణించిన వారి పేర్లు తొలగించడం, వివరాల్లో మార్పులు చేసుకోవడం వంటి అంశాలపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.ప్రజలు అధికారులకు అవసరమైన వివరాలు అందించి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండలు,వార్డు మెంబర్ పురుగుల రమేష్, కుమారస్వామి,జిపిఓ ఆంజనేయులు, బుజ్జయ్య, జంగయ్య, కొండలు, రామకృష్ణ, సందీప్, జంగయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

• గోన్య నాయక్ తండా సర్పంచ్ శంకర్ నాయక్

దోమ, జూన్ 29 (జనం సాక్షి) : ఎస్ఐఆర్ ప్రక్రియను అధికారులు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గోన్య నాయక్ తండా సర్పంచ్ శంకర్ నాయక్ తెలిపారు. సోమవారం దోమ మండల పరిధిలోని గోన్య నాయక్ తండా లో బి ఎల్ వో తో కలిసి ఇంటింటికి ఎన్యూమరేషన్ దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలు అధికారులు చేపడుతున్న సవరణలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. గ్రామస్థాయిలో డెత్ డబుల్ ఓట్లు చాలా ఉన్నాయని, వాటిని గుర్తించి తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి,యువకులకు నూతన ఓటరును నమోదు చేయించేందుకు శ్రద్ధ చూపాలన్నారు. ఓటర్ నమోదు ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా చేపట్టి అందుబాటులో ఉంచాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చూపిన ఉన్నతాధికారుల ఫిర్యాదు చేసినందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. అదేవిధంగా అవగాహన లేని ప్రజలకు దరఖాస్తు ఫారాలను అధికారులు నింపి వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తండా సర్పంచ్ శంకర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి, మోత్కూర్ గ్రామపంచాయతీ వీఆర్వో జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



## హత్య కేసును ఛేదించిన పోలీసులు నిందితుడు అరెస్ట్

• అభినందించిన జిల్లా ఎస్పీ సంగ్రామ్ జి పాటిల్



**ఉర్కొండ, జూన్ 29 (జనం సాక్షి) :** ఉర్కొండ మండలంలోని రేవెల్లి గ్రామంలో జరిగిన హత్య కేసును 48 గంటల్లో ఛేదించిన పోలీసులను నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ సంగ్రామ్ జి పాటిల్ అభినందించారు. వివరాల్లోకి వెళితే నాగర్‌కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలం రేవల్లి గ్రామ శివారులో 26.06.2026 సాయంత్రం జరిగిన కర్రెల్ల యాదయ్య (50) హత్య కేసును పోలీసులు 48 గంటల్లో ఛేదించి హత్య చేసిన అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే నిందితుడు అరెస్ట్ చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు శాస్త్రీయ ఆధారాలు సేకరించడం, సాక్షులను విచారించడం, సాంకేతిక ఆధారాలను విశ్లేషించడం ద్వారా నిందితుడిని 29.06.2026న అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, నిందితుడు గత కొంతకాలంగా అనారోగ్యం, కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడు. జాతకం చెప్పే వ్యక్తుల మాటలు, గ్రామంలో ఉన్న మూఢనమ్మకాల ప్రభావంతో మృతుడు తనపై చేతబడి చేశాడని, తన కష్టాలకు కారణమని నమ్మి అతనిపై కక్ష పెంచుకున్నాడు. అదే కక్షతో 26.06.2026న రేవల్లి గ్రామ శివారులో మృతుడిని అడ్డగించి కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేసి పరారయ్యాడు. నిందితుడి ఒప్పుకోలు మేరకు హత్యకు ఉపయోగించిన కత్తి, ఘటనలో ఉపయోగించిన మోటార్ సైకిల్, ఘటన సమయంలో ధరించిన దుస్తులు మరియు మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. ఇట్టి కేసులో 48 గంటల లోపులో నేరస్థుని పట్టుకొని రీమాండ్ కి తరలించిన కల్వకుర్తి సీఐ భీమ కుమార్ ని ఇందుకు సహకరించిన ఉర్కొండ ఎస్సై రమాదేవిని, సిబ్బంది.చిరంజీవి,నజీరుద్దిన్ , .జి. లింగం గౌడ్ , జి . శ్రవణ్,హర్ష , .కృష్ణను నాగర్కర్నూల్ ఎస్పీ, కల్వకుర్తి డీఎస్పీ వెంకట్ రెడ్డి అభినందించారు.

## స్వయం ఉపాధి నిర్ణయం అభినందనీయం

• జాకీ ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ స్టోర్ ప్రారంభం
• ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు, జూన్ 29 (జనంసాక్షి) :** స్వయం ఉపాధి నిర్ణయం అభినందనీయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జాకీ ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ స్టోర్‌ను సోమవారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి యాజమాన్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తాండూరు ప్రజలకు నాణ్యమైన బ్రాండెడ్ దుస్తులు అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఇలాంటి వ్యాపార సంస్థలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. అనంతరం స్టోర్ యాజమాన్యానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జాకీ సంస్థ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

• అధికారులకు సిఎంసి కమిషనర్ ఆదేశం

**శేరిలింగంపల్లి, జూన్ 29 (జనంసాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారంకోసం ప్రజలు అందజేస్తున్న ఫిర్యాదులను ఎలాంటి అలసత్వం ఉండకూడదని, ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి సత్వరమే కృషి చేయాలని సిఎంసి కార్యాలయ అధికారులను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి సృజన ఆదేశించారు. ఈ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో కమిషనర్ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధి వివిధ ప్రాంతాల నుండి ఫిర్యాదుదారులు, అర్జిదారులు కార్యాలయానికి విచ్చేసి తమ సమస్యలు, వినతులను ఆయా అధికారులకు వివరించడం జరిగింది. ఇందులో భాగంగా సిఎంసి కమిషనర్ వివిధ అవసరాల నిమిత్తం అందిన ఫిర్యాదులపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజావాణి కార్యక్రమం ఒక యజ్ఞంలా కొనసాగుతుందని, జిహెచ్ఎంసి పరిధిలోపల ప్రతి సర్కిల్ కార్యాలయం, జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత లభిస్తుందన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆయా సర్కిళ్లలో ఉదయం పది గంటలనుండి సాయంత్రంవరకు కీలక అధికారులు అంతా సమయాన్ని కేటాయిస్తూ అర్జీదారుల నుండి ఫిర్యాదులు అందుకోవడం జరుగుతుందని సిఎంసి కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 43 వినతులు అందాయని, ప్రతి అర్జీని ప్రత్యక్షంగా పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో వాటిపై తక్షణ చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా ఆమె అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. సోమవారం అందిన ఫిర్యాదులలో భాగంగా పట్టణ ప్రణాళిక అవిభాగం నుండి అత్యధికంగా 31, ఇంజనీరింగ్ విభాగం నుండి 11, స్పోర్ట్స్ విభాగం నుండి 01చొప్పున అర్జీలు అందాయని సిఎంసి అధికారులు తెలియజేశారు. ఈ క్రమంలో మాట్లాడుతూ ఫిర్యాదులు తీసుకోవడానికి మాత్రమే అధికారులు పరిమితం కాకూడదని, క్షేత్రస్థాయిలో సమగ్రత నిర్వహించి వాటి పరిష్కారం లభించే అంతవరకు అధికారులు వారి గురుతర బాధ్యతను విస్మరించకూడదని ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేసిన అర్జీదారులు వాటి పరిష్కారం కోసం మళ్లీ కార్యాలయం మెట్లు ఎక్కకుండా పారదర్శకమైన యంత్రాంగాన్ని దీని కోసం కేటాయించి ప్రజల మన్ననలు పొందే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని సిఎంసి కమిషనర్ పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక గ్రీవెన్స్ ఐడి మరియు ట్రాకింగ్ లింక్ తో నమోదు చేయడం ద్వారా పౌరులు తమ ఫిర్యాదు పురోగతిని పారదర్శకంగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
30 జూన్ 2026

# 48 గంటల్లో రేవల్లి హత్య కేసు చేదించిన పోలీసులు..

- నిందితుడు అరెస్ట్
- మూఢనమ్మకాలే హత్యకు కారణం
- హత్యకు ఉపయోగించిన కత్తి, బైక్, మొబైల్ స్వాధీనం



**కల్వకుర్తి, జూన్ 29 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలం రేవల్లి గ్రామంలో సంచలనం సృష్టించిన కర్రెల్ల యాదయ్య హత్య కేసును కల్వకుర్తి పోలీసులు కేవలం 48 గంటల్లో ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు.ఈ మేరకు పోలీసులు సోమవారం ప్రెస్‌నోట్ విడుదల చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రేవల్లి గ్రామానికి చెందిన కర్రెల్ల యాదయ్య (50) అనే వ్యక్తి జూన్ 26న గ్రామ శివారులో దారుణ హత్యకు గురయ్యాడు.ఈ ఘటనపై ఉర్కొండ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 87/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా పోలీసులు శాస్త్రీయ ఆధారాలు సేకరించడంతో పాటు సాక్షులను విచారించారు. సాంకేతిక ఆధారాలను విశ్లేషించి అనుమానితుడైన పోలే ఆంజనేయులు (28),రేవల్లి గ్రామానికి చెందిన వ్యవసాయదారుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం,నిందితుడు కొంతకాలంగా అనారోగ్యం, కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడు. గ్రామంలో ఉన్న మూఢనమ్మకాలు, జాతకాలు చెప్పే వ్యక్తుల ప్రభావంతో మృతుడు తనపై చేతబడి చేశాడని, తన కష్టాలకు కారణమని నమ్మాడు.ఈ అనుమానంతో యాదయ్యపై కక్ష పెంచుకున్న ఆంజనేయులు, జూన్ 26న రేవల్లి గ్రామ శివారులో అతడిని అడ్డగించి కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి ఒప్పుకోలు మేరకు హత్యకు ఉపయోగించిన కత్తి,ఘటన సమయంలో వినియోగించిన మోటార్ సైకిల్, ధరించిన దుస్తులు, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు ప్రేమ్ కుమార్ ఎస్సై రమాదేవి పేర్కొన్నారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితుడిని రిమాండ్‌కు తరలించడంలో కల్వకుర్తి సీఐ భీమ్ కుమార్,ఉర్కొండ ఎస్ఐ ఎన్. రమాదేవి, పోలీసు సిబ్బంది కీలక పాత్ర పోషించారు. వారి పనితీరును జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ఐపీఎస్,డీఎస్పీ ఎస్. వెంకట్ రెడ్డి అభినందించినట్లుపేర్కొన్నారు.

## ప్రీ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల శాతం పెరగాలి



**చిన్నశంకరంపేట, జూన్ 29 (జనం సాక్షి) :** ప్రీ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుతో అంగన్వాడి కేంద్రాలకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని సర్పంచ్ ధనావత్ మంజుల సౌమ్య నాయక్అధికారులకు సూచించారు. సోమవారం చిన్న శంకంపేట మండలం పరిధిలోని జంగారై తాండ గ్రామంలో ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలలో చదువుతున్న చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలలకు తీసుకురావద్దని సూచించారు. అలా తీసుకువస్తే అంగన్వాడి కేంద్రాలు నిర్వీర్యం అవుతాయని అభిప్రాయపడ్డారు. కాంప్లెక్స్ హెచ్ఎం మనీష్ రెడ్డి మాట్లాడుతూ,ప్రీ ప్రైమరీ పాఠశాలలు విజయవంతంగా కొనసాగాలంటే విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారికి బోధన చేస్తూ వారి ఆలనా పాలన చూసుకోవాలన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు నాలుగు సంవత్సరాలు నిండిన చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలలకు పంపించాలని కోరారు. అనంతరం ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఉప సర్పంచ్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సౌజన్య, గ్రామ పంచాయతీ సెక్రెటరీ వార్డు సభ్యులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పర్యవేక్షించిన కలెక్టర్ ప్రతిమ సింగ్



**మెదక్, జూన్ 29 (జనం సాక్షి) :** ఓటరు జాబితాల ఖచ్చితత్వం కోసమే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని, ఓట్లు తొలగిస్తారనే అపోహలను ఎవరూ నమ్మవద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ఈ నెల 25 నుంచి ప్రారంభమైన (సర్) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. అందులో భాగంగా మెదక్ జిల్లా కేంద్రంలోని మెదక్ మున్సిపాలిటీ లోని గాంధీనగర్ పిఎస్ నెంబర్ 135లో సర్ ను తాసిల్దార్, లక్ష్మణ్ బాబు డిప్యూటీ తాసిల్దార్‌తో కలిసి కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. అంతేకాకుండా ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా నింపాలో ఇంటి యజమానికి అర్థం అయ్యేలా వివరించాలన్నారు నింపిన ఫారాలను రెండు, మూడు రోజుల్లో తిరిగి బీ ఎల్ వో లకు అందజేయాలని తెలిపారు. రెండు రోజుల్లో గ్రామంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలని బీఎల్‌వోలను ఆమె ఆదేశించారు. ఫారాలు ఇచ్చేటప్పుడే ఓటర్ల అనుమానాలను బీఎల్ వోలు నివృత్తి చేయాలన్నారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలలో అన్ని వివరాలు రాసి తిరిగి ఇచ్చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తాసిల్దార్ లక్ష్మణ్ బాబు రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



**మక్తల్, జూన్ 29 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, కళాకారులు, జర్నలిస్టులకు హైదరాబాద్ ఉప్పల్ బగాయత్‌లో 250 చదరపు గజాల ఇళ్ల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేటాయించాలని తెలంగాణ జన సేన మక్తల్ నియోజకవర్గ ఇన్‌చార్జి డీకే సిహెచ్ వెంకటన్న డిమాండ్ చేశారు. అలాగే జూలై 2న ఉప్పల్ బగాయత్‌లో టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించనున్న భూ పోరాటం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మక్తల్ పట్టణంలోని ఆర్ఎంపీ గెస్ట్ హౌస్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు, రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలు, ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన కళాకారులు, జర్నలిస్టులకు ఉప్పల్ బగాయత్‌లో 250 చదరపు గజాల ఇళ్ల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కమిటీ పేరుతో కాలయాపన చేస్తూ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఉద్యమంతో సంబంధం లేని వ్యక్తులను కమిటీలో చేర్చడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 2న నిర్వహించనున్న భూ పోరాట కార్యక్రమానికి మక్తల్ నియోజకవర్గ ప్రజలు, తెలంగాణ ఉద్యమకారులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిహెచ్ వెంకటరమణ, డాక్టర్ యాంకి ఆచారి, బైగనపల్లి సంధ్యారాణి, సాకలి శ్రీనివాసులు, కురువ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూ తగాదాలను కోర్టుల ద్వారానే పరిష్కరించుకోవాలి

- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి



**వనపర్తి బ్యూరో, జూన్ 29 (జనంసాక్షి) :** వనపర్తి, జూన్ 29: భూ వివాదాలకు సంబంధించిన సమస్యలను సంబంధిత న్యాయస్థానాల ద్వారానే పరిష్కరించుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తితే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, సూచించారు. ప్రజలకు న్యాయం, భద్రత, విశ్వాసం కల్పించడమే జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు.సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 22 మంది ఫిర్యాదుదారుల నుంచి వినతులను ఎస్పీ సునిత రెడ్డి స్వీకరించారు. అందిన ప్రతి ఫిర్యాదును స్వయంగా పరిశీలించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు వెంటనే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూ వివాదాలకు సంబంధించిన ఎక్కువ శాతం ఫిర్యాదులు సివిల్ స్వభావం కలిగి ఉంటాయని, అలాంటి వివాదాలను కోర్టుల ద్వారానే పరిష్కరించుకోవడం శాశ్వతమైన, చట్టబద్ధమైన మార్గమని పేర్కొన్నారు. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా వ్యవహరించాలని, వివాదాలు లేదా శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలు తలెత్తిన వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.కాగా, ఈరోజు ప్రజావాణిలో అందిన మొత్తం 22 ఫిర్యాదుల్లో 16 భూ తగాదాలకు సంబంధించినవి, ఒకటి భార్యాభర్తల వివాదం, ఐదు పరస్పర గొడవలకు సంబంధించినవిగా అధికారులు వెల్లడించారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి



**మెదక్ బ్యూరో చీఫ్, జూన్ 29 (జనం సాక్షి) :** ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మెదక్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ , అదనపు కలెక్టర్ నగేష్ లు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి లో 83 దరఖాస్తులను స్వీకరించారు. అందులో భూ భారతి 33, ఇందిరమ్మ ఇండ్లు 14, పెన్షన్లు 4, సాధారణ 32, మొత్తం 83 దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తక్షణమే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలన్నారు.

## రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం



**జడ్చర్ల, జూన్ 29 (జనంసాక్షి) :** సహకార వ్యవస్థ ద్వారా రైతులకు, సంఘ సభ్యులకు పారదర్శకమైన, మెరుగైన సేవలను అందించడమే తమ ప్రాథమిక లక్ష్యమని బాధేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ అన్నారు. సోమవారం సంఘం కార్యాలయంపై ఆయన సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలెం సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి పాలకమండలి, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు జీవన్ గుండప్ప, మంగమ్మ, పి. లక్ష్మమ్మ, హాతీరామ్ నాయక్, నర్సింహ్మారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ మాలిక్ షాకీర్, మాజీ ఎంపీపీ నిత్యానందం, ఇతర ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాస రావు



**వనపర్తి బ్యూరో, జూన్ 29 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా నూతన జిల్లా న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన బాకరాజు శ్రీనివాసరావును జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు సునీతా రెడ్డి సోమవారం కోర్టు కార్యాలయంలోని ఆయన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై చర్చించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులకు సంబంధించిన పోక్సో కేసుల విచారణను వేగవంతం చేసి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు న్యాయవ్యవస్థ, పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం సమిష్టిగా పనిచేసి ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తులు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పౌర సంబంధాల శాఖ సేవలు ప్రశంసనీయం

- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



**మెదక్, జూన్ 29 (జనం సాక్షి) :** ప్రజావాణి సందర్భంగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక వివిధ శాఖల సంక్షేమ వారోత్సవాల కార్యక్రమాల విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చాయ చిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ , అదరపు కలెక్టర్ నగేష్ ఇతర జిల్లా అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక విజయవంతంగా జిల్లాలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అత్యంత చెరువు చేయాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మెదక్ జిల్లాలో అధికారులు ప్రజలు భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలను ఛాయాచిత్రాల రూపంలో ప్రజలు వీక్షించేందుకు ఈ చిత్ర ప్రదర్శన ప్రతి సోమవారం ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్




**ఉప్పునుంతల, జూన్ 29 (జనం సాక్షి) :** మండలంలోని సీబీ తండా గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఉప్పునుంతల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నాగరాజు మాట్లాడుతూ, సుమారు 50 సంవత్సరాలుగా పోడు భూములను సాగు చేస్తున్న గిరిజనులకు ఇప్పటికీ పట్టాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పోడు భూములకు హక్కు పట్టాలు మంజూరు చేసి గిరిజన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీబీ తండా సర్పంచ్ లక్ష్మణ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చంద్రయ్య, శంకరయ్య, లక్ష్మయ్య, గిరిజన సంఘం మండల నాయకుడు వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సొంతింటి కల సాకారం



**జడ్చర్ల, జూన్ 29 (జనంసాక్షి) :** ఇందిరమ్మ పథకం ద్వారా పేదలకు సొంతింటి కల సాకారం కావడం అభినందనీయమని జడ్చర్ల మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ చైతన్య చౌహాన్ పేర్కొన్నారు. జడ్చర్ల 9వ వార్డు, జయప్రకాష్ నగర్‌లో సునీత రాము దంపతులు ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మించుకున్న నూతన గృహ ప్రవేశ వేడుక సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైతన్య చౌహాన్, స్థానిక నాయకులు బెన్ని, శేఖర్, క్రాంతితో కలిసి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇందిరమ్మ పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారం కావడం అభినందనీయమని, పేదలకు మెరుగైన వసతులు కల్పించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి



**కొత్తపల్లి, జూన్ 29 (జనం సాక్షి) :** అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏఐయుకేఎస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి ఎమ్మార్వో కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, కొండ నర్సింలు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల కొరత, యూరియా, డి ఏ పి, కాంప్లెక్స్ ఎరువులు సమయానికి దొరకడం లేదు. బ్లాక్‌లో అమ్ముతున్నారు. కొనుగోలు కేంద్రాల సమస్య ధాన్యం కొనేటప్పుడు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైతు భరోసా పంట పెట్టుబడి డబ్బులు సీజన్ మొదలయ్యేలోపు ఇవ్వడం లేదు. బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. సరైన మోతాదులో వర్షాలు పడకపోవడంతో పంటలు నష్టపోతున్నాయి. ప్రభుత్వం చెప్పిన కొన్ని రకాల వరి మాత్రమే కొంటున్నారు. రైతులు పండించిన అన్ని రకాల ధాన్యం కొనాలి. కేంద్రం చెప్పిన మేరకే కొంటామంటూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోంది. క్వింటాలు కు 10 కిలోల వరకు తడి పేరుతో కోత విధిస్తున్నారు. ఇది తప్పు. మొక్కజొన్న, బోనస్ డబ్బులు ఇంకా చెల్లించలేదు. ఎం ఎస్ పి ధర ప్రకారం అన్ని పంటలను కొనాలి, బోనస్ ఇవ్వాలి. ప్రభుత్వానికి సూచించిన పరిష్కారాలు యూరియా యాప్ ద్వారా బుక్ చేసే విధానం రద్దు చేసి, రైతుకు అవసరమైన మేరకు ఇవ్వాలి ఎరువుల ధరలు కంట్రోల్ చేసి తక్కువ ధరకే ఇవ్వాలి. రైతు భరోసా సీజన్ మొదలయ్యేలోపే ఇవ్వాలి గత బకాయిలు క్లియర్ చేయాలి రైతులు పండించిన అన్ని రకాల వరి ధాన్యం కొనాలి. తరుగు పేరుతో కోతలు ఆపేయాలి. కిలో కంటే ఎక్కువ కోయొద్దు ఎం ఎస్ పి బోనస్ ఇచ్చి పంట మార్పిడిని ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి అధునాతన రెస్క్యూ పరికరాలు అందజేత



**హనుమకొండ ప్రతినిధి జూన్ 28 (జనం సాక్షి) :** 4వ బెటాలియన్ లో హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ,ఐఏఎస్ ఎస్డీఆర్ఎఫ్ బృందంకి ప్రకృతి విపత్తులు సంభవించినపుడు త్వరితగతిన ఆ ప్రదేశానికి చేరుకుని బాధితులకు సహాయం చేయడానికై జిల్లా ఎస్డీఎమ్ఏ నిధులతో కొనుగోలు చేసిన అధునాతన రెస్క్యూ పరికరాలను అందించారు. ముందుగా 4వ బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్,ఐఏఎస్ కి పూలగూచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. తర్వాత కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్,ఐఏఎస్ గౌరవ వందనం స్వీకరించారు. దీనిలో భాగంగా కలెక్టర్ 4వ బెటాలియన్ ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది ఉపయోగించే అధునాతన రెస్క్యూ పరికరాలను వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. 2025 ముంతా తుఫాన్ సమయంలో హన్మకొండలో 4వ బెటాలియన్ ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది చేసిన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ కమాండెంట్స్ ఈ.వీరన్న, జె.రాజేందర్, ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఐ రవి, ఆర్ఐలు కార్తీక్, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్,ఎస్డీఆర్ఎఫ్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# విపత్తు నిర్వహణలో ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలి

- వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు పకడ్బందీగా చేపట్టాలి
- వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు




**ములుగు ప్రతినిధి, జూన్ 29(జనంసాక్షి) :** వర్షాకాలంలో సంభవించే భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, విపత్తు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తుగా పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తో కలిసి జిల్లా స్థాయి అధికారులతో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, విపత్తు నిర్వహణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాలలోని కుటుంబాలను ముందుగానే గుర్తించి వారికి మూడు నెలలకు సరిపడే రేషన్ బియ్యాన్ని జూలై నెలలోనే అందుబాటులో ఉంచాలని, గ్రామాల పరిధిలో ముంపునకు గురయ్యే గృహాలను పంచాయతీ కార్యదర్శులు ముందుగానే గుర్తించి జాబితా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, ముందస్తుగా గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని లోతైన లో లెవెల్ కల్వర్టులు, వాగులు, గోదావరి నది పరివాహక ప్రాంతాలు, ప్రమాదకర మార్గాలను ముందుగానే గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని, వర్షాలు కురిసే సమయంలో స్థానిక రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేస్తూ ప్రజలకు ప్రమాద హెచ్చరికలు జారీ చేయాలని తెలిపారు. ఆకస్మికంగా నీటి ప్రవాహాలు పెరిగే ప్రాంతాల్లో పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, స్థానిక సంస్థల సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ రవాణాకు అంతరాయం కలగకుండా, ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ముప్పు ఏర్పడే పరిస్థితుల్లో పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించి, అక్కడ తాగునీరు, ఆహారం, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, బ్లీచింగ్, సున్నం, యాంటీ లార్వా మందులు వంటి అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. డీడీఆర్ఎఫ్ బృందాలు మేడారం, ఏటూరునాగారం ప్రాంతాల్లో సిద్ధంగా ఉండాలని, పడవలు, లైఫ్ జాకెట్లు, నైలాన్ రోప్స్ , ఇతర సహాయక సామగ్రిని అవసరమైన మండల కేంద్రాలలో వికేంద్రీకరణ విధానంలో ముందుగానే అందుబాటులో ఉంచాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ వర్షాకాలంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, పరిస్థితులు ఎదురైన వెంటనే జిల్లా, మండల స్థాయి అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, సమాచార వ్యవస్థ బలోపేతం కోసం ప్రత్యేక కమ్యూనికేషన్ గ్రూపులు ఏర్పాటు చేయాలని, ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమంలో పారిశుద్ధ్య చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, జలపాతాలు ఉధృతంగా ప్రవహించే సమయంలో పర్యాటకులను అనుమతించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, డిఎస్పీ రవీందర్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాత క్రైమ్ పోలీస్ స్టేషన్‌తో ఇబ్బందులు

- తాగి పడేసిన మందు సీసాలు
- విషపురుగుల సంచారంతో భయాందోళనలు
- మున్సిపల్ కార్పొరేషన్ లో గృహవాసుల ఫిర్యాదు



**వరంగల్ ఈస్ట్, జూన్ 29 ( జనం సాక్షి) :** హన్మకొండ మచిలి బజార్ లో ఉన్నటు వంటి పాత క్రైమ్ పోలీస్ స్టేషన్ భవనం(ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది), పరిసరాలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక గృహవాసులు వెల్లడించారు.సోమవారం వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో జరిగిన ప్రజావాణి లో మచిలి బజార్ నివాస ప్రాంతాల వారు 70 సంవత్సారాల క్రితం ఏర్పాటు చేసిన ప్రత్యేక నేర విభాగానికి సంబంధించిన పోలీస్ స్టేషన్ పరిసరాల పై పిర్యాదు చేశారు.వారు ప్రజావాణి లో సమర్పించిన వివరాల ప్రకారం 70 సంవత్సారాల క్రితం ఏర్పాటు చేసిన పోలీసు స్టేషన్ నేడు చెట్లపోదలతో నిండిపోయి మందుబాబులు తాగి పడేసిన సీసాలకు, విషపురుగులకు స్థావరంగా మారిందని స్థానికులు విలేకరుల తో వాపోయారు.గత 20 సంవత్సరాలకు పైగా కూలిపోయిన గోడలు, శిథిలావస్థకు చేరుకున్న భవనం దర్శనం ఇస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు.అలాగే కొంతమంది ఆ స్థలాన్ని కబ్జా కూడా చేశారని పేర్కొన్నారు.ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకుని తమ నివాస ప్రాంత ప్రజలను రోగాల బారినుండి,విష పురుగుల నుండి,అసాంఘిక కార్యకలాపాల నిలయంగా మారిన ప్రత్యేక నేర విభాగానికి చెందిన పోలీస్ స్టేషన్ ప్రాంతం నుండి స్థానికులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజావాణి లో వేడుకున్నట్లు ఫిర్యాదుదారులు తెలిపారు.పిర్యాదు చేసిన వారిలో తుల నిర్మాల తోపాటు స్థానికులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**పాలకుర్తి, జూన్ 29(జనంసాక్షి) :** పాలకుర్తి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ,యు వకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో పని చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నిరుద్యోగ యువతకు నియామక పత్రాలను అందచేసే కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హాజరై మాట్లాడారు. హనుమాండ్ల ఝాన్సీరెడ్డి రాజేందర్రెడ్డి కుటుంబ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గత రెండు నెలల క్రితం జాబ్ మేళ నిర్వహించినట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు 38 వివిధ రకాల కంపెనీలు రాగా, రెండు వేల మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరైనట్లు తెలిపారు. ఉద్యోగం సాధించిన వారికి నియామక పత్రాలను అందచేసినట్లు ఆమె తెలిపారు. ఈ నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పన కోసం కృషి చేస్తామన్నారు. కష్టపడి చదివితే ఏ రంగంలోనైనా రాణిస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, నాయకులు రాపాక సత్యనారాయణ, కుమారస్వామి, వీరమనేని యాకాంతరావు, మదార్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# దౌలత్‌నగర్‌లో భూ కబ్జా ఆరోపణలు..

- రైతుకు ప్రాణహాని బెదిరింపులు?



**పర్వతగిరి, జూన్ 29 (జనం సాక్షి) :** పర్వతగిరి మండలం దౌలత్‌నగర్ గ్రామానికి చెందిన రైతు చీమల అయిలయ్య తనకు వారసత్వంగా వచ్చిన 3 ఎకరాల వ్యవసాయ భూమిని అక్రమంగా ఇతరుల పేరుపై పట్టా చేసి విక్రయించారని ఆరోపించారు. ఈ మేరకు ఆయన వరంగల్ జిల్లా ప్రజావాణి గ్రీవెన్స్ లో, పర్వతగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రైతు అయిలయ్య తెలిపిన వివరాల ప్రకారం, దౌలత్‌నగర్ గ్రామ పరిధిలోని సర్వే నెం.419లో ఉన్న 3 ఎకరాల భూమిని గత 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ వస్తున్నానని పేర్కొన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన చీమల బిక్షపతి తన కుటుంబ సభ్యుల పేర్లను ఉపయోగించి రెవెన్యూ అధికారుల సహకారంతో అక్రమంగా భూమిని ఇతరుల పేరుపై పట్టా చేయించి విక్రయించారని ఆరోపించారు. ఈ విషయమై ప్రశ్నించగా తనను దూషించడంతో పాటు భూమి విషయం గురించి మరలా అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని అయిలయ్య వాపోయారు. దీంతో తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భూ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని, అక్రమంగా జరిగిన పట్టా మార్పిడి, విక్రయాలపై చర్యలు తీసుకోవాలని అయిలయ్య అధికారులను కోరారు. కాగా, ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ తెలియాల్సి ఉంది. అధికారులు విచారణ చేపట్టిన అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# హత్య కేసును ఛేదించిన నిర్మల్ టౌన్ పోలీసులు



**నిర్మల్, జూన్ 29 (జనంసాక్షి):** నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. భైంసాకు చెందిన షేక్ సోహెబ్ (19)ను అప్పు, చేతి గడియారం విషయంలో ఏర్పడిన విభేదాల నేపథ్యంలో అనగందుల సాగర్, గుండెన విజయ్ కర్ర, బీరు సీసాతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం మృతదేహాన్ని బావిలో పడవేసినట్లు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను అరెస్ట్ చేసి, నేరానికి ఉపయోగించిన కర్ర, బీరు సీసా, మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన డీఎస్పీ శ్రీనివాస్, సీఐ సమ్మయ్యతో పాటు దర్యాప్తు బృందాన్ని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల అభినందించారు. వ్యక్తిగత విభేదాలతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

# రెండోరోజు చిరుత సంచారం

- బెంబేలెత్తిపోతున్న ఖానాపురం మండల వాసులు



**ఖానాపురం, జూన్ 29 (జనం సాక్షి):** ఖానాపురం గ్రామ శివారు పోలీస్ స్టేషన్ వెనుకాల పామాయిల్ తోటలో చిరుత పులి రెండో రోజు సంచరిస్తుందన్న సమాచారం స్థానిక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ దాసరి రమేష్ కు గ్రామ ప్రజలు తెలియజేయగా వెంటనే స్పందించి అటవీశాఖ రెవెన్యూ పోలీస్ శాఖ అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి పులి సంచరించిన ప్రదేశాన్ని అడవులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని చిరుత పులి దాడి చేసే అవకాశం ఉంటుందని సర్పంచ్ దాసరి రమేష్ ప్రజలకు హెచ్చరించారు. పోలీస్ శాఖ అటవీశాఖ అధికారులు గ్రామ పరిసర ప్రాంతాల్లో మరింత గస్తీ పెంచి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. రెండో రజు పులి సంచారం చేయడంతో ఖానాపురం రాగంపేట్ కొత్తూరు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రిపూట బయటికి రాకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని అటవీశాఖ అధికారులు స్థానిక పోలీసులు ప్రజలను కోరారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తాం


- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు వెల్లడి



**వరంగల్ ఈస్ట్, జూన్ 29 ( జనం సాక్షి) :** వరంగల్ తూర్పు లో పనిచేసే అర్హులైన జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇస్తానని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్రావు అన్నారు... సోమవారం హనుమకొండలోని ఆయన నివాసంలో కొండా మురళీధర్ రావును జర్నలిస్ట్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు., ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ను అర్హులైన జర్నలిస్టులందరికీ ఇవ్వాలని కొండా మురళీధర్ రావును జర్నలిస్ట్ ప్రతినిధులు కోరారు కాగా దానికి స్పందించిన ఆయన అర్హులైన వారందరికీ ఇస్తానని ప్రకటించారు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని, సీనియార్టీ బేస్ మీద ఇస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా జర్నలిస్టులు పారదర్శకంగా పనిచేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు జర్నలిస్టులు తమ వంతు ప్రయత్నం చేయాలని కోరారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం లో జర్నలిస్టుల సంఖ్య చాలా కనబడుతుంది కానీ ఆ మేరకు వార్తా కథనాలు కనబడడం లేదని ఆయన అన్నారు. ఇక నుంచైనా ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేలా జర్నలిస్టులు కృషి చేయాలని కోరారు. త్వరలోనే అర్హులైన జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అప్పగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ ప్రతినిధులు కోరుకొప్పుల నరేందర్, జక్కు విజయ్, కందుల శ్రీధర్, జన్ను స్వామి, విజయన్, హరీష్, బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రోగ్రాం విజయవంతం చేయాలి

- బిఎల్ఎ లకు దిశా నిర్దేశం
- పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి




**రామకృష్ణాపూర్, జూన్ 29(జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలో సర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ లకు రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. స్థానిక బీమా గార్డెన్ లో సోమవారం ఏర్పాటుచేసిన బిఎల్ఎ-2 సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న పార్టీ కార్యకర్తలకు సర్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పార్టీ పరంగా ఓటరు వివరాలు కోల్పోకుండా వ్యవహరించాలని సూచించారు. ఇంటింటికి సర్వే చేస్తూ ప్రతి ఓటర్ వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని ఆదేశించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. చెన్నూరు నియోజకవర్గం లో అభివృద్ధి పనులు అత్యంత వేగంగా నడుస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో, డిఎంఎఫ్టి నిధులు నియోజకవర్గ అభివృద్ధికి కేటాయిస్తామ న్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో గెలిచిన పార్టీ కౌన్సిలర్ల వార్డులకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తానని గెలిచిన కౌన్సిలర్లకు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షులు రఘునాథరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చందనగిరి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గోపతి బానేష్, పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్, కౌన్సిలర్లు కూతురు ప్రభాకర్, బీమా మల్లేష్, గుర్రం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపతి రాజం, అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు



## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్

**వరంగల్ మండలం, జూన్ 29 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవాలయాన్ని అమ్మవారిని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా వల్లభ గణపతి దేవాలయంలో వినాయకుని దర్శించుకున్న అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నితిన్ నబీన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు నితిన్ నబీన్ కు ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు తో పాటు బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో కనిపించని వాతావరణ సూచిక



భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ వాతావరణ సూచిక కొన్ని రోజులుగా పనిచేయడం లేదు. కలెక్టర్ కార్యాలయం ప్రధాన భవనం మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ సూచిక ద్వారా ఉష్ణోగ్రత, తేమ, గాలి వేగం వంటి వివరాలను ప్రజలు, అధికారులు తెలుసుకునేవారు. ప్రస్తుతం స్క్రీన్ నల్లగా ఉండటంతో ఎలాంటి సమాచారం అందుబాటులో లేదు. రైతులు, ప్రజలు వాతావరణ సమాచారం కోసం ఈ బోర్డుపై ఆధారపడతారు. అధికారులు వెంటనే సాంకేతిక సిబ్బందితో మరమ్మతులు చేయించి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, జనంసాక్షి..

# ప్రభుత్వ కార్యక్రమాల్లో మహిళా సంఘాలు భాగస్వాములు కావాలి

- కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 29(జనంసాక్షి):** ప్రతిష్టాత్మకంగా చేపట్టే వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో మహిళా సంఘాల సభ్యులు చురుగ్గా పాల్గొని, భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడంలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషించాలన్నారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల యూనిఫారాలు,ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల (యూనిఫాం) కుట్టుడు పనులను మహిళా సంఘాలు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న 10 రోజుల్లో ఈ ప్రక్రియను ఒక మిషన్ మోడ్‌లో పూర్తి చేసి విద్యార్థులకు అందించాలన్నారు. గ్రామాల్లోని మహిళలకు ఉపాధి కల్పించేలా ఈ చర్యలు ఉండాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం, పాఠశాలల పర్యవేక్షణ,గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతి ఇల్లూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, ప్లాస్టిక్ నివారణపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 15 నుండి పాఠశాలలు ప్రారంభమైనందున అక్కడ ప్రత్యేక మౌలిక సౌకర్యాలు కల్పించాలని, మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా నిర్వహించబడేలా పర్యవేక్షించాలన్నారు. ఆరోగ్యం, పోషకాహారం, మహిళలు, బాలికల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఐరన్ టాబ్లెట్లు,న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయాలని తెలిపారు. రక్త పరీక్షల ద్వారా రక్తహీనత తీవ్రతను గుర్తించి తగిన పోషకాహారం అందేలా చూడాలన్నారు. హెచ్ పి వి వ్యాక్సినేషన్ అవగాహన, 14 నుండి 15 సంవత్సరాల లోపు వయసున్న బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఇచ్చే హెచ్.పి.వి వ్యాక్సిన్ అందించేలా తల్లులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మరిన్ని ఉపాధి అవకాశాలు, ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, ప్రతినిధులు, డీపీఎంలు ,డీఆర్డీఏ అధికారులు మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మూతపడిన గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం



**సైదాపూర్, జూన్ 29 (జనం సాక్షి) :** గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థుల లేక మూతపడిన గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులు మరియు ఉపాధ్యాయుల సమిష్టి కృషితో తిరిగి పునఃప్రారంభం కావడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి శ్రీ ఎన్. ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రోజున గర్రెపల్లి గ్రామంలో నిర్వహించిన పాఠశాల పునఃప్రారంభ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి ముఖ్య అతిథిగా హాజరై పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు సమాజానికి వెన్నెముక వంటివని, వాటి అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థుల నమోదు లేక మూతపడిన పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు గ్రామ సర్పంచ్, పాలకమండలి సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు, మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ను, పాలకమండలి సభ్యులను మండల విద్యాధికారి శ్రీ కట్టా రవీంద్ర చారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి మిల్కూరి శ్రీనివాస్, మండల విద్యాధికారి శ్రీ కట్టా రవీంద్ర చారి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జై గోపాల్ సింగ్, దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ మాచమల్ల శ్రీకాంత్, ఉపసర్పంచ్ కొడగాని వీరేశం, గ్రామ కార్యదర్శి రాజీవ్, వార్డు సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు,సీఆర్పీలు రమేష్, చక్రపాణి, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు

**భద్రాచలం, జూన్ 29 (జనంసాక్షి) :** సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ తెల్ల వెంకటరావు అన్నారు. సోమవారం పట్టణంలోని రాఘవ నిలయం (రెడ్డి సత్రం) నందు జరిగిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యుజె – ఐజెయూ) భద్రాచలం డివిజన్ మహాసభ ఆ యూనియన్ జాతీయ కౌన్సిల్ మెంబర్ బి. వి. రమణారెడ్డి, జిల్లా అధ్యక్షులు జాగు వెంకటరత్నం, కార్యదర్శి జునుమాల రమేష్ ల సమక్షంలో విజ్జిగిరి రాజా కిరణ్ సభాధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిజం రంగంలో పనిచేస్తున్న విలేకరుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమ కార్యక్రమాల అమలుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

### ఘనంగా టియుడబ్ల్యుజె (ఐజెయూ) భద్రాచలం డివిజన్ మహాసభ

ఘనంగా టియుడబ్ల్యుజే (ఐజేయు) యూనియన్ భద్రాచలం డివిజన్ మహాసభ జరిగింది. అధ్యక్షుడిగా భూక్య రంజిత్ నాయక్, ఉపాధ్యక్షులుగా బండారి మహేష్ యాదవ్, కాటా సత్యం, పందేలపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పరుచూరి రవీంద్రబాబు, సహాయ కార్యదర్శులుగా షేక్ ఖాసిం, పసుపులేటి బాబు, కోశాధికారిగా బొల్లె రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా విజయ్, బోళ్ళ వినోద్, సతీష్, వాకచర్ల శ్రీనివాసరావు, అనిల్, వెంకట్, గోసుల వెంకటేశ్వరరావులు ఎంపికయ్యారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులుగా శ్రీహరి, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, పాకాల శివగౌడ్, కార్యదర్శిగా జయరాం, సహాయ కార్యదర్శిలుగా కాసబోయిన మోహన్ రావు, జెట్టి రామకృష్ణ, కోశాధికారిగా బాల కిరణ్, ఆర్గనైజింగ్



సెక్రటరీగా అన్వేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రామ లక్ష్మణ్, జగన్ లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు, పలువురు ప్రముఖులు, భద్రాచలం డివిజన్ లోని మీడియా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. డివిజన్ లో యూనియన్ పటిష్టతకు శక్తివంచన లేకుండా కార్యవర్గం కృషి చేయాలని సూచించారు.

## ఏడాది తర్వాత పోగొట్టుకున్న ఒప్పో సెల్‌ఫోన్లు రికవరీ

- సీఈఐఆర్ టెక్నాలజీతో ట్రేస్ చేసిన కరీంనగర్ రూరల్ పోలీసులు
- యజమానులకు ఫోన్ల అప్పగింత



**కరీంనగర్ రూరల్, జూన్ 29 (జనం సాక్షి) :** గత ఏడాది పోగొట్టుకున్న రెండు ఒప్పో సెల్‌ఫోన్లను కరీంనగర్ రూరల్ పోలీసులు అత్యాధునిక సీఈఐఆర్ సాంకేతికత సహాయంతో గుర్తించి, యజమానులకు తిరిగి అందజేశారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బుధవారంపేట గ్రామానికి చెందిన శ్రీశైలం గత సంవత్సరం కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలో తన ఒప్పో సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అలాగే రూరల్ మండలం ఇరుకుళ్ల గ్రామానికి చెందిన ఎగుర్ల స్వామి కూడా తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ వద్ద తన ఒప్పో సెల్‌ఫోన్ పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదులపై స్పందించిన పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్లను ట్రేస్ చేయగా, అవి మంచిర్యాల మరియు జగిత్యాల జిల్లాల్లో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ప్రత్యేక చర్యలు చేపట్టి రెండు ఫోన్లను స్వాధీనం చేసుకుని, వాటి అసలు యజమానులైన శ్రీశైలం, ఎగుర్ల స్వామిలకు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే, వాటిని గుర్తించి తిరిగి అప్పగించేందుకు పోలీసులు కృషి చేస్తారని తెలిపారు. సెల్‌ఫోన్లను విజయవంతంగా ట్రేస్ చేయడంలో కీలకపాత్ర పోషించిన టెక్ టీం కానిస్టేబుళ్లు చిట్యాల రాంసాయి, శైలజలను ఇన్‌స్పెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 29 (జనంసాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ వానాకాలం వన మహోత్సవముకు శాఖల వారీగా టార్గెట్స్ పూర్తి చేయాలని అన్నారు. ప్రతి శాఖల అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు ప్రత్యేక దృష్టితో శాఖల వారీగా అధికారులు పూర్తిచేయాలని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వాడకం పై అవగాహన కల్పించడంలో మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ బాగా కృషి చేశారని అన్నారు. ప్రతి కాలేజీ, స్కూళ్లలో డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు. రోడ్డు భద్రత గురించి సంక్షేమ హాస్టల్స్, కాలేజీ, పాఠశాలల్లో అవగాహన సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు రోడ్డు భద్రతపై సూచనలు చేయాలని తెలిపారు. ఎన్ హెచ్ 65, కుడకుడ రోడ్డులో అక్కడక్కడ రోడ్డు పాడైపోయి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నందువలన ఎన్ హెచ్ –65 అధికారులు, మున్సిపల్ ఇంజనీర్ సిబ్బంది సంబంధిత కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబంధించి 53 దరఖాస్తులు,డిడబ్ల్యుఓ 9, డిఈఓ 5, డీపీఓ 3, మిగిలిన 28 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవని మొత్తం 98 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, జడ్పీ సీఈఓ శిరీష, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, హౌసింగ్ శాఖ పిడి సిద్ధార్థ్, సిపిఓ కిషన్ నాయక్, డిఈఓ అశోక్ , సిపిఓ కిషన్ నాయక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా, డెంగ్యూ నివారణకు కృషి చేయాలి




**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 29 (జనం సాక్షి) :** సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరం లో వ్యాధుల నివారణ కమిటీ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియాసిస్ వంటి దోమల ద్వారా సంక్రమించే వాహక వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించాలని సూచించారు. వాహక వ్యాధుల నివారణకు సంబంధించి ప్రభుత్వం సూచించిన కార్యాచరణను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ లు విక్టర్, చీఎ గిరి, ఎఎష్ట్రశీ, తదితరులు ఉన్నారు.

## చట్ట విరుద్ధంగా బెల్టు షాపులకు నేరుగా మద్యం తరలింపు

- గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు




**ముస్తాబాద్, జూన్ 29 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండల కేంద్రంలో గల తాజ్ లాల్ వైన్స్ మరియు ఇతర వైన్సుల నుండి ఆటో ద్వారా ప్రతిరోజు మండలంలోని గ్రామాలకు ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో బెల్టు షాపులకు మద్యాన్ని ఆటో ద్వారా తరలిస్తూ ప్రభుత్వ నిర్ణయిత రేటు కంటే అధికంగా ప్రజల నుండి డబ్బులు దండుకుంటున్న బెల్టు షాపుల యజమానులు చూసి చూడనట్లు అధికారులు వ్యవహరించడంతో ఊరు రా విచ్చల విడిగా పెరిగిపోతున్న బెల్టు షాపులు ఎక్సైజ్ శాఖ అధికారుల లోపం గ్రామాల ప్రజలకు శాపంగా మారింది ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన తాజ్ లాల్ వైన్ షాప్ పై మరియు గ్రామాల్లో ఏర్పడిన బెల్ట్ షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు.

## గిరిజన సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



**భద్రాచలం, జూన్ 29 (జనంసాక్షి) :** గిరిజన దర్బార్లో వారి సమస్యల పరిష్కారం కోసం వస్తున్న ఆదివాసి గిరిజన కుటుంబాల సమస్యలు సత్వరమే పరిష్కరించడంతో పాటు అర్హులైన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలందే విధంగా సంబంధిత యూనిట్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని. భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో వివిధ సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుండి ఆయన యూనిట్ అధికారుల సమక్షంలో అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపుతూ వీలైనంత తొందరగా అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఆర్సిఓ గురుకులం అరుణకుమారి, డిడి ట్రైబల్ వెల్ఫేర్ చందన, ఎస్ డి సి ఆనంద్ కుమార్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఎడిఎంహెచ్వో సైదులు, ఏవో సున్నం రాంబాబు, ఏడి అగ్రికల్చర్ ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏపీఓ పవర్ వేణు, ఎస్ డి సి మణిధర్ పాల్గొన్నారు.

## ఎస్సీ స్టడీ సర్కిల్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**కరీంనగర్ బ్యూరో, జూన్ 29 (జనంసాక్షి) :** పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఎస్సీ స్టడీ సర్కిల్ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. యుపిఎస్సి (సివిల్స్) – 2027కి సన్నద్ధమయ్యే ఎస్సీ అభ్యర్థులకు టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ద్వారా శిక్షణ అందించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా అందించే శిక్షణ కరపత్రాలను కలెక్టర్ ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. తమ కుటుంబ వార్షికాదాయం రూ.మూడు లక్షలు ఉన్న ఎస్సీ అభ్యర్థులు శిక్షణ కోసం వచ్చే నెల 12వ తేదీలోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారికి జులై 17న ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణ కాలంలో భోజన వసతి కల్పించి స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు సోషల్ వెల్ఫేర్ ఇంచార్జి డిప్యూటీ డైరెక్టర్ తిరుపతిరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సహకార బ్యాంకులతో రైతులకు మేలు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**కల్లూరు, జూన్ 29 (జనం సాక్షి) :** సహకార బ్యాంకులు రైతులకు, గ్రామీణ ప్రజలందరికీ ఆర్థిక పరంగా అండగా నిలుస్తూ, పొదుపు, రుణాలు, ఇతర బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కల్లూరు పట్టణంలో ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కల్లూరు బ్రాంచ్ నూతన భవనాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు మరింత చేరువలో, సౌకర్యవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో కల్లూరులో నూతన భవనంలో డీసీసీబీ శాఖను ప్రారంభించామని తెలిపారు. రైతు సుభిక్షంగా ఉంటేనే సహకార బ్యాంకులు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. రైతుల ఆదాయం పెరిగి, వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినప్పుడు బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, తద్వారా మరింత మంది రైతులకు రుణాలు అందించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఓ గంగాధర్, ఏసీపీ వసుంధర యాదవ్, బ్యాంక్ సిఇఓ ఎన్. వెంకట ఆదిత్య, డిజిఎం ఎం. సర్వేశ్వర రావు, ఎజిఎం బి. చందర్ రావు, మేనేజర్ ఎం. అనిత, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బాగం నీరజ, కల్లూరు మునిసిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ , వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటు అర్జున్ రావు , ఆర్యవైశ్య సంఘం



జిల్లా అధ్యక్షులు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చంద్రరావు, భాగం ప్రభాకర్ చౌదరి, తల్లపురెడ్డి అనిమిరెడ్డి, లక్కినేని కృష్ణ ఆలకుంట నరసింహారావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వై కంటి శ్రీనివాసరావు, కాటేపల్లి కిరణ్ కుమార్,ఏనుగుసత్యంబాబు, బొల్లం శంకర్ గౌడ్ పట్టణ కమిటీ అధ్యక్షులు షేక్ఉస్మాన్, ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలే అందించాలి

### ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్



**నంగునూరు, జూన్ 29 (జనం సాక్షి) :** నంగునూరు మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువులు, రసాయన మందుల దుకాణాలను సోమవారం ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వ ఉన్న విత్తనాల నాణ్యత, గడువు తేదీలు, ధరల జాబితా, విక్రయ విధానాలను పరిశీలించి వ్యాపారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. కాలం చెల్లిన విత్తనాలు విక్రయించరాదని, ఎంఆర్పీ కంటే అధిక ధరలు వసూలు చేయొద్దని స్పష్టం చేశారు. రైతులకు ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సూచించిన సన్న వడ్ల విత్తనాలనే రైతులకు అందించాలని, ప్రభుత్వ నిబంధనలను (నార్మ్స్) తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వ్యాపారులను కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, దుకాణ యజమానులు, నంగునూర్ యువత పాల్గొన్నారు.

# అర్హులైన నిరుపేదలందరికీ తక్షణమే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలి

- కలెక్టరేట్ ఎదుట ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ భారీ ధర్నా
- లబ్ధిదారులతో కలిసి ఇండ్ల ఆక్రమణకు వెనుకాడం
- బండారి శేఖర్ హెచ్చరిక




**కరీంనగర్ టౌన్, జూన్ 29 (జనం సాక్షి) :** కరీంనగర్ జిల్లా పరిధిలోని అర్హులైన నిరుపేద లబ్ధిదారులందరికీ తక్షణమే డబుల్ బెడ్‌రూమ్ మరియు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో సొంత ఇల్లే లేని నిరుపేదలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అధికారులకు దరఖాస్తులను సమర్పించారు. ధర్నానుద్దేశించి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ.. కరీంనగర్ పట్టణంలో గత 20 సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక, అద్దె ఇండ్లలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ బతుకులీడుస్తున్న పేదలు ఎందరో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో భర్తను కోల్పోయి, పిల్లలను ఒంటరిగా సాకుతూ అత్యంత దీన స్థితిలో జీవిస్తున్న వితంతువులకు ఇండ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పట్టుబట్టారు. అనర్హుల కేటాయింపులపై సమగ్ర విచారణ జరపాలి:ఇటీవల కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపు ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని బండారి శేఖర్ తీవ్రంగా ఆరోపించారు. దాదాపు 100 మందికి పైగా అనర్హులకు, ముఖ్యంగా అధికార పార్టీ నాయకుల అనుచరులకు ఎలాంటి అర్హతలు లేకపోయినా ఇండ్లను కేటాయించారని మండిపడ్డారు. రాజకీయ సిఫార్సులు మరియు పైరవీలతో జరిగిన ఇండ్ల కేటాయింపులపై తక్షణమే ఉన్నత స్థాయి కమిటీతో సమగ్ర విచారణ జరిపించాలని, అనర్హుల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇండ్లు ఇస్తుందా లేక లబ్ధిదారులను తీసుకొని మేమే ఇండ్లను ఆక్రమించాలా అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ గారు ఈ అక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, అనర్హుల జాబితాను తొలగించి, నిజమైన నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు ఇండ్లు కేటాయించని పక్షంలో పేదలందరినీ ఏకం చేసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బద్రి నేతతో పాటు వందలాది మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రైతు ఆశీర్వాద సభ వాయిదా

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 29 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరుణ దేవుడు కూడా కారుణించడాని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భారీ వర్షాల కారణంగా ఈ నెల 30న తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ కారణం వల్ల రైతులకి ప్రజలకి కాంగ్రెస్ కార్యకర్తలకి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతోనే సభ నిర్వహణలో మార్పులు చేసినట్లు ఆయన చెప్పుకుచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో తలపెట్టిన రైతు ఆశీర్వాద సభ ప్రాంతాన్ని సోమవారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది రైతుల సమక్షంలో ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులందరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని భావించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం 11 వాతావరణ పరిస్థితుల్లో ఇక్కడ సభ నిర్వహించడం అందరికీ ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు.




# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

## ఆధార్ ఫ్రీ.. పాస్‌పోర్ట్ భారం..

### జులై 1 నుంచి కొత్త క్రెడిట్ కార్డ్ రూల్స్

జులై 1 నుంచి ఆర్థిక అంశాలకు సంబంధించి పలు మార్పులు రాబోతున్నాయి. పాస్‌పోర్టు ఫీజులు పెరగబోతున్నాయి. ఎస్‌బీఐ- ఫోన్‌పే క్రెడిట్ కార్డు రివార్డు పాయింట్లకు సంబంధించి కొత్త నిబంధనలు రాబోతున్నాయి. ఆదాయపు పన్ను చెల్లింపుదారులు రిటర్నులు దాఖలు చేయాల్సిన గడువూ ఈ నెలలోనే ముగియనుంది. ఆ వివరాలు ఇవీ..

**ఐటీఆర్ డెడ్‌లైన్:**ఐటీఆర్-1, ఐటీఆర్-2 రిటర్నుల దాఖలు గడువు జులై 31తో ముగియనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితి దాటిన ప్రతి ఒక్కరూ రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. డెడ్‌లైన్‌లోపు రిటర్నులు దాఖలు చేయకుంటే పెనాల్టీ చెల్లించాలి.

**6 నెలలు ఆధార్ ఫ్రీ:**భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ తన మొబైల్ యాప్‌లో ఇ-మెయిల్ అప్‌డేషన్‌పై రుసుములు తొలగించింది. ప్రస్తుతం ఇ-మెయిల్ ఐడీ అప్‌డేషన్ కోసం రూ.75 చొప్పున ఫీజు వసూలు చేస్తుండగా.. జులై 1 నుంచి ఆరు నెలల పాటు అంటే 2026 డిసెంబర్ 31వరకు ఉచితంగా అప్‌డేట్ చేసుకునే సదుపాయాన్ని ఉడాయ్ కల్పిస్తోంది.



**పాస్‌పోర్ట్ ఫీజు పెంపు:**జులై 1 నుంచి పాస్‌పోర్ట్ ఫీజులు పెరగబోతున్నాయి. 36 పేజీలతో కూడిన పాస్‌పోర్ట్ రుసుమును రూ.1500 నుంచి రూ.2,500 పెంచింది. తత్కాల్ ఫీజును రూ.3,500 నుంచి రూ.5 వేలకు సవరించింది. 60 పేజీల పాస్‌పోర్ట్‌కు రూ.2 వేల నుంచి రూ.3500 పెంచారు. తత్కాల్ ఫీజును రూ.6 వేలుగా నిర్ణయించారు. 18 ఏళ్ల కన్నా తక్కువ వయసున్న దరఖాస్తుదారులకు కొత్త పాస్‌పోర్ట్ రుసుము ప్రస్తుతం రూ.1000 ఉండగా.. దీనిని రూ.1750కి చేర్చారు.

**క్రెడిట్‌కార్డు యూజర్లకు షాక్:**ఫోన్‌పే- ఎస్‌బీఐ కార్డ్ కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డుల రివార్డు పాయింట్ ప్రోగ్రామ్‌లో ఎస్‌బీఐ కార్డ్ మార్పులు చేసింది. ఫోన్‌పే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్ పర్పుల్, ఫోన్‌పే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్ సెలెక్ట్ బ్లాక్ రివార్డు పాయింట్లకు కొత్త పరిమితులను నిర్దేశించింది. జులై 1 నుంచి ఈ మార్పులు అమల్లోకి రానున్నాయి.

**మార్పులు ఇవే...:**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ ప్రోగ్రాములో మార్పులు చేసింది. త్రైమాసికంలో కనీసం రూ.60వేలు ఖర్చు చేసిన వారికే తదుపరి నెల ఉచిత లాంజ్ యాక్సెస్ కల్పించేలా మార్పులు చేసింది. ఈ నిబంధన కూడా జులై 1 నుంచే అమల్లోకి రానున్నాయి.

**చమురు ఊరట లభిస్తుందా?:**అంతర్జాతీయంగా చమురు ధరలు దిగి వచ్చాయి. పెరిగిన ఎల్పీజీ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులకు ఊరట కల్పించేలా ప్రభుత్వరంగ చమురు సంస్థలు ఏదైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా చమురు ధరలను సమీక్షించి ప్రతి నెలా ఒకటో తేదీన ఎల్పీజీ ధరలను ఆయా సంస్థలు సవరిస్తుంటాయి. ఈసారి అలాంటి ఊరట ఉంటుందేమో చూడాలి.

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు, క్రూడాయిల్ ధరలు పెరగడం మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో సెన్సెక్స్ 372 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 109 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 77,055.21 పాయింట్ల (క్రితం ముగింపు77,100.47) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,252.78 వద్ద గరిష్ఠాన్ని తాకగా, 76,621.75 వద్ద కనిష్ఠానికి చేరింది. 372.10 పాయింట్ల నష్టంతో సెన్సెక్స్ 76,728.37 వద్ద ముగిసింది. నిఫ్టీ 109.75 పాయింట్ల నష్టంతో 23,946.25 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.54గా ఉంది. సెన్సెక్స్‌లో ఎటర్నెల్, ట్రెంట్, బెల్, ఎన్‌టీపీసీ లాభాల్లో ఉండగా, కోటక్‌బ్యాంక్, ఎంఅండ్‌ఎం, మారుతీ, ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, నష్టాల్లో ముగిశాయి.



**లాభాలొచ్చినా.. పరిమితంగానే**

ఈ వారం స్టాక్ మార్కెట్లు స్థిరీకరణకు గురికావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు, వర్షపాత ప్రగతిని మార్కెట్ వర్గాలు పరిశీలిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే గ్రామీణ గిరాకీ ఆధారిత రంగాలపై ప్రభావం పడొచ్చు. ముడి చమురు ధరలు తగ్గుతుండటం, స్థిర కరెన్సీ కలిసి దేశీయ మార్కెట్లో సానుకూలతలకు మద్దతు పలుకవచ్చు. అధిక స్థాయిల వద్ద విక్రయాల కారణంగా పరిమిత లాభాలే కనిపించొచ్చనీ చెబుతున్నారు. భారత్‌లో అమెజాన్ పెట్టుబడులు దేశ ఏఐ, క్లౌడ్ ఇన్‌ఫ్రా సామర్థ్యాలను బలోపేతం చేయొచ్చు. నిఫ్టీ-50కి ఈ వారం 23,900-23,800 వద్ద మద్దతు; 24,200-24,500 వద్ద నిరోధం కనిపిస్తోంది. కీలక నిరోధ స్థాయి అయిన 24,200ను అధిగమించకపోతే మరింత స్థిరీకరణ లేదా కాస్త నష్టాలు కనిపించొచ్చని విశ్లేషకులు అంటున్నారు. వివిధ రంగాలపై వాళ్లు ఏమంటున్నారంటే..నిఫ్టీ బ్యాంక్ ఈ వారం పెరగవచ్చు. అయితే వరుస 4 వారాల లాభాల అనంతరం కాస్త నెమ్మదించవచ్చు. ఆర్‌బీఐ చర్యల వల్ల నిధుల వ్యయాలు తగ్గుతాయన్న అంచనాల మధ్య రుణ నాణ్యతపై నమ్మకాలున్నాయి. అందువల్ల సూచీ కిందకు దిగడానికి పరిమిత అవకాశాలే ఉన్నాయి. అమెరికాలో కొత్త అవకాశాలు, దేశీయ విక్రయాలకు తోడు రక్షణాత్మక రంగం కావడంతో చాలా వరకు ఫార్మా షేర్లు రాణించవచ్చు. ఇప్పటికే పెరిగి ఉండడం వల్ల మధ్యకాలంలో లాభాలు పరిమితంగానే కనిపించొచ్చు. జూన్ త్రైమాసికాల కోసం మదుపర్లు ఎదురుచూడొచ్చు. నిఫ్టీ ఆటో సూచీ బలంగా కనిపిస్తోంది కానీ సాంకేతిక అంశాలు లాభాల వైపునకు స్పష్టతనివ్వడం లేదు. అందువల్ల ఇది స్థిరీకరణ దశలో ఉంటూ, ఊగిసలాటకు గురికావొచ్చు. ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల షేర్లు స్థిరీకరణ దిశ నుంచి కాస్త రికవరీ చెందొచ్చు. జూన్ త్రైమాసికంలో చమురు ధరల వల్ల ముడిపదార్థాలు పెరిగినప్పటికీ, సెప్టెంబరు త్రైమాసికంలో ఆ ప్రభావం కనిపించకపోవచ్చు. అందువల్ల ధరల పెంపు జోలికి పోకపోవచ్చు. చమురు-గ్యాస్ కంపెనీలు సమీప కాలంలో ఒక శ్రేణికి లోబడి కదలాడవచ్చు. 50, 100 రోజుల చలన సగటు(డీఎమ్ఏ) కంటే దిగువనే ఈ రంగ సూచీ చలిస్తున్నందున బలహీన ధోరణి కనిపిస్తోంది. పశ్చిమాసియా పరిణామాల మధ్య ముడి చమురు ధరలను మదుపర్లు పరిశీలించొచ్చు.ముడి చమురు ధరలు భారీగా తగ్గడంతో ముడి పదార్థాల ధరల భారం తగ్గొచ్చన్న అంచనాల మధ్య యంత్ర పరికరాల కంపెనీల షేర్లు పెరగొచ్చు. అయితే అధిక షేర్ల విలువలు, ఇరాన్ యుద్ధం తర్వాత మూలధన వ్యయాలపై అనిశ్చితి కారణంగా పై స్థాయిల్లో విక్రయాలూ జరగొచ్చు. ఐటీ షేర్లు ఊగిసలాటకు గురికావొచ్చు. ఈ కంపెనీలకు సంబంధించిన వార్తలు, యాజమాన్య వ్యాఖ్యలు, అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు, యూఎస్-భారత్ వాణిజ్య ఒప్పంద ప్రగతి తదితరాల నుంచి దిశానిర్దేశం లభించొచ్చు. జూన్‌లో గిరాకీ మిశ్రమంగా ఉండొచ్చన్న అంచనాల మధ్య సిమెంటు షేర్లు ప్రతికూల ధోరణితో ట్రేడవ్వొచ్చు. టెలికాం కంపెనీల షేర్లు స్వల్పకాలంలో స్థిరీకరణకు గురికావొచ్చు. పశ్చిమాసియా యుద్ధం చల్లబడుతుండటం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే టారిఫ్ పెంపుల అంచనా కారణంగా మొత్తం మీద సానుకూల ధోరణి ఉంది. కానీ ప్రభుత్వ కొత్త నిబంధనలు కూడా ఈ షేర్లకు సంకేతాలను అందించవచ్చు. చాలా వరకు లోహ కంపెనీల షేర్లు ఒత్తిడిలో కొనసాగొచ్చు. అమెరికా ఫెడ్ రిజర్వ్ కొత్త ఛైర్మన్ కెవిన్ వార్ష్ కఠిన ధోరణి సంకేతాల మధ్య అంతర్జాతీయంగా వడ్డీ రేట్లు అధికంగా ఉంటాయన్న అంచనాలు పెరిగాయి. ఇది డాలరుకు సానుకూలమే అయినా.. లోహ ధరలకు ప్రతికూలం.


## నిరాశపర్చిన టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్..


### 11% నష్టంతో ఎంట్రీ

ఇన్సూరెన్స్ కంపెనీ టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్ షేర్లు సోమవారం స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.152తో పోలిస్తే దాదాపు 11 శాతం తక్కువ ధరకు షేర్లు నమోదవడం మదుపర్లను నిరాశకు గురిచేసింది. బీఎస్ఈలో షేరు విలువ రూ.136.20 వద్ద మొదలై.. ఓ దశలో 13 శాతం కుంగి రూ.132.15కు పడిపోయింది. అటు ఎన్ఎస్ఈలోనూ 11.25 శాతం డిస్కౌంట్‌తో రూ.134.90 వద్ద ట్రేడింగ్‌ను మొదలుపెట్టింది. జూన్ 19 నుంచి 23 వరకు జరిగిన ఈ ఐపీఓకు బిడ్డింగ్ ఇన్వెస్టర్ల నుంచి అంతగా స్పందన రాలేదు. చివరి రోజు పూర్తయ్యేసరికి కేవలం 1.20 రెట్ల సబ్‌స్క్రిప్షన్ మాత్రమే నమోదు చేసింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.4,069.70 కోట్లుగా ఉంది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.883 కోట్లను ఇన్వెస్టర్ల నుంచి సమీకరించింది. ధరల శ్రేణిని రూ.144-152గా నిర్ణయించింది.

## వాట్సప్ వెబ్ ద్వారా మాల్‌వేర్ దాడులు

దిల్లీ: వాట్సప్ వెబ్, డెస్క్‌టాప్ వినియోగదారులే లక్ష్యంగా దేశంలో భారీ మాల్‌వేర్ దాడులు జరుగుతున్నాయని జాతీయ సైబర్ సెక్యూరిటీ పర్యవేక్షణ సంస్థ సెర్ట్‌ఇన్ హెచ్చరించింది. వినియోగదారుల పరికరాల్లోకి ఈ మాల్‌వేర్ ప్రవేశిస్తే, సైబర్ నేరగాళ్లు అనుమతి లేకుండానే కంప్యూటర్, ల్యాప్‌టాప్‌ను తమ అధీనంలోకి తీసుకునే ప్రమాదం ఉందని పేర్కొంది. ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థలు కాస్పెర్స్కీ, సెక్యూర్‌లిస్ట్‌ల పరిశోధనల ఆధారంగా సెర్ట్‌ఇన్ ఈ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం.. హ్యాకర్లు మొదట కొన్ని ఖాతాలను హ్యాక్ చేస్తున్నారు. ఆ తర్వాత సదరు ఖాతాల్లోని కాంటాక్ట్స్‌లో ఉన్న స్నేహితులు, బంధువులు, సహోద్యోగులకు ప్రమాదకరమైన ఫైళ్లను మెసేజ్ రూపంలో పంపుతున్నారు. మనకు తెలిసిన వాళ్ల దగ్గర నుంచే మెసేజ్ లేదా ఫైల్ రావడంతో, వినియోగదారులు ఎటువంటి అనుమానం లేకుండా ఓపెన్ చేసి హ్యాకర్ల వలలో పడుతున్నారు. ఈ మాల్‌వేర్ ద్వారా హ్యాకర్లు విజువల్ బేసిక్ స్క్రిప్ట్ కోడింగ్ ఫైళ్లను అటాచ్‌మెంట్‌లుగా పంపుతున్నారు. ఈ ఫైళ్లను ఓపెన్ చేసి, సిస్టమ్‌లో రన్ చేస్తే సైబర్ నేరగాళ్లు దూరం నుంచే వినియోగదారుల పరికరాలను నియంత్రించగలరు. ఖాతాల పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలను దొంగలించి ఆర్థిక మోసాలకు పాల్పడతారు. తెలియని ఫైళ్లను తెరవవద్దని సెర్ట్ ఇన్ సూచిస్తోంది.






# అప్పుడు వద్దనుకున్నవే.. ఇప్పుడు అండగా నిలిచాయ్

### సంక్షోభాల్లో దేశానికి తోడుగా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు

దిల్లీ: దేశంలో ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా, ఇంధన సరఫరా ఎక్కడా ఆగకుండా నిరంతరాయంగా నడిపించింది మాత్రం ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లే. భారీ వరదలు, కొవిడ్ మహమ్మారి నుంచి తాజాగా పశ్చిమాసియా యుద్ధం వరకు ప్రతి సంక్షోభాన్ని ఈ కంపెనీలు సమర్థవంతంగా ఎదుర్కొన్నాయి. తక్కువ రాబడి, ఇంధన ధరల్లో ప్రభుత్వ జోక్యం, భారీ నిర్వహణ వ్యయాల వల్ల గతంలో రెండు సార్లు ప్రైవేటీకరణ అంచుల వరకు ఈ సంస్థలు వెళాయి. అయినా కూడా దేశానికి అత్యవసర సమయాల్లో 'లైఫ్ లైన్'గా నిలుస్తున్నాయి. 2015లో చెన్నై వరదల సమయంలో రిటెయిల్ ఔట్‌లెట్‌లు మూతపడినా.. ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఇంధనాన్ని తరలించి అత్యవసర సేవలు నిలిచిపోకుండా చేశాయి. కొవిడ్-19 లాక్‌డౌన్ సమయంలో ఎటవంటి అంతరాయం లేకుండా పెట్రోల్ బంకులు తెరిచి ఉంచారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌లను ఇళ్లకు అందజేశారు. మెడికల్ విమానాల కోసం విమాన ఇంధన సరఫరాను నిరంతరం పర్యవేక్షించారు. రిఫైనరీల్లో ఉత్పత్తి ఆగకుండా ఉండేందుకు ఇంజినీర్లు వారాల తరబడి లోపలే ఐసోలేషన్‌లో ఉండి పనిచేశారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల హార్ముజ్ జలసంధి మూసివేసిన వెంటనే చమురు కంపెనీలు సత్వరం స్పందించాయి. అంతర్జాతీయ చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగినప్పటికీ, వినియోగదారులపై భారం పడకుండా రెండున్నర నెలల పాటు మూడు కంపెనీలే భరించాయి. ఆ తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.7.50 చొప్పున పరిమితంగా పెంచాయి. గ్యాస్ సిలిండర్ ధరను రూ.89, సీఎన్‌జీని కేజీకి రూ.6 మాత్రమే పెంచాయి. ప్రపంచంలో ఇతర పెద్ద దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ప్రైవేట్ సంస్థ నయారా, షెల్ మాత్రం పెరిగిన ధరలను తక్షణమే వినియోగదారులపై బదలాయిం చాయి. క్రిసిల్ రేటింగ్స్ ప్రకారం.. ఈ ఏడాది మార్చి నుంచి మే మధ్యలో మూడు ప్రభుత్వ రంగ సంస్థలు మొత్తంగా రూ.40,000- 50,000 కోట్ల నికర నష్టాలను చవిచూశాయి. కంపెనీల మొత్తం వార్షిక లాభాలతో ఇది సమానం. ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఎందుకు విఫలమయ్యాయంటే 2002 వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ విక్రయానికి ప్రయత్నించారు. పార్లమెంట్ చట్టం ద్వారా జాతీయం చేయడం వల్ల ఇందుకు ఉభయసభల ఆమోదం తప్పనిసరని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. 2020లో మోదీ ప్రభుత్వం బీపీసీఎల్‌లో మెజారిటీ వాటాను విక్రయించడానికి ప్రయత్నించింది. అంతర్జాతీయ మార్కెట్ అనిశ్చితి కారణంగా బిడ్డర్లు వెనక్కి తగ్గడంతో ఈ ప్రక్రియను నిలిపివేశారు. మన దేశం తన ఇంధన అవసరాల కోసం దాదాపు 88% దిగుమతులపైనే ఆధారపడుతోంది. దేశంలోని మొత్తం ఇంధన రిటెయిల్ నెట్‌వర్క్‌లో 90 శాతం వాటా ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థలదే కావడంతో, ప్రభుత్వం అత్యవసర సమయాల్లో కీలక నిర్ణయాలు అమలు చేయడానికి వీలుపడుతోంది.



## పెట్రోల్, డీజిల్ విక్రయాలపై ఆంక్షలు ఎత్తివేత

తాత్కాలిక నియంత్రణ ఉత్తర్వులను కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఉపసంహరించుకుంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి (జులై 1) ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. దేశంలో ప్రస్తుతం పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా పరిస్థితి సాధారణ స్థితికి చేరిందని ఈ సందర్భంగా వెల్లడించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తలెత్తడంతో చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇదే అదునుగా కృత్రిమ కొరత సృష్టించేందుకు ఆస్కారం ఉండడంతో కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఒక్కో కస్టమర్ లేదా వాహనానికి రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్ విక్రయించకుండా పరిమితి విధించింది. దీనికితోడు రిటైల్ ధరలతో పోలిస్తే పరిశ్రమలకు విక్రయించే డీజిల్ ధర లీటరుకు రూ.40 అధికం కావడంతో పారిశ్రామిక అవసరాలకు డీజిల్ మళ్లించడంతో కొన్ని చోట్ల పెట్రోల్ పంపుల వద్ద కొరత ఏర్పడింది. దీన్ని నివారించేందుకు తాత్కాలికంగా ఆంక్షలు తీసుకొచ్చింది. ప్రస్తుతం పరిస్థితులు సాధారణ స్థితికి చేరడంతో ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం రిటైల్ ఔట్‌లెట్లలో ఉన్న ఆంక్షలను ఎత్తివేసింది.

## పెరిగిన పాత బంగారం విక్రయాలు

**న్యూఢిల్లీ:**బంగారాన్ని ఆభరణంగా ధరించేందుకు కొనుగోలు చేసేవారు కొందరైతే.. పెట్టుబడి సాధనంగా భావించి కొనేవారు ఇంకొందరు. ఇలా పెట్టుబడి పెట్టిన వారికి పసిడి ఇటీవల కాలంలో 'కనక వర్షం' కురిపించింది. కానీ, గడిచిన కొద్దిరోజులుగా పుత్తడి ధర దిద్దుబాటుకు లోనవుతోంది. మరింత పతనం అవుతుందన్న భయాలూ నెలకొన్నాయి. దీంతో కొందరు తమ వద్ద ఉన్న పాత బంగారాన్ని విక్రయించి 'సొమ్ము' చేసుకుంటున్నారు. ఇంకా ధర పడిపోతే ఆ మేర లాభాన్ని కోల్పోతామని భావించి విక్రయాలకు దిగుతున్నారు. ఇండియా బులియన్, జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రకారం.. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశీయ కుటుంబాలు 50 టన్నుల బంగారాన్ని విక్రయించినట్లు తేలింది. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం 43 శాతం అధికం. అంతర్జాతీయ పరిణామాలతో గడిచిన ఏడాదిగా ఆకాశమే హద్దుగా పెరిగిన పసిడి ధర.. గత కొన్నివారాలుగా తగ్గుముఖం పడుతుండడంతో లాభాల స్వీకరణకు దిగుతున్నారు. ఇంతకుమించి పెరగకపోవచ్చన్న అంచనాలే దీనికి కారణమని బులియన్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో రూ.10 గ్రాముల బంగారం ధర రూ.1.20 లక్షల మార్కుకు పడిపోవచ్చన్న అంచనాలతో తమ వద్ద ఉన్న బంగారాన్ని, పసిడి ఆభరణాలను నగదుగా మార్చుకుంటున్నారంటూ ఎకనమిక్ టైమ్స్ ఓ కథనం ప్రచురించింది.

**బంగారం ఎందుకు పడుతోంది?**

అంతర్జాతీయంగా ఇటీవల కాలంలో పసిడి ధరలు ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య తాజా ఘర్షణలతో క్రూడాయిల్ ధరలు మళ్లీ పెరిగాయి. దీనికితోడు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచొచ్చన్న అంచనాలు బంగారం ధరల పతనానికి కారణమయ్యాయి. అమెరికాలో వడ్డీ రేట్లు పెరిగితే సాధారణంగా పసిడిపై పెట్టుబడులు క్షీణిస్తాయి.

**దిగుమతుల బిల్లు మిగులు**

బంగారం ఇలా లాకర్ల నుంచి మార్కెట్‌లోకి రావడం వల్ల ఓ విధంగా భారత్‌కు మేలే. దేశంలోని కుటుంబాల వద్ద సుమారు 30వేల టన్నుల పసిడి ఉందనేది అంచనా. అయినా ఇప్పటికీ పెద్దఎత్తున బంగారాన్ని భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఇలా పాత బంగారం మార్కెట్‌లోకి రావడం వల్ల పసిడి రీసైక్లింగ్ ఇండస్ట్రీకి ప్రయోజనం చేకూరుతుంది. 2025లో 125-150 టన్నుల బంగారం మార్కెట్‌లోకి రాగా.. ప్రస్తుత ట్రెండ్ ఇలానే కొనసాగితే 200-250 టన్నుల బంగారం వస్తుందనేది అంచనా. ఇదే జరిగితే ఆ మేర పసిడి దిగుమతుల బిల్లు తగ్గుముఖం పడుతుంది. బంగారం కొనుగోళ్లను నిరాశ పరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఊతమిచ్చినట్లు అవుతుంది.

# బిగ్ టెక్ నియామకాలు మన దగ్గరే ఎక్కువ

### ఈ ఏడాదిలో ఇప్పటికే 13,600 మంది ఎంపిక



**న్యూఢిల్లీ:**అత్యుత్తమ నిపుణుల లభ్యత వల్లే అమెరికాలో హెచ్-1బీ వీసా నిబంధనలు కఠినతరం కావడం, ఖర్చు విపరీతంగా పెరగడంతో.. ఐటీ దిగ్గజ సంస్థలు తమకు కావాల్సిన నిపుణులను మనదేశంలోని కార్యాలయాల్లోనే నియమించుకుంటున్నాయి. అత్యాధునిక నైపుణ్యాలున్న వారిని భారత్‌లోనే నియమించుకుంటున్న బహుళజాతి కంపెనీలు.. తమ వ్యూహాత్మక బాధ్యతలను సైతం ఇక్కడికి బదిలీ చేస్తున్నాయి. ఇది మన ఐటీ రంగానికి మంచి పరిణామమేనని నిపుణులు పేర్కొంటున్నారు. కంపెనీలకు ఖర్చులూ తగ్గుతుండటం ఇక్కడ ఆకర్షణీయాంశం. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, కోర్ ఇంజినీరింగ్ నైపుణ్యాలున్న వారికి అంతర్జాతీయ సంస్థలు మనదేశంలోనే మంచి వేతనంతో ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. మెటా, అమెజాన్, యాపిల్, మైక్రోసాఫ్ట్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్ వంటి సంస్థలు (ఫామ్ఎన్‌జీ) ఈ ఏడాది తొలి అర్ధభాగంలో దేశీయంగా సుమారు 13,600 మందిని నియమించుకున్నాయి. గతేడాది ఇదే సమయంలో ఈ కంపెనీలు నియమించుకున్న 12,800 మంది నిపుణుల కంటే ఈ సంఖ్య 6% కంటే ఎక్కువని ప్రముఖ స్టాఫింగ్ సంస్థ ఎక్స్‌ఫెనో తెలిపింది. ఇదే ట్రెండ్ కొనసాగితే, ఈ ఏడాది చివరికి మనదేశంలో బిగ్ టెక్ నియామకాలు గతేడాది కంటే 16-20% వృద్ధి చెందుతాయన్నది నియామక సంస్థల అంచనా. ఏఐ, క్లౌడ్, ప్లాట్‌ఫామ్ ఇంజినీరింగ్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) విస్తరణే ఇందుకు కారణమని పేర్కొంటున్నాయి. 2025 మొత్తంమీద ఈ పెద్ద టెక్ కంపెనీలు రికార్డు స్థాయిలో దాదాపు 32,000 మంది ఉద్యోగులను నియమించుకున్నాయి.

ఒకవైపు లే ఆఫ్‌లు

ఈ ఏడాది ప్రారంభంలో ఒరాకిల్, మెటా, మైక్రోసాఫ్ట్ యాజమాన్యంలోని లింక్డ్‌ఇన్ వంటి దిగ్గజ కంపెనీలు అంతర్జాతీయంగా భారీ సంఖ్యలో లేఆఫ్స్ ప్రకటించాయి. ఈ ప్రభావం భారతీయ ఉద్యోగులపైనా తీవ్రంగా పడింది. కృత్రిమ మేధపై పెడుతున్న భారీ పెట్టుబడుల దృష్ట్యా, ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా 8,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ఏప్రిల్‌లో మెటా ప్రకటించింది. భర్తీ చేయాలనుకున్న 6,000 ఖాళీలను అలాగే ఉంచేసింది. అయినా మెటా, దాని అనుబంధ సంస్థలు 2026లో ఇప్పటివరకు మనదేశంలో 1,600 మందిని నియమించుకున్నాయి. గత 12 నెలల్లో మెటా నికర నియామకాలు 4,400గా నమోదయ్యాయి. భారత్‌లో మెటా మాతృ సంస్థలో 400-500 మంది ఉద్యోగులుండగా, పెట్టుబడులు, ఇతర వ్యాపార అనుబంధ సంస్థల్లో మొత్తం 15,000 మంది ఉద్యోగులున్నారు. వీటికే గిరాకీ నియామకాల సంస్థ టీమ్‌లీజ్ ప్రకారం.. ఏఐ, ఎంఎల్, క్లౌడ్, డేటా ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో కొత్త ఉద్యోగాలకు గిరాకీ 25-30% పెరిగింది. జీసీసీల నియామకాల్లో మధ్యస్థ-సీనియర్ స్థాయి ఉద్యోగుల వాటా ప్రస్తుతం 77 శాతానికి చేరింది. 2023లో ఇది 60 శాతమే. జెన్‌ఏఐ ఇంజినీర్లు, క్లౌడ్ ఆర్కిటెక్ట్‌లు, సైబర్ సెక్యూరిటీ అనలిస్టులకు భారీగా గిరాకీ ఉందని, వీరికి ఆటోమేషన్ ముప్పు తక్కువేనని నివేదికలు చెబుతున్నాయి. మరోవైపు బ్యాక్ ఎండ్ డెవలపర్, ఐటీ ఆపరేషన్స్ విభాగాల్లో ఉద్యోగాల సంఖ్య క్షీణిస్తోంది.

**ఔట్‌సోర్సింగ్‌పై పన్ను విధిస్తే కష్టమే**

హెచ్-1బీ కొత్త వీసా ఫీజు లక్ష డాలర్లుగా చేశాక, అమెరికాలో విదేశీ నిపుణులను నియమించుకోవడం కంపెనీలకు అత్యంత భారంగా మారింది. దీనికి బదులు ఏఐ, డీప్ టెక్ నిపుణులను భారత్‌లోని తమ కార్యాలయాల్లో నియమించుకుంటూ, అంతర్జాతీయ కంపెనీలు పనులను అవుట్‌సోర్సింగ్ చేస్తున్నాయి. అమెరికా వెలుపల ఉన్న విదేశీ ఉద్యోగుల సేవలకు చేసే చెల్లింపులపై 25% ఔట్‌సోర్సింగ్ పన్నునూ అమెరికా ప్రతిపాదిస్తోంది.

## త్రిభాషా విధానం నుంచి 'పది'కి మినహాయింపు

నుంచి 9వ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలు అభ్యసించాలని సీబీఎస్ఈ ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ ఆదేశాలపై పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే సీబీఎస్ఈ తాజా ప్రకటన చేసింది. "ప్రస్తుత 10వ తరగతి బ్యాచ్ త్రిభాషా విధానాన్ని పాటించాల్సిన అవసరం లేదు. అలాగే, ప్రస్తుతం 7 నుంచి 9 తరగతుల్లో ఉన్న విద్యార్థులు 10వ తరగతికి వెళ్ళినప్పుడు థర్డ్ లాంగ్వేజీ బోర్డు పరీక్షలు రాయాల్సిన అవసరం ఉండదు" అని సీబీఎస్ఈ అకడమిక్స్ డైరెక్టర్ ప్రజ్ఞా ఎం. సింగ్ తెలిపారు. అనవసర ఒత్తిడి తగ్గించేందుకే ఈ ఏర్పాటు చేశామని.. ఆ పాఠ్యాంశానికి పాఠశాలల్లో చూపే ప్రతిభ ఆధారంగానే మార్కులు కేటాయిస్తామని పేర్కొన్నారు.

### మహిళా సంక్షేమం, విద్య, వైద్య రంగాలకు
# ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు-ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి
- ఓగులాపూర్‌లో వివో మహిళా సమైక్య భవనం ప్రారంభం
- చిగురుమామిడిలో 16 లక్షలతో నిర్మించనున్న మహిళా సమైక్య భవనానికి శంకుస్థాపన




**చిగురుమామిడి, జూన్ 29 (జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం, రైతు సంక్షేమం, విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఓగులాపూర్‌లో 10 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన వివో మహిళా సమైక్య భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక సర్పంచ్ గడ్డం రమాదేవి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ భవనం కేవలం ఒక భవనం మాత్రమే కాదని, గ్రామ ప్రజల ఐక్యతకు, మహిళల సాధికారతకు, గ్రామాభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలవబోతోందన్నారు. మహిళా సంఘాల సమావేశాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు, శిక్షణా తరగతులు, సంక్షేమ పథకాలపై అవగాహన, గ్రామాభివృద్ధి సమావేశాలు ఇకపై ఒకేచోట నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నట్లు వివరించారు. అనంతరం చిగురుమామిడి మండల కేంద్రంలో 16 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న వివో మహిళా సమైక్య భవనానికి మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి శంకుస్థాపన చేశారు.

**చిగురుమామిడిలో వైభవంగా శ్రీ పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ**

ముదిరాజుల ఆరాధ్య దైవం శ్రీ పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు రెండు కోట్ల రూపాయలతో అద్భుతంగా నిర్మించిన ఆలయాన్ని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు గడ్డం రమాదేవి శ్రీనివాస్ రెడ్డి, ఆకవరం భవాని శివప్రసాద్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గురుకులంలో కలకలం..!!

**జిన్గుర్తి గురుకులంలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం**



- పరిస్థితి విషమం గాంధీ ఆసుపత్రికి తరలింపు
- రెండు కాళ్లు వెన్నుముక విరిగిన వైనం
- భద్రత వైఫల్యం.. కేర్ టేకర్ ఏమైనట్లు..?

**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 29 (జనంసాక్షి) :** గురుకులం లోపల ఏం జరుగుతుందో అంతు పట్టని ప్రశ్న. బయటికి విద్యాలయమైన లోపల మాత్రం చీకటి సామ్రాజ్యంగా ఉంటుంది. ఏదైనా జరగరానిది జరిగినప్పుడే గురుకుల దారుణాలు వెలుగులోకి వస్తాయి. అధికారుల హడావుడి విచారణ కమిటీ మినహా గురుకులంలో జరిగిన సంఘటనలకు బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకున్న దాఖలాలు అరుదు. కనీసం గురుకులాల్లో జరుగుతున్న సంఘటనలపై అధ్యయనం చేసిన నాయకులు అధికారులు లేరు. తాజాగా వికారాబాద్ జిల్లా తాండూర్ మండలంలోని జిన్గుర్తి గిరిజన గురుకులంలో ఆదివారం అర్ధరాత్రి దారుణం చోటుచేసుకుంది. ఇదే గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మహేశ్వరి ఆదివారం అర్ధరాత్రి గురుకులం భవనం పైకి ఎక్కి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గురుకులం భవనం పైనుంచి కిందికి దూకడంతో రెండు కాళ్లు వెన్నుముక విరిగిపోయింది. రాత్రి రెండు గంటల సమయంలో గురుకులం సిబ్బంది తాండూర్ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. విద్యార్థిని మహేశ్వరి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ధరూర్ మండలం మైలారం గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి జినుగుర్తి గురుకులంలో చదువుకుంటుంది. జిన్గుర్తి గిరిజన గురుకులంలో భద్రత కొరవడినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. అటవీ ప్రాంతంలో ఉండే గిరిజన గురుకులంలో భద్రత సరిగ్గా లేనట్లు ఈ సంఘటనతో రుజువు అయింది. రాత్రిపూట విద్యార్థులు నిద్రపోయినప్పుడు వారికి భద్రతగా గార్డ్ ఏర్పాటు చేస్తారు. కానీ అర్ధరాత్రి విద్యార్థి గురుకులం భవనం పైకి వెళ్లి కిందికి దూకడంతో అక్కడ భద్రత వైఫల్యం ఎంతుందో స్పష్టమవుతుంది. అధిక మంది విద్యార్థులు ఉండే గురు కులంలో వారి బాగోగులు చూసుకోవడానికి కేర్ టేకర్ ఉంటారు. వారి మానసిక పరిస్థితిని గుర్తించడానికి విద్యార్థులతో ఒక కమిటీ ఉంటుంది. కానీ అవి సరిగ్గా పనిచేయడం లేదు నిర్లక్ష్యంగా ఉన్నట్లు ఈ సంఘటనతో తేలిపోయింది.

**మరి ఎందుకు కనిపెట్టలేదు..?**

గత మూడు రోజులుగా విద్యార్థి మహేశ్వరి మానసిక పరిస్థితి బాగాలేదని గిరిజన గురుకులం సిబ్బంది చెప్పుకొస్తున్నారు. కానీ ఆమె మానసిక పరిస్థితి బాగా లేనప్పుడు ఒక కంటితో కనిపెట్టడం మర్చిపోయారు. విద్యార్థి మహేశ్వరి భవనంపై దూకే ముందు ఒక ఉత్తరం రాసి పెట్టుకుంది. అందులో నేను కన్న కలలు నెరవేరలేదు. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని రాసి ఉంది. తన స్నేహితురాలు తల్లిదండ్రులు క్షమించాలని కోరింది. చిన్న నాటి స్నేహితురాలు వల్ల ఈ స్థాయికి వచ్చానని తాను అనుకున్న కలలు నెరవేరడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగా భవనంపై నుంచి ఆత్మహత్య చేసుకున్నట్లు లేకలో పేర్కొంది. గురుకులం లోపల ఇంత జరుగుతున్న సిబ్బంది గుర్తించలేకపోవడం గమనార్హం. ఇక ఈ సంఘటనపై కరణ్ కోట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్ బ్యూరో, జూన్ 29 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా 46వ డివిజన్ పరిధిలోని రామ్‌నగర్, రోడ్ నెం.6 లో రూ. 10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... నగరంలో పారిశుధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా, మురుగునీటి పారుదల వ్యవస్థను ఆధునికీకరించేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రాధాన్యత ఆధారంగా చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నాణ్యతకు ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రామ్‌నగర్ ప్రాంతంలో ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పూర్తయిన తర్వాత మురుగునీటి పారుదల సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడతాయని, స్థానిక ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, 46వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు భరోసా పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**జూలై 5లోపు ఏఈఓలకు దరఖాస్తులు సమర్పించాలి**

**మల్లాపూర్ జూన్ 29(జనంసాక్షి) :** మండలంలోని కొత్త పట్టాదారు పాస్ బుక్ పొందిన రైతులు రైతు భరోసా పథకానికి తప్పనిసరిగా దర ఖాస్తు చేసుకోవాలని ఏఈఓ వంశీ సూచించారు. ఈ ఏడాది జూన్ 15వ తేదీ లోపు కొత్త పట్టాదారు పాస్ పొందిన రైతులందరూ అర్హులని తెలిపారు. రైతులు తమ దరఖాస్తులను జూలై 5వ తేదీలోపు సమీప వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు)కు సమర్పించాలని కోరారు. దరఖాస్తుతో పాటు పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు ఖాతా పుస్తకం లేదా పాసుక్ జిరాక్స్ చేయాలని ప్రతులను జత తెలిపారు. మండలంలోని చిట్టాపూర్ క్లస్టర్లో 32 మంది, మల్లాపూర్ ముత్యంపేట్ మొగిలిపేట్ పాతదా మ్రాస్టల్లి క్లస్టర్లో అర్హులైన రైతులందరూ గడువులోగా దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వ పథకం ప్రయోజనాలను పొందాలనివిజ్ఞప్తి చేశా రు. మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయ అధికారికి అందజేయాలని తెలియజేశారు.



# 15 ఏళ్లుగా అందని పట్టాదారు పాస్‌బుక్

- కాడెడ్లు, నాగలితో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన రైతు
- మొగుళ్లవంపు గ్రామంలో సంచలనం రేపిన వినూత్న నిరసన..
- రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని ఎమ్మార్వో అయ్యప్ప హామీ!



**యాచారం, జూన్ 29 (జనం సాక్షి) :** గత 15 ఏళ్లుగా ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తన భూమి సమస్య పరిష్కారం కావడం లేదని తీవ్ర ఆవేదన చెందిన ఓ రైతు, వ్యవసాయ పనులకు ఉపయోగించే కాడెడ్లు, నాగలితో నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి నిరసన చేపట్టడం మండల వ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది. మండల పరిధిలోని మొగుళ్లవంపు గ్రామానికి చెందిన బత్తెనగారి పాండురంగారెడ్డి తన అన్నదమ్ములతో కలిసి సర్వే నంబర్ 98లో మొత్తం 16 ఎకరాల 20 గుంటల భూమి కలిగి ఉన్నారు. ఇందులో గతంలో 1985లో 8 ఎకరాలు, ఆ తర్వాత 1993లో మరో 4 ఎకరాల భూమిని విక్రయించారు. మిగిలిన 4 ఎకరాల 20 గుంటల భూమిలో తన వాటాగా రావాల్సిన 3 ఎకరాల భూమికి పట్టా పాస్‌బుక్ మంజూరు చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సదరు రైతు గత 15 ఏళ్లుగా అధికారులను కోరుతున్నారు. అయితే, ఎన్నిసార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోకపోవడంతో, సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుండటంతో విసిగి వేసారిపోయిన రైతు పాండురంగారెడ్డి చివరకు కాడెడ్లతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. భూమి సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రభుత్వం అందించే రైతు సంక్షేమ పథకాలు కూడా తనకు అందడం లేదని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్వయంగా గ్రామానికి వచ్చి పూర్తి వివరాలు సేకరించి తనకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మార్వో అయ్యప్ప వెంటనే స్పందించి, రైతు పూర్తి వివరాలతో కూడిన ఫిర్యాదును అందజేస్తే సంబంధిత భూమి రికార్డులను సమగ్రంగా పరిశీలించి చట్టపరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మార్వో నుంచి స్పష్టమైన హామీ లభించడంతో రైతు తన ఆందోళనను విరమించగా, అక్కడ ఉన్న అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## నైపుణ్య శిక్షణతోనే మహిళా సాధికారత

**ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాలలో ఘనంగా బ్యూటీషియన్ కోర్స్ సర్టిఫికెట్ల ప్రధానోత్సవం**



**కరీంనగర్ టౌన్, జూన్ 29 (జనం సాక్షి) :** స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన 16వ బ్యాచ్ బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్స్ విజయవంతంగా ముగిసింది. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థినులకు కళాశాల ప్రాంగణంలో సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట్ల రామకృష్ణ విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందజేసి ప్రసంగించారు. ఆధునిక కాలంలో బ్యూటీషియన్ కోర్సు అనేది మహిళలకు ఒక అద్భుతమైన స్వయం ఉపాధి అవకాశంగా మారిందని, మార్కెట్‌లో దీనికి విపరీతమైన అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. లభించిన ఈ నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థినులందరూ భవిష్యత్తులో ఉత్తమ మహిళా వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మరో విశిష్ట అతిథి, టిజిసిటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉన్నత విద్యా జేఏసీ చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, నేటి సమాజంలో విద్యార్థినులు కేవలం వృత్తి నైపుణ్యాలను మాత్రమే కాకుండా, వాటితో పాటు వ్యక్తిగత, వృత్తిగత మరియు సామాజిక నిజాయితీని, నిబద్ధతను కలిగి ఉండాలని హితవు పలికారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె. కిరణ్మయి మాట్లాడుతూ.. విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ విధమైన స్వయం ఉపాధి కోర్సులను విజయవంతంగా పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ వేడుకలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి. రాజయ్య, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జంతు శాస్త్ర విభాగ అధ్యాపకులు డి. రవీందర్రావు, డాక్టర్ టి. మహేష్, సమత, చరణ్, ప్రీతి, బ్యూటీషియన్ కోర్స్ శిక్షకురాలు లీనా, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యాబోధనతో పాటు ఉపాధి శిక్షణలో చొరవ చూపిన కళాశాల ప్రిన్సిపాల్, ఇతర ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు.

## యూనియన్ ఎన్నికల దిశగా ఆర్టీసీ అడుగులు

- రెండు, మూడు రోజుల్లో తొలి నోటీసు విడుదలకు ఏర్పాట్లు
- పోలింగ్ కేంద్రాలు, ఇన్‌ఛార్జ్‌ల వివరాలు ఎన్నికల అధికారికి అప్పగింత
- జాయింట్ లేబర్ కమిషనర్‌తో యాజమాన్యం సమీక్ష సమావేశం
- పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు సమన్వయ చర్యలు

**ముషీరాబాద్, జూన్ 29 (జనం సాక్షి):** టీజీఎస్ ఆర్టీసీలో యూనియన్ ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు త్వరలో తెరపడనుంది. ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు ఆర్టీసీ యాజమాన్యం కసరత్తు వేగవంతం చేసింది. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ అధికారిగా నియమించిన జాయింట్ లేబర్ కమిషనర్ ఇప్పటికే ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమావేశమై ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంతో యూనియన్ వేరిఫికేషన్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల నిర్వహణలో కీలకమైన పోలింగ్ కేంద్రాల వివరాలతో పాటు బూత్ ఇన్‌ఛార్జ్‌ల జాబితాను ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే ఎన్నికల అధికారికి అందజేసింది. పోలింగ్ ప్రక్రియను ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని పరిపాలనా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా మరో రెండు, మూడు రోజుల్లో తొలి నోటీసును విడుదల చేసేందుకు ఎన్నికల నిర్వహణ అధికారి ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి నోటీసు అనంతరం ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన తదుపరి షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశముంది. యూనియన్ ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించే లక్ష్యంతో ఆర్టీసీ యాజమాన్యం ఎన్నికల అధికారితో నిరంతరం సమన్వయం కొనసాగిస్తోంది. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా అన్ని అంశాలను ముందస్తుగా పరిశీలిస్తూ ఏర్పాట్లు పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది.

## టిఆర్ఎస్ నాయకులవి చిల్లర రాజకీయాలు

- వారిని చూసి తాండూరు ప్రజలు అసహ్యించుకుంటున్నారు.
- డీసీసీ అధికార ప్రతినిధి, న్యాయవాది గోపాల్



**తాండూరు జూన్ 29(జనంసాక్షి) :** తాండూరు మున్సిపల్ కార్యాలయంలో గత శనివారం నిర్వహి ంచిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో టిఆర్ఎస్ (బీఆర్ఎస్) నాయకులు సృష్టించిన అనవసర రచ్చ, చిల్లర రాజకీయాలను చూసి తాండూరు ప్రజలు అసహ్యించుకుంటున్నారని డీసీసీ అధికార ప్రతినిధి, న్యాయవాది గోపాల్ అన్నారు. ఎలాంటి పక్షపాతం లేకుండా, అధికారుల సమక్షంలో పారదర్శకంగా డ్రా విధానంలో లబ్ధిదారుల ఎంపిక చేపట్టగా, దానిని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అనుచితంగా ప్రవర్తించారని ఆయన విమర్శించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులపై సమగ్ర విచారణ అనంతరం సిద్ధం చేసిన జాబితా నుంచి బహిరంగంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించబడిందన్నారు. రహస్యంగా కాకుండా అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఈ ఎంపిక కార్యక్రమం నిర్వహించడం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పరిపాలనా దక్షతకు, పారదర్శకతకు నిదర్శనమని పేర్కొన్నారు. దీనిని కూడా సహించలేక కొంతమంది బీఆర్ఎస్ నాయకులు మీడియా దృష్టిలో పడేందుకు అనవసర హంగామా చేశారని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో ప్రజలు బీఆర్ఎస్ నాయకుల చిల్లర రాజకీయాలను చూసి తగిన గుణపాఠం చెప్పినా, ఇప్పటికీ వారి వైఖరిలో మార్పు రాలేదని విమర్శించారు. తాండూరు అభివృద్ధికి సంబంధించిన ప్రతి కార్యక్రమంలో ఆటంకాలు సృష్టించడం బీఆర్ఎస్ కౌన్సిలర్లకు అలవాటైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమే అయినప్పటికీ, అనంతరం ప్రజా అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా వ్యవహరించా లని సూచించారు. తాండూరు అభివృద్ధికి ఆటంకం కలిగించే విధానాలను వెంటనే మానుకొని, స్థానిక ఎమ్మెల్యేకు సహకరించాలని కోరారు. లేదంటే ప్రజల్లో చరిత్రహీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు.

### ఇండ్ల స్థలాల కోసం జూలై 1న జరిగే
## ధర్నాను విజయవంతం చేయాలి

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.రామస్వామి**



**చేవెళ్ల, జూలై 29 (జనంసాక్షి) :** సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఇంటి స్థలాలు కేటాయించాలని, ఇండ్ల స్థలాల కోసం జూలై 1న చలో ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నాను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.రామస్వామి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో మండల పార్టీ సహాయ కార్యదర్శి ఎండి.మక్బూల్ అధ్యక్షతనలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి కే.రామస్వామి హాజరై మాట్లాడుతూ.. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు కేటాయించాలని, గుడిసెలు వేసుకున్న గుడిసె వాసులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని గతంలో పట్టాలు ఇచ్చి ఇళ్ళ స్థలాలు చూపించని వారికి స్థలాలను చూపించాలని డిమాండ్ చేశారు. జూలై 1వ తేదీన వేలాది మందితో చేవెళ్లలోని ఆర్డీవో కార్యాలయం ముందు ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాలపార్టీ శ్రేణులు ప్రజా సంఘాల నాయకులు కార్మికులు కర్షకులు రైతులు ఇండ్లు లేని నిరుపేదలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభు లింగం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అండగా నిలవాలి

- ప్రత్యేక వేదికలతో యువతకు అవకాశాలు కల్పించాలి
- ఆవిష్కరణలకు ఇంక్యుబేషన్ కేంద్రాలు అవసరం: మంత్రి టీజీ భరత్
- ఆల్ ఇండియా ఆర్య వైశ్య ఇండస్ట్రియలిస్ట్స్ ఫోరమ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం
- వచ్చే ఏడాది పారిశ్రామిక ప్రదర్శనకు ఏపీ ప్రభుత్వం పూర్తి సహకారం




**శేరిలింగంపల్లి, జూన్ 29 (జనం సాక్షి):** దేశ ఆర్థికాభివృద్ధిలో యువ పారిశ్రామికవేత్తల పాత్ర ఎంతో కీలకమని, వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు సమిష్టిగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మార్గనిర్దేశం చేసే ప్రత్యేక వేదికలు, ఇంక్యుబేషన్ కేంద్రాలు, ఆవిష్కరణల హబ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా దేశ పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించవచ్చని ఆయన అన్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మాదాపూర్ నోవాటెల్ హోటల్ లో సోమవారం నిర్వహించిన ఆల్ ఇండియా ఆర్య వైశ్య ఇండస్ట్రియలిస్ట్స్ ఫోరమ్ జాతీయ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి టీజీ భరత్ ఈ సందర్భంగా మాట్లాడారు. యువతలో వ్యాపార స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, వినూత్న ఆలోచనలకు ప్రోత్సాహం అందించే వ్యవస్థలు బలోపేతం కావాలని సూచించారు.

పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే యువ పారిశ్రామికవేత్తలకు సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక సలహాలు, మార్కెటింగ్ అవకాశాలు, ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించడంలో ఇటువంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి అన్నారు. ఒకే వేదికపై వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు, పరిశ్రమల నిపుణులు, యువ పారిశ్రా మికవేత్తలు కలుసుకోవడం ద్వారా కొత్త అవకాశాలు సృష్టించబ డతాయని పేర్కొన్నారు.

దేశ ఆర్థిక పురోగతిలో భాగస్వామ్యాలే ప్రధాన బలమని, భవిష్యత్ పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక సెల్‌లు ఏర్పాటు చేసి నిరంతర మార్గదర్శకత్వం అందించా ల్సిన అవసరం ఉందన్నారు. స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఇటువంటి ఫోరమ్‌లు బలమైన వేదికగా నిలుస్తాయని చెప్పారు. ఆర్య వైశ్య సమాజం వ్యాపార రంగంతో పాటు దాతృ త్వం, సామాజిక సేవలోనూ విశిష్టమైన సంప్రదాయాన్ని కొనసాగి స్తోందని మంత్రి కొనియాడారు. ఆల్ ఇండియా ఆర్య వైశ్య ఇండస్ట్రియలిస్ట్స్ ఫోరమ్ సభ్యత్వం తనకు కూడా ఇవ్వాలని సరదాగా కోరుతూ సభికులను ఆకట్టుకున్నారు. వచ్చే ఏడాది ఫోరమ్ నిర్వహించే పారిశ్రామిక ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఫోరమ్ పారిశ్రామిక ప్రదర్శన లోగో, బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆల్ ఇండియా ఆర్య వైశ్య ఇండస్ట్రియలిస్ట్స్ ఫోరమ్ జాతీయ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఫోరమ్ జాతీయ అధ్యక్షుడిగా భవాని సురేష్ చారుగుండ్ల, ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణ ఎర్రం, ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్ పడకంటి, సంయుక్త కార్యదర్శిగా వంశీ నెలాంటి, కోశాధికారిగా శివకుమార్ బొగ్గరితో పాటు మొత్తం 47 మంది జాతీయ కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

ఫోరమ్ నూతన జాతీయ అధ్యక్షుడు భవాని సురేష్ చారుగుండ్ల మాట్లాడుతూ దేశ తయారీ రంగంలో నాణ్యత, సాంకేతిక పురోగతి, సుస్థిర పారిశ్రామికాభివృద్ధి సాధనకు ఫోరమ్ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి పరిశ్రమల స్థాపనకు అవసరమైన మార్గనిర్దేశం, సాంకేతిక సహాయం, వ్యాపార సలహాలు అందించడమే ఫోరమ్ ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల, పసుపు బోర్డు ఎండీ భవానీ శ్రీ, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, జీఎస్టీ కమిషనర్ సాయి కిషోర్, బీజేపీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ కుమార్, టీపీసీసీ ప్రచార కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్, టీజీఓఏ అధ్యక్షుడు కృష్ణమూర్తి, రాష్ట్ర ప్రభుత్వ ఉప కార్యదర్శి లింగమూర్తి, పలువురు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాలో మైనర్లు డ్రైవర్లు

- బాలలు ప్రాణాలకు తెగించి ట్రాక్టర్లు నడుపుతున్నారు
- మోటార్ వెహికల్ యాక్ట్ ఉల్లంఘన.. అధికారుల నిర్లక్ష్యం
- రోడ్లు ధ్వంసం.. వర్షాకాలంలో ముంపు ముప్పు
- గ్రామస్థుల ఆందోళన.. వెంటనే చర్యలు తీసుకోవాలి



**ముత్తారం, జూన్ 29 (జనం సాక్షి):** ముత్తారం మండలం మానేరు నుండి పలు గ్రామాలకు అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. 14-18 ఏళ్ల మైనర్ బాలురు లైసెన్స్ లేకుండా ట్రాక్టర్లు ఓవర్‌లోడ్‌తో నడుపుతూ ప్రాణాలకు తెగించి ఇసుక తరలిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా జరుగుతున్న ఈ అక్రమ రవాణా బాలలను నేరస్తులుగా మారుస్తున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.
మానేరు పరివాహక ప్రాంతం నుంచి రామగిరి, ముత్తారం మండలాలలోని వివిధ గ్రామాలకు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. గత నెలలో పలు గ్రామాల వద్ద మైనర్ డ్రైవర్లు నడిపిన ప్రమాదాలు జరిగాయని గ్రామస్థులు చెబుతున్నారు. "పిల్లల చేతికి ట్రాక్టర్లు ఇచ్చి రాత్రి పగలు తేడా లేకుండా స్పీడ్‌గా తరలిస్తుంటే ప్రమాదాలతోపాటు రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి" అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం 18 ఏళ్ల లోపు వాళ్లు వాహనం నడపడం నేరం. పట్టుబడితే వాహన యజమానికి రూ.25 వేలు జరిమానా, 3 ఏళ్ల జైలు శిక్ష పడుతుంది అని తెలిసినా అనుమతి లేకుండా మైనర్ డ్రైవర్లతో ఇసుక తరలిస్తున్న అధికారులు కేసులు నమోదు చేయడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామస్థులు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ముత్తారం ఎస్ఐ ఎన్.రవి కుమార్‌ను వివరణ కోరగా, "మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. రాత్రి వేళ పెట్రోలింగ్ చేస్తూ ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవడంతోపాటు వాహనాల ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలపై చర్యలు చేపడతామని తెలిపారు. తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి వివరణ కోరగా డిపివోలు సర్పంచ్‌లతో గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం. మైనర్లతో వాహనాలు నడిపిస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వెంటనే స్పందించి మైనర్ డ్రైవర్లను, ఓవర్‌లోడ్ ట్రాక్టర్లను సీజ్ చేయాలని, రోడ్లు బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. బాలలను నేరస్తులుగా మార్చే ఈ వైనం వెంటనే అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజావాణికి చేరిన శ్రీ చైతన్య భాగోతం



- కలెక్టర్ సీరియస్ - సత్వర పరిష్కారానికి ఆదేశం
- లక్షల పన్నుల ఎగవేత.. ప్రభుత్వ ఆస్తుల అక్రమ వాడకం
- జిల్లా పంచాయతీ అధికారి, విద్యాధికారి నిర్లక్ష్యం
- రూ.300 బకాయికి ముక్కుపిండి వసూలు..
- లక్షలు ఎగవేసిన కార్పొరేట్ స్కూల్‌ను వదిలేస్తారా?



**కామారెడ్డి, జూన్ 29 (జనం సాక్షి):** భిక్నూర్ పట్టణ కేంద్రంలోని "శ్రీ చైతన్య విద్యానికేతన్ హై స్కూల్" సాగిస్తున్న లక్షల రూపాయల పన్నుల ఎగవేత, ప్రభుత్వ ఆస్తుల అక్రమ వాడకం ఉదంతం ఎట్టకేలకు జిల్లా అత్యున్నత ప్రజా ఫిర్యాదుల వేదికైన 'ప్రజావాణి'కి చేరింది. ఈ అక్రమాలపై సాక్ష్యాధారాలతో గతంలో జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేసినా, సదరు అధికారులు కార్పొరేట్ ఒత్తిళ్లకు లొంగి తీవ్ర నిర్లక్ష్యం వహించారని సామాజిక కార్యకర్త బత్తుల భిక్షపతి ఆరోపించారు. క్రింది స్థాయి అధికారుల వైఖరిపై విసిగిపోయిన ఆయన సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను నేరుగా కలిసి ఆధారాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.
ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన జిల్లా పాలనాధికారి (కలెక్టర్), దీనిపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లక్షల రూపాయల పంచాయతీ ఆదాయానికి గండి పడుతున్నా డిపివో, డిఈఓ కార్యాలయాలు ఎందుకు స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్ను బకాయిలు రికవరీ చేయడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన స్కూల్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ప్రజా ప్రతినిధుల అండ - అధికారుల నిర్లక్ష్యం!**

భిక్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఒక సామాన్యుడు కేవలం 500 రూపాయల ఇంటి పన్ను బకాయి పెడితే ముక్కుపిండి వసూలు చేసే అధికారులు, లక్షల రూపాయల ఫీజులు గుంజుతూ 15 ఏళ్లుగా ప్రభుత్వ మార్కెట్ స్థలాన్ని అక్రమంగా వాడుకుంటున్న ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాన్ని ఎందుకు వదిలేస్తున్నారని భిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారుల కాళ్లకు కళ్లెం వేస్తున్నారని మండిపడ్డారు. గత 10 ఏళ్లలో సంత ద్వారా మాత్రమే 60 లక్షల ఆదాయం వచ్చిన చోట, స్కూల్ వల్ల పంచాయతీకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని లెక్కలతో వివరించారు.
పాఠశాలలో 500 మంది పిల్లలు చదువుకుంటుండగా కేవలం 5 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని, విద్యా హక్కు చట్టం ఉల్లంఘన, అనర్హ టీచర్లు, పాఠశాల ప్రాంగణంలో పుస్తకాల వ్యాపారం వంటి అక్రమాలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

**న్యాయం జరగకపోతే హైకోర్టు, లోకాయుక్త ఆశ్రయిస్తాం:**

కార్పొరేట్ స్కూల్ అక్రమాలకు అండగా నిలుస్తున్న ప్రజా ప్రతినిధులు, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల ఆటలు ఇక సాగవని భిక్షపతి స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల అమలు జరగకపోతే అధికారులను, స్కూల్ యాజమాన్యాన్ని ప్రతివాదులుగా చేర్చి హైకోర్టులో ౹ా×ూ దాఖలు చేస్తామని, లోకాయుక్తను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.
ప్రజావాణి ద్వారా కలెక్టర్ నేరుగా రంగంలోకి దిగడంతో భిక్నూర్‌లో సామాన్యుడికి ఒక న్యాయం, కార్పొరేట్ సంస్థలకు మరొక న్యాయం అనే తీరు మారుతుందా లేదా అనేది ప్రస్తుతం సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

# భార్యను చంపి భర్త బలవన్మరణం



**మల్యాల జూన్ 29 (జనం సాక్షి) :** భార్యను హత్య చేసి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సంచలనం రేపింది వివరాల్లోకి వెళితే మల్యాల మండలం నూకపల్లి గ్రామంలో వోలపు నాగరాజు (40) భార్య లక్ష్మి (32)ని హత్య చేసి అనంతరం అతడు ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. సోమవారం ఉదయాన్నే గమనించిన స్థానికులు గ్రామ పెద్దలకు పోలీసులకు సమాచారం అందించారు.సీఐ మాదాసు రాజకుమార్,ఎస్సై సందీప్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల నుండి వివరాలు సేకరించారు.స్థానికల సమాచారం ప్రకారం నాగరాజు మద్యానికి బానిస అయ్యాడని కుటుంబ కలహాల కారణంగానే సంఘటన జరిగినట్లుగా భావిస్తున్నారు.పోలీసులు విచారణ అనంతరం కేసు నమోదు చేసుకుని మృతదేహాలను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.నాగరాజు లక్ష్మి ని టవల్తో గొంతుకు చుట్టి హత్య చేసినట్లుగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తుంది,పోలీసులు కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ

**కొడంగల్, (జనంసాక్షి):** కొడంగల్ పట్టణ కేంద్రంలోని బూత్ నంబర్ 239లో ఓటరు సమగ్ర సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు ఎన్యూమరేషన్ (జుఅబఎవతీఫఅశీఅ) పత్రాలను బిఎల్ఓ ప్రభాకర్,బిఎల్ఏ. ఎస్. సోమశేఖర్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బిఎల్ఏ. సోమశేఖర్ మాట్లాడుతూ ఇంటింటికి వచ్చే బిఎల్ఓలకు ఓటర్లు సహకరించి,ఎన్యూమరేషన్ పత్రాలను తప్పులు లేకుండా పూరించి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఓటర్లు పాల్గొన్నారు.

# మహేశ్వరం శ్రీ చైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

- నిబంధనలను తుంగలో తొక్కిన శ్రీ చైతన్య స్కూల్
- తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త యాదగిరి



**మహేశ్వరం,జూన్ 29(జనం సాక్షి):** మహేశ్వరం మండల కేంద్రంలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి బెస్త యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలోని శ్రీ చైతన్య స్కూల్ ను సందర్శించారు.ఈ సందర్భంగా బెస్త యాదగిరి మాట్లాడుతూ... శ్రీ చైతన్య స్కూల్ యజమాన్యం సొంత రవాణా వ్యవస్థను వాడకుండా చట్ట విరుద్ధంగా సాధారణ ప్రవేట్ వాహనాలలో విద్యార్థులను తరలిస్తున్నారన్నారు. శ్రీ చైతన్య స్కూల్లో పదవ తరగతికి అనుమతి లేదన్నారు.శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం ఫీజులు మాత్రం శ్రీ చైతన్య స్కూల్ అధికారిక బిల్ బుక్స్ ఉపయోగిస్తున్నారన్నారు.సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులు ఖచ్చితంగా పసుపు రంగులో ఉండాలన్నారు. శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం కేవలం లాభాల కోసం ప్రవేట్ బస్సుల నిర్వాహకులతో కుమ్మకై తల్లిదండ్రులను మోసం చేస్తుందన్నారు. శ్రీ చైతన్య స్కూల్ పై విద్యాశాఖ అధికారులు వారం రోజుల్లోగా చర్యలు తీసుకోవాలన్నారు.లేకపోతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి భారీ ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు.

# లక్ష్మణరేఖ దాటొద్దని హెచ్‌సీఏకు టీసీఏ హెచ్చరిక

- బాంబే హైకోర్టు పెండింగ్ విచారణను విస్మరించొద్దు : టీసీఏ
- అంబటి రాయుడు అకాడమీల ప్రకటనపై తీవ్ర అభ్యంతరం
- బీసీసీఐ ఆదేశాలు ఉల్లంఘిస్తే న్యాయపోరాటం తప్పదు

**సికింద్రాబాద్, జూన్ 29 (జనం సాక్షి):** తెలంగాణ జిల్లాల్లో ఏకపక్షంగా క్రికెట్ కార్యకలాపాలు నిర్వహించే ప్రయత్నం చేస్తే చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) హెచ్చరించింది. బాంబే హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న విచారణను, బీసీసీఐ జారీ చేసిన బైండింగ్ ఆదేశాలను విస్మరిస్తే అది న్యాయపాలనను సవాలు చేయడమే అవుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు టీసీఏ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి సోమవారం ప్రకటన విడుదల చేశారు. కోర్టులు, బీసీసీఐ ఇప్పటికే ఒక లక్ష్మణరేఖ గీశాయని, హెచ్‌సీఏ దానిని దాటితే చట్టం కల్పించిన అన్ని మార్గాల్లో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

**అంబటి రాయుడు అకాడమీలపై అభ్యంతరం**

మాజీ భారత క్రికెటర్ అంబటి రాయుడు సమన్వయంతో ఎనిమిది తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అకాడమీలు ఏర్పాటు చేస్తామన్న హెచ్‌సీఏ ప్రకటనపై గురువారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంత గొప్ప క్రికెటర్ అయినా న్యాయవ్యవస్థకు అతీతులు కాదన్నారు. బహిరంగ ప్రకటనలు చేసే ముందు చట్టపరమైన పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. 2021 జూలై 11న బీసీసీఐ ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను, కోర్టు ముందు ఇచ్చిన హామీలను హెచ్‌సీఏ అమలు చేయాలని గుర్తు చేశారు. ఆ నమ్మకంతో 2025, 2026లో ఉమ్మడి సమావేశాలు జరిగాయని, ఇప్పుడు దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. జిల్లా క్రికెట్‌ను అంతులేని హామీల మధ్య బందీ చేయలేమని, బీసీసీఐ అసోసియేట్ సభ్యత్వం కోసం ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. హెచ్‌సీఏ ఏకపక్ష ధోరణి వీడి సహకరించాలని, పారదర్శకంగా సుపరిపాలన అందించాలని ధరం గురువారెడ్డి డిమాండ్ చేశారు. హెచ్‌సీఏ లేదా ఎవరైనా తెలంగాణ జిల్లాల్లో అధికార పరిధిని చెలాయించే ప్రయత్నం చేస్తే సివిల్, క్రిమినల్ చర్యలు, కోర్టు ధిక్కరణ చర్యలతో సహా న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# బాలికల వ్యధ వర్ణనాతీతం



- పురుగులు పారుతున్న నీటిలోనే కాల కృత్యాలు.
- 400 మంది బాలికలకు కేవలం 10 మరుగుదొడ్లు..
- ఉదయం 3 గంటల నుంచి వేచి ఉండాల్సిన దుస్థితి
- తల్లిదండ్రులతో చెప్పి ఉండలేమంటూ కన్నీరు.

**ఆర్మూర్,జూన్ 29(జనంసాక్షి):** కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వాలు వెనుకబడిన తరగతుల విద్యార్థునుల కోసం మహత్మ గాంధీ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రవేశపెట్టింది.నాణ్యమైన విద్య,ఉచిత వసతి,అధునాతన సాంకేతికతను పేద మధ్యతరగతి వారికి వరంలా మారింది.బాల్కొండ మండల కేంద్రంలో గల మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బిసి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థినుల వ్యధ మాత్రం వర్ణనాతీతంగా ఉంది.సుమారు 400 పైగా విద్యార్థినులు ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యను కొనసాగిస్తున్నారు.నాణ్యమైన విద్య, ఉచిత వసతి అంతవరకు బాగానే ఉన్నా మరుగు దొడ్లు, మూత్రశాలలు సరిగా ఉండకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అద్దె అపార్ట్మెంట్ ఇంటిలో కొనసాగుతున్న జ్యోతిబాపూలే పాఠశాలలో దాదాపు పది మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉండడమే ప్రధాన కారణమని తెలిసింది.మరుగుదొడ్లు, మూత్రశాలల్లో నీరు నిల్వ చేరడంతో బాలికలు అడుగు పెడదామంటే జంకుతున్నారని తెలిసింది.బాలికలు అంతమంది ఒకేసారి కాలకృత్యాలకు, స్నానాలకు వెళ్లాలంటే ఉదయం 3 గంటల నుండే వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు దృష్టికి తీసుకువచ్చారు. పురుగులు పారుతున్న నీటిలో కాల కృత్యాలు,ఇతరత్ర వాటికి ఇబ్బందులకు గురవుతున్నారు.పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలకు భయపడి ఒకరిద్దరూ ఇప్పటికే పాఠశాల నుండి వెళ్లిపోయారు. పాఠశాలలో చదువుతున్న బాలికలు బాత్రూంలో ఉన్న స్థితిని చూసి ఉండలేమంటూ తల్లిదండ్రులతో కన్నీరు పెట్టుకుంటున్నారని దృష్టికి వచ్చింది. అదేవిధంగా బాలికల వసతిని చూసేందుకు,బాగోగులు తెలిసేందుకు విద్యార్థుల తల్లులను పాఠశాలలో అడుగుపెట్టనివ్వడం లేదని వాపోతున్నారు.విద్యార్థి సంఘాల నాయకులు, ఉన్నతాధికారులు,నియోజకవర్గ ఎమ్మెల్యే బాధ్యత వహించి తమ సమస్యలను తీర్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


# బోడుప్పల్-చెంగిచెర్ల రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలి

- కొత్త వాటర్ లైన్లు, వాటర్ జంక్షన్లు ఏర్పాటు చేయాలి
- జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

**బోడుప్పల్, జనంసాక్షి :** బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ జోనల్ కమిషనర్‌ను కలిసి బోడుప్పల్-చెంగిచెర్ల ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోడుప్పల్-చెంగిచెర్ల రహదారి విస్తరణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే తాగునీటి సరఫరా ప్రెషర్‌ను పెంచడంతో పాటు కొత్త వాటర్ లైన్లు, కొత్త వాటర్ జంక్షన్ల ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ప్రజలకు మెరుగైన రహదారులు, నిరంతర తాగునీటి సరఫరా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా బలోపేతమైన నీటి పంపిణీ వ్యవస్థ అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, బొమ్మకు కళ్యాణ్ కుమార్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, బింగి జంగయ్య యాదవ్, చీరాల నరసింహ పాల్గొన్నారు.

## ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను
# సాకారం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

### ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బిఎంఆర్



**తాండూరు జూన్ 29(జనంసాక్షి) :** తాండూరు మండలం నారాయణపూర్ గ్రామంలోని మంతట్టి నర్సమ్మ అశోక్, స్వప్న కృష్ణ , ఉరేడి యాదప్ప ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు గౌరవప్రదమైన జీవనం గడపడానికి ఇలాంటి సంక్షేమ పథకాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో అనేక కుటుంబాలు శాశ్వత నివాస సౌకర్యాన్ని పొందుతున్నాయని, భవిష్యత్తులో కూడా ప్రజా సంక్షేమం కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డ్ మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# వసతులు లేకున్నా అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు

- జిల్లాలో స్టేడియాన్ని నిర్మించాలి
- ఒలంపిక్ రన్‌ను ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 29: జనం సాక్షి :** జిల్లాలో క్రీడాకారులకు వసతులు లేకున్నా ఆయా క్రీడాంశాల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు.జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలంపిక్ రన్ ను నగరంలోని ఆర్ఆర్ చౌరస్తా వద్ద క్రీడా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒలంపిక్స్ అంటే కేవలం క్రీడలు మాత్రమే కాదని, ప్రపంచ దేశాల మధ్య స్నేహం శాంతి బాధ్యతకు ప్రతీక అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రమశిక్షణ అంకితభావం జట్టు భావన క్రీడల ద్వారా అలవాడతాయన్నారు.జిల్లాలో సరైన సౌకర్యాలు లేవని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్టేడియం నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికే అనేకసార్లు మంత్రుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ చొరవ తీసుకొని స్టేడియం నిర్మాణానికి కృషి చేయాలన్నారు. జిల్లా నుంచి అంతర్జాతీయ క్రీడాకారులు గూగులోతు సౌమ్య, ఎండల సౌందర్య, హుసాముద్దీన్ తదితరులు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మేయర్ కూరగాయల ఉమారాణి, ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధులు భక్తవత్సలం, బొబ్బిలి నరసయ్య, ఆయా క్రీడా సంఘాల ప్రతినిధులు, బిజెపి కార్పొరేటర్లు నాగోల లక్ష్మీనారాయణ, బట్టు రాఘవేందర్, మల్కాయి మహేందర్, జ్యోతి మురళి తదితరులు పాల్గొన్నారు.

# వార్డుల్లో దర్జాగా అక్రమ నిర్మాణాలు



**ఆర్మూర్, జూన్ 29 (జనంసాక్షి):** ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా సెటర్లు వేసి నిర్మాణం జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు.అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.పట్టణ కేంద్రంలోని మూడో వార్డు,20వ వార్డు,23వ వార్డులో అక్రమ నిర్మాణ ఇంటి యజమానులు మున్సిపాలిటీ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి భవనాలను నిర్మిస్తున్నారని స్థానికుల ఆరోపిస్తున్నారు.సెట్ బ్యాక్ లేకుండా,పార్కింగ్ స్థలం వదలకుండా విచ్చలవిడిగా నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కడుతుంటే నోటీసులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొందరు అధికారులు, స్థానిక నాయకులు ఇంటి యజమానులతో కుమ్మక్కై అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారనే అనుమానాలను బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు.నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ నిర్మాణం చేపట్టి పర్మిషన్ ఫీజులు, డెవలప్మెంట్ చార్జీలను భవన నిర్మాణ యజమానులు తప్పించుకుంటున్నారు. దీనివల్ల మున్సిపాలిటీకి లక్షల్లో ఆదాయం తగ్గుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి ప్రత్యేక బృందాలతో సర్వే చేయించాలి.అక్రమ అంతస్తులను కూల్చివేయడంతో పాటు,అనుమతి లేని నిర్మాణాలకు భారీ జరిమానాలు విధించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# వ్యవసాయాన్ని పలోపేతానానికి కృషి

- రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటాం
- సహకార సంఘం (నాస్కబ్)చైర్మన్ కొండూరి రవీందర్ రావు



**గంభీరావుపేట జూన్ 29(జనం సాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని ప్రాథమిక సహకార సంఘ కార్యాలయంలో సంఘ వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం రోజు (నాస్కబ్ చైర్మన్) సహకార సంఘ చైర్మన్ కొండూరి రవీందర్రావు చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ చేశారు, వారు మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా వ్యవసాయాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి కావలసిన విత్తనాలు ఎరువులు సకాలంలో అందిస్తున్నామని ఆయన అన్నారు భారతదేశంలోని సహకార సంఘం 122 సంవత్సరాలు ఐతున్నప్పటికీ ఆనాటి నుండి ఇప్పటివరకు సహకార సంఘం బలోపేతం జరుగుతుందని తెలిపారు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నుండి సహకార సంఘ వ్యవస్థ చాలా అభివృద్ధి జరిగిందని ఆయన తెలిపారు, సహకార సంఘం నుండి వడ్ల కొనుగోలు ఎరువులు విత్తనాలు సకాలంలో అందించుకుంటూ వెళుతున్నామని దీనికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ రామంజగౌడ్, భీమ్లా నాయక్, మోతే దేవి రెడ్డి, ఆరుట్ల రాజిరెడ్డి, కార్యదర్శి సందుపట్ల రాజిరెడ్డి సంఘ సభ్యులు రైతులు నాయకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
30 జూన్ 2026

# తెలంగాణలో అత్యాధునిక నర్సింగ్ సిమ్యులేషన్ సెంటర్ ప్రారంభం

**టీఎన్ఏఐ ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో ఏర్పాటు**

**నర్సింగ్ విద్య, క్లినికల్ నైపుణ్యాల పెంపునకు కొత్త వేదిక**



**హైదరాబాద్, జూన్ 29 (జనంసాక్షి) :** ట్రెయిన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఎన్ఏఐ) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరోర్‌నగర్ కార్యాలయంలో అత్యాధునిక అడ్వాన్స్‌డ్ సిమ్యులేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. వైద్య విద్యా సంచాలకులు (అకాడెమిక్స్) డా. కె. శివరామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా, టీజీఎన్ఎంసీ రిజిస్ట్రార్ డా. బి. విద్యుల్లత గౌరవ అతిథిగా పాల్గొన్నారు. టీఎన్ఏఐ జాతీయ అధ్యక్షురాలు డా. అన్నీ కుమార్, సెక్రటరీ జనరల్ ఎవలిన్ పి. కన్నన్ తదితరులు హాజరయ్యారు. డా. శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ సిమ్యులేషన్ ఆధారిత శిక్షణతో నర్సింగ్ విద్యార్థుల క్లినికల్ నైపుణ్యాలు మెరుగుపడి, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడు తుందని తెలిపారు. డా. విద్యుల్లత మాట్లాడుతూ తెలంగాణలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల విద్యార్థులకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. డా. అన్నీ కుమార్ మాట్లాడుతూ లూధియానా, అండమాన్ తర్వాత టీఎన్ఏఐ ఏర్పాటు చేసిన మూడో సిమ్యులేషన్ స్కిల్ ల్యాబ్ తెలంగాణలో ప్రారంభమైందని తెలిపారు. భవనం పునరుద్ధరణతో పాటు ఈ కేంద్రం ఏర్పాటుకు టీఎన్ఏఐ సుమారు రూ.3 కోట్లు వెచ్చించిందన్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన ఈ కేంద్రం నర్సింగ్ విద్య, పరిశోధన, క్లినికల్ నైపుణ్యాలు, రోగుల భద్రతను మరింత బలోపేతం చేస్తుందని వక్తలు పేర్కొన్నారు.

# ఇస్లామిక్ పండితుడు సల్మాన్ నద్వీ కన్నుమూత



**లక్నో, జూన్29 (జనంసాక్షి) :** అయోధ్య రామ జన్మభూమి - బాబ్రీ మసీద్ వివాదానికి చర్చల మార్గాన్ని బహిరంగంగా సమర్థించిన ప్రముఖ ఇస్లామిక్ పండితుడు మౌలానా సల్మాన్ నద్వీ(72) లఖ్‌నవూ లో కన్నుమూశారు. మత సామరస్యం, పరస్పర సంభాషణకు ప్రాధాన్యం ఇచ్చిన ముస్లిం మతపెద్దగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన.. అనారోగ్య సమస్యలతో సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. 2018లో అయోధ్య వివాదానికి చర్చల ద్వారా పరిష్కారం కనుగొనే ప్రయత్నాల్లో భాగంగా ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్‌తో నద్వీ పలుమార్లు సమావేశమయ్యారు. వివాదాస్పద స్థలంలో రామమందిర నిర్మాణానికి అవకాశం కల్పిస్తూ, మసీదును ప్రత్యామ్నాయ స్థలంలో నిర్మించవచ్చని ఆయన ప్రతిపాదించారు. ఈ అభిప్రాయాలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీయడంతో.. కొందరు ప్రశంసించగా, మరికొందరు విమర్శించారు. అయితే.. నద్వీ అభిప్రాయాలను ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధికారిక వైఖరిగా పరిగణించలేమని స్పష్టం చేసింది. దీంతో నద్వీ ఆ సంస్థ నుంచి వైదొలిగారు. చివరకు.. అయోధ్య వివాదం 2019 నవంబరులో సుప్రీంకోర్టు చారిత్రక తీర్పుతో ముగిసింది. దీని ప్రకారం రామమందిర నిర్మాణానికి మార్గం సుగమం కావడం సహా మసీదు నిర్మాణం కోసం ప్రత్యామ్నాయంగా ఐదెకరాల భూమిని కేటాయించాలని న్యాయస్థానం ఆదేశించింది. ప్రముఖ నద్వీ పండితుల కుటుంబానికి చెందిన మౌలానా సల్మాన్ నద్వీ.. దేశంలో అత్యంత గౌరవనీయమైన ఇస్లామిక్ సెమినరీలలో ఒకటైన లఖ్‌నవూలోని దారుల్ ఉలూమ్ నద్వతుల్ ఉలమాతో అనుబంధం కలిగి ఉండేవారు. దశాబ్దాలుగా ఆయన ఇస్లామిక్ ధర్మ శాస్త్రవేత్తగా, రచయితగా, వక్తగా విశేష గుర్తింపు పొందారు. ఇస్లామిక్ న్యాయశాస్త్రం, అంతర్ మత సంభాషణ, సమకాలీన సామాజిక అంశాలపై ఆయన చేసిన ప్రసంగాలు, రచనలు విశేష ఆదరణ పొందాయి.

## వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని

# అర్ధరాత్రి వేళ భర్తను హత్య చేసిన భార్య

**మహబూబ్‌నగర్, జూన్ 29 (జనంసాక్షి) :** భార్య అక్రమ సంబంధం ఓ వ్యక్తి ప్రాణాలను బలితీసుకుంది. తన అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని భావించిన భార్య భర్తను కిరాతకంగా హతమార్చింది. భర్తను కత్తితో చంపిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.. దేవరకద్ర మండలం బస్వాయి పల్లి గ్రామానికి చెందిన నాగేష్ (38)కు 15 ఏళ్ల క్రితం మల్కాపూర్ గ్రామానికి చెందిన కవితతో వివాహం జరిగింది. వారికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆదివారం రాత్రి భర్త నిద్రిస్తుండగా ఇంట్లో ఉన్న కత్తితో ఒక్కసారిగా భార్య దాడికి పాల్పడింది. దీంతో ఇంట్లో నిద్రిస్తున్న చిన్న కుమారుడు రాము బయటకు వచ్చి కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు వచ్చి.. రక్తపు మడుగులో ఉన్న నాగేష్‌ను ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా ఆసుపత్రి నుంచి ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య కవితను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ హత్య వెనుక భార్య అక్రమ సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

# కొడంగల్‌లో 33వేల డూప్లికేట్ ఓట్లు

- **రేవంత్ గెలిచింది ఆ ఓట్లతోనే**
- **టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు**



**హైదరాబాద్, జూన్ 29 (జనంసాక్షి) :** దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని.. వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో కేవలం 800 ఓట్లు మాత్రమే తొలగించారని కవిత అన్నారు. కొండగల్‌లో తాము వెరిఫై చేస్తే 33వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి 32వేల మెజారిటీతో గెలిచారని అన్నారు. ఈ డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని తమకు అనుమానం ఉందని చెప్పారు. కర్ణాటక నుంచి నోటు ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఓటు ట్రాన్స్‌ఫర్ అయిందా అనే అనుమానం తమకు కలుగుతోందని కవిత పేర్కొన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. 'సర్' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను వెంటనే పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ఏపీలో కూడా ఓటు ఉందని... ఎక్కడైనా ఒక చోటు మాత్రమే ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఇంటర్ స్టేట్ డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. ఎన్నికల సంఘానికి ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తామని కవిత పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ దోపిడీతో తెలంగాణ విధ్వంసం

- లక్షల కోట్ల అప్పులు మిగిల్చిన బీఆర్ఎస్
- మాధవ సేవ - మానవ సేవే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్రాన్ని మేము నెంబర్ వన్ గా నిలబెడతాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మధిర, జూన్ 29 (జనంసాక్షి):** బీఆర్ఎస్ పాలకులు ఆర్థిక, సామాజిక దోపిడీకి పాల్పడి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పాలను తమ కుటుంబం కోసం తమ నలుగురి కోసం అన్నట్లుగా పదేళ్లు చేశారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సంపదను నలుగురు కుటుంబ సభ్యులు దోచుకొని ఆ డబ్బుతో నాలుగు చానళ్లు పత్రికలు సోషల్ మీడియా ద్వారా అబద్దాలు పోగేసి ప్రజా ప్రభుత్వం పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాడు ఉపముఖ్యమంత్రి సతీసమేతంగా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభ ప్రాణప్రతిష్ట మహా కుంభాభిషేక ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి దంపతులకు వేద పండితులు, అర్చకులు అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయన వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం మాధవ సేవ మానవ సేవ అనే మన సంస్కృతి విలువలతో ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అవసరాలు తీర్చడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నిలబెట్టగలమని భారత రాజ్యాంగం స్పష్టంగా చెబుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఇదే లక్ష్యంతో ముందుకు వెళ్తోందని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై ఉప ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆనాటి ప్రభుత్వంలో ఒకరిద్దరు వ్యక్తులు రాష్ట్ర వనరులన్నింటినీ కొల్లగొట్టి, దోపిడీ చేశారని తీవ్రస్థాయిలో ఆరోపించారు. నాలుగు కోట్ల ప్రజల సంక్షేమాన్ని పక్కనబెట్టి, కేవలం నలుగురి సంక్షేమం, అభివృద్ధి కోసమే ఆనాడు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారని విమర్శించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వానికి అప్పగిస్తే.. ఆ నిధులన్నింటినీ కరిగించి మరో 8 లక్షల కోట్ల రూపాయల అప్పులను మిగిల్చారని డిప్యూటీ సీఎం ధ్వజ మెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి నాలుగు పాయింట్ ఐదు లక్షల ఇందిరమ్మ ఇండ్లను తమ ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఇందుకోసం 22,500 కోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రజా ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. రాష్ట్రంలోని 1.06 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌లో కిలో రూ. 50–55 ధర ఉన్నప్పటికీ, పేద కుటుంబాల్లో ఏ ఒక్కరూ కూడా నాణ్యమైన ఆహారానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రతి వ్యక్తికి 6 కేజీల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. మహిళలు తీసుకునే టికెట్లకు సంబంధించిన నగదును ప్రభుత్వమే ఆర్టీసీకి చెల్లిస్తోందన్నారు. ఇప్పటివరకు దాదాపు 10,600 కోట్ల రూపాయలను ఈ పథకం కింద ఆర్టీసీకి ఆర్థిక శాఖ చెల్లించడం జరిగిందన్నారు.

మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజ్ ద్వారా రూ. 20,000 కోట్ల రుణాలు అందిస్తూ, 5 సంవత్సరాలలో లక్ష కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలను ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గతంలో ఉన్న రూ. 5 లక్షల సీలింగ్‌ను రూ. 10 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఆరోగ్యశ్రీ అస్తవ్యస్తంగా మారి పేదలు ఆస్తులు అమ్ముకునే పరిస్థితి వచ్చిందని, దానిని మారుస్తూ ప్రస్తుత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు పెంచిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. డైట్ చార్జీలను 40%, కాస్మోటిక్ చార్జీలను 200% పెంచడం జరిగిందని తెలిపారు. అత్యంత మానవీయ కోణంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 20 లక్షల మంది విద్యార్థులకు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని 7 లక్షల మంది విద్యార్థులకు, మొత్తంగా 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయపు ఉచిత అల్పాహార (బ్రేక్‌ఫాస్ట్) పథకాన్ని ప్రారంభించామని చెప్పారు. వారంలో ఆరు రోజులు అల్పాహారంతో పాటు ఒకరోజు పాలు, ఒకరోజు రాగిజావ అందిస్తున్నామని అన్నారు. గత పాలకులు రాష్ట్రంలో ఎవరినీ స్వేచ్ఛగా బతకనివ్వలేదని, ప్రతి ఒక్కరి టెలిఫోన్లను ట్యాప్ చేశారని భట్టి విక్రమార్క ఆరోపించారు. భార్యాభర్తలు మాట్లాడుకున్నా, అధికారులు, రాజకీయ నాయకులు, వ్యాపారస్థులు, సినిమా ఇండస్ట్రీ వారు ఎవరు మాట్లాడుకున్నా ట్యాప్ చేసి వినే రాక్షస కోణాన్ని గత ప్రభుత్వం ప్రదర్శించిందని అన్నారు. అబద్ధాలతో ఆర్భాట ప్రచారం చేసుకుందని దుయ్యబట్టారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, డిసిసి వైస్ ప్రెసిడెంట్ వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- **రుణమాఫీ, రైతుభరోసాలో అన్నీ అబద్ధాలే**
- **రైతులకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపిన వేముల**



**నిజామాబాద్, జూన్29 (జనంసాక్షి) :** అన్నదాతలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి ఏరువాక పున్నమి శుభాకాంక్షలు తెలిపారు. రైతులు ఆనందంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. వారి కష్టఫలి తమే మనం ముద్ద మింగుతున్నామని అన్నారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులను పూర్తిగా విస్మరించిం దన్నారు. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయానికే రైతు బంధు నిధులు జమవుతుండేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లప్పుడు రైతుబంధు వేస్తున్నదని, అదికూడా అసంపూర్తిగా వేస్తుందని పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు ఎకరానికి రూ.15వేలు ఇస్తామని చెప్పి, ఇప్పటివరకు రూ.30 వేల కోట్ల రైతు బంధు నిధులను ప్రభుత్వం ఎగ్గొట్టిందని మండిపడ్డారు. మళ్లీ ఇప్పుడు కొత్తగా వర్షాకాలం రైతుభరోసా వేస్తామని చెబుతున్నారని దానికన్నా మొదలే ఇప్పటి వరకు ఎగొట్టిన రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. యూరియా, పొటాష్ వంటి ఎరువుల కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కేసీఆర్ ఉన్నప్పుడు ఎరువుల కొరత లేకుండా గోదాముల్లో నిల్వ ఉంచే వారని గుర్తుచేశారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా విషయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున అబద్దాలు చెబుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికి వెళ్లినా ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. 14 ఏండ్ల పాటు సుదీర్ఘ పోరాటం చేసి, ప్రాణాలను సైతం పణంగా పెట్టి తెలంగాణ సాధించి పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటూ, రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా ధ్వంసం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

## పేద బ్రాహ్మణ విద్యార్థులకు

# ఆర్థిక సాయం

- **ఉపకార వేతన పథకం కింద చెక్కుల అందజేత**

**హైదరాబాద్, జూన్29 (జనంసాక్షి) :** ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ విద్యార్థులకు బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అండగా నిలిచింది. విద్యా ఉపకార వేతన పథకం పేరుతో పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సాయం అందించింది. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వేదికగా అర్హులైన విద్యార్థులకు ఉపకార వేతన పథకానికి సంబంధించిన చెక్కులను అందజేశారు. కార్యక్రమ ముఖ్య అతిథి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఛైర్మన్ బసవరాజు శ్రీనివాస్, సినీ నటుడు ప్రదీప్, పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్, సుజాతమ్మ, సీహెచ్ కృష్ణ మోహన్ తదితరుల ఆధ్వర్యంలో విద్యార్థులకు చెక్కులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఛైర్మన్ బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ.. బ్రాహ్మణ పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు బ్రాహ్మణ సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

- **ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ**



**విక్టోరియా, జూన్29 (జనంసాక్షి) :** భారత్-సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్-సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు.

# విపరీతంగా పెరిగిన పాతబంగారం అమ్మకాలు

- **ధరలు పడిపోతాయన్న ఆందోళనలతో విక్రయాలు**

**ముంబై, జూన్29 (జనంసాక్షి) :** బంగారాన్ని ఆభరణంగా ధరించేందుకు కొనుగోలు చేసేవారు కొందరైతే.. పెట్టుబడి సాధనంగా భావించి కొనేవారు ఇంకొందరు. ఇలా పెట్టుబడి పెట్టిన వారికి పసిడి ఇటీవల కాలంలో 'కనక వర్షం' కురిపించింది. గడిచిన కొద్దిరోజులుగా పుత్తడి ధర దిద్దుబాటుకు లోనవుతోంది. మరింత పతనం అవుతుందన్న భయాలూ నెలకొన్నాయి. బంగారం కొనుగోళ్లను నిరాశ పరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఊతమిచ్చినట్లు అవుతుంది. దీంతో కొందరు తమ వద్ద ఉన్న పాత బంగారాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానిమోడీ కూడా బంగారం కొనవద్దని హెచ్చరించారు. ఈ క్రమంలో తమ లాకర్లలో మూలుగుతున్న బంగారాన్ని నగదుగా మార్చుకుంటున్నారని సమాచారం. ఇంకా ధర పడిపోతే ఆ మేర లాభాన్ని కోల్పోతామని భావించి విక్రయాలకు దిగుతున్నారు. ఇండియా బులియన్, జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రకారం.. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశీయ కుటుంబాలు 50 టన్నుల బంగారాన్ని విక్రయించినట్లు తేలింది. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం 43 శాతం అధికం. అంతర్జాతీయ పరిణామాలతో గడిచిన ఏడాదిగా ఆకాశమే హద్దుగా పెరిగిన పసిడి ధర.. గత కొన్నివారాలుగా తగ్గుముఖం పడుతుండడంతో లాభాల స్వీకరణకు దిగుతున్నారు. ఇంతకుమించి పెరగకపోవచ్చన్న అంచనాలే దీనికి కారణమని బులియన్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో రూ.10 గ్రాముల బంగారం ధర రూ.1.20 లక్షల మార్కుకు పడిపోవచ్చన్న అంచనాలతో తమ వద్ద ఉన్న బంగారాన్ని, పసిడి ఆభరణాలను నగదుగా మార్చుకుంటున్నారంటూ ఎకనమిక్ టైమ్స్ ఓ కథనం ప్రచురించింది. అంతర్జాతీయంగా ఇటీవల కాలంలో పసిడి ధరలు ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య తాజా ఘర్షణలతో క్రూడాయిల్ ధరలు మళ్లీ పెరిగాయి. దీనికితోడు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచొచ్చన్న అంచనాలు బంగారం ధరల పతనానికి కారణమయ్యాయి. అమెరికాలో వడ్డీ రేట్లు పెరిగితే సాధారణంగా పసిడిపై పెట్టుబడులు క్షీణిస్తాయి. బంగారం ఇలా లాకర్ల నుంచి మార్కెట్‌లోకి రావడం వల్ల ఓ విధంగా భారత్‌కు మేలే. దేశంలోని కుటుంబాల వద్ద సుమారు 30వేల టన్నుల పసిడి ఉందనేది అంచనా. అయినా ఇప్పటికీ పెద్దఎత్తున బంగారాన్ని భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఇలా పాత బంగారం మార్కెట్‌లోకి రావడం వల్ల పసిడి రీసైక్లింగ్ ఇండస్ట్రీకి ప్రయోజనం చేకూరుతుంది.

## భవనం గోడకూలి

# ముగ్గురు కార్మికుల మృతి



**జైపూర్, జూన్29 (జనంసాక్షి) :** రాజస్థాన్ జైపూర్‌లోని చందవాజీ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఓ భవనం గోడ అకస్మాత్తుగా కూలిపోవడంతో ముగ్గురు కార్మికులు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. కాగా.. కూలీలతో సహా 12 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బేస్మెంట్‌లో ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో గోడ ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు శిథిలాల్లో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు అధికారులు. శిథిలాల్లో చిక్కుకున్న మరి కొందరు కార్మికుల కోసం రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370